# ఆంధ్రదేశ చరిత్రసంగ్రహము

(క్రీ. శ. 1857 వరకు)

శ్రీ 'నార్ల' వారికి
నమస్కారములతో
మ. సో. శర్మ

మల్లంపల్లి సోమశేఖరశర్మ

V. R. NARLA MEMORIAL LIBRARY
V.R NARLA
D. P. R. I.
Acc. No.
10,010

ప్రకాశకులు:
ఆధునిక వాఙ్మయ కుటీరము
22, దివాన్ రామయ్యంగారి రోడ్డు
పురశవాకము, మద్రాసు 7.

954.84
Som

మొదటి ముద్రణము 1948


వెల రు. 1-8-0

AOUA105B145

# విషయసూచిక


| | | పుట |
|---|---|---|
| తొలిపలుకు | | vii |
| పీఠిక | | xi |
| మొదటి ప్రసంగము | ... | 1 |
| మన దేశము | | |
| ఆంధ్రదేశ విభాగములు | ... | 2 |
| శాతవాహన యుగము | ... | 8 |
| రెండవ ప్రసంగము | ... | 13 |
| బౌద్ధయుగము - ఇక్ష్వాకులు | | |
| మూడవ ప్రసంగము | ... | 25 |
| బృహత్ఫలాయనులు: శాలంకాయనులు | | |
| కందారరాజులు: పల్లవరాజులు | ... | 26 |
| విష్ణుకుండివంశపు రాజులు | ... | 27 |
| నాలుగవ ప్రసంగము | ... | 34 |
| పూర్వచాళుక్య యుగము | | |
| అయిదవ ప్రసంగము | ... | 43 |
| కళింగము : గాంగయుగము | | |

| | పుట |
|---|---|
| ఆరవ ప్రసంగము | ... 53 |
| మండలియుగము: వెలనాటి నాయకులు | |
| ఏడవ ప్రసంగము | ... 62 |
| కాకతీయ యుగము | |
| ఎనిమిదవ ప్రసంగము | ... 73 |
| మన వర్తకవ్యాపారము | |
| తొమ్మిదవ ప్రసంగము | ... 82 |
| రెడ్డిరాజ యుగము | |
| పదవ ప్రసంగము | ... 93 |
| విజయనగర సామ్రాజ్యము | |
| పదకొండవ ప్రసంగము | ... 105 |
| మహమ్మదీయ యుగము : గోలకొండరాజ్యము | |
| పన్నెండవ ప్రసంగము | ... 117 |
| మొగలాయి పరిపాలనము | |
| నిజామ్ ఉల్ ముల్క్ పరిపాలనము | ... 120 |
| కుంపిణీపరిపాలనము | ... 125 |



అమరావతీ శిల్పము

ఆధునిక వాఙ్మయ కుటీరమున దొరికే
నూతన గ్రంథములు

1. చారిత్రకవ్యాసములు (బౌద్ధయుగము) వెల రు. 1-12-0
రచయిత : మల్లంపల్లి సోమశేఖరశర్మ
మన ప్రాచీన సంస్కృతిని తెలుసుకొన
గోరేవారు తప్పక చదువవలసిన పుస్తకము.

2. 'కరుణకుమార' కథలు వెల రు. 1-8-0
ఆంధ్రదేశ గ్రామజీవితము చిత్రించే రస
వంతములైన కథలు, పిన్నలను పెద్ద
లను సమానముగ రంజింపజేసినవి.

# తొలిపలుకు

ఆంధ్రదేశముయొక్క సమగ్ర చరిత్ర రచన ఇంతవరకు తెలుగుభాషలోకూడ జరుగలేదు. ప్రస్తుతము తెలుగులో మనకు లభించు చారిత్రక గ్రంథ సముదాయమును పరిశీలించినపుడు ఆంధ్రదేశచరిత్ర తెగిపోయిన ముత్యాలహారమువలె నున్నట్లు మనకు తోచుచున్నది. ఈహారములోని ముత్యము లనేకములు మనకు కానుపించుటలేదు ; ఈ ముత్యాలను హారముగా గూర్చు సూత్రము సరిగా చేతి కందుట లేదు. చరిత్రయనగా కేవలము రాజుల యొక్కయు, రాజవంశములయొక్కయు కాలనిర్ణయము, ఆకాలములో జరిగిన యుద్ధవర్ణనము మాత్రమే కాజాలదు. ఆనాటి ప్రజల జీవితము, వారి ఆచార విచారములు, ఆహార విహారములు, సమకాలిక సంస్కృతికి వారు చేసిన సేవ మున్నగు వివరాలు తెలుపని ఏగ్రంథముగూడ సమగ్రమైన చరిత్ర కాజాలదు.

స్వతంత్ర భారతదేశములో ఆంగ్లేయచరిత్రకారుల అసత్య ప్రచారముల కెంతమాత్రమును స్థానము లేదు. ఇన్నాళ్లు మనకు విదేశీయుల రచనలే పాఠ్యగ్రంథము లైనవి. మన విద్యార్థులు విదేశీయుల అభిప్రాయాలనే చిలుకపలుకులవలె వల్లించిరి, కాని ప్రస్తుతము ఈవిధానము అంతరించి యథార్థ చరిత్రగ్రంథముల రచన జరుగవలెను. ఈయుద్దేశముతో సమగ్ర భారతదేశచరిత్రను రచించుటకు రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతను ఒక సంఘనియామకము జరిగినది. ఈసంఘముయొక్క కృషిఫలితమునకై పాఠకప్రపంచము ఎదురు చూచుచున్నది.

భారతదేశచరిత్రములో ఆంధ్రదేశచరిత్ర ఒక ప్రకాశవంత మగు అధ్యాయము. పాశ్చాత్యదేశాలు కనులు తెరవకముందే ఆంధ్రదేశము రోము మున్నగు విదేశనగరాలతో విదేశాలతో వాణిజ్య సంబంధములు గలిగి ఎగుమతులు చేయుచు ప్రఖ్యాతి కెక్కినది. తమదేశ సంపద నంతయు మనదేశము కొల్లగొట్టుచున్నదని ప్లినీ యను విదేశ చరిత్రకారుడు ఆవేదన పొందినాడు. మోటుపల్లిరేవు చరిత్ర ప్రసిద్ధమైనది. ఆంధ్రులు అనేక రాజ్యాలను సామ్రాజ్యాలను నిర్మించి, పరిపాలనదక్షతను ప్రదర్శించి నాగరక ప్రపంచమున అన్నివిధాల వన్నెకెక్కిరి. ఆంధ్రశిల్పము తూర్పు దేశాలలోను ద్వీపాలలోను గణ్యత గాంచి, ఆదేశములందలి శిల్పములకు ఒరవడియై యొప్పినది. తాజమహలు నిర్మాణమునకై ప్రత్యేకముగా ఆంధ్రదేశమునుండి శిల్పులు ఆగ్రానగరమునకు తీసికొనిపోబడినారు. ఆంధ్రదేశమందలి బౌద్ధవిహారాలు, అజంతాది గుహలు ఆంధ్రుల శిల్పమునకు చిత్రలేఖనమునకు ఉత్కృష్టోదాహరణములు. విజ్ఞాన ప్రపంచమునందును, సారస్వతరంగమందును, ఆంధ్రులు ఉన్నతస్థానము నలంకరించి నాగరక ప్రపంచమున కీర్తిగాంచి రనుటకు అనేక నిదర్శనములు కలవు. భారతీయ సంస్కృతికి ఆంధ్రుల సేవ అద్వితీయమైనది.

స్వతంత్రభారతములో ఆంధ్రులు పూర్వమువలెనే ప్రముఖ పాత్రను నిర్వహించవలసియున్నది. ప్రకాశవంతమగు చరిత్రకు అనుగుణమైన భవిష్యత్తును ఆంధ్రులు నిర్మించవలసియున్నది. రాజకీయాలు లేని చరిత్ర వేరు లేని వృక్షమువంటి దనియు, చరిత్ర లేని రాజకీయాలు ఫలవంతముకాని పండ్లచెట్టువంటి వనియు ఒక చరిత్రకారుడు వచించి రాజకీయాలకు, చరిత్రకు, సమకాలిక

సాంఘికాభివృద్ధికి, పూర్వచరిత్రకుగల సంబంధము చక్కగా నిరూపించినాడు.


కావున ప్రస్తుతము ఆంధ్రజాతి తన భావ్యభివృద్ధికై పూర్వ చరిత్రను తెలిసికొనుట మిక్కిలి అవసరము. ఋగ్వేదబ్రాహ్మణము నందు ప్రస్తావింపబడిన ఆంధ్రజాతి చరిత్ర ప్రస్తుతము కొన్ని రాజవంశాల చరిత్రగా మాత్రమే మనకు గోచరించుచున్నది. ఆది నుండియు నేటివరకు పూసగ్రుచ్చినట్లు వివరించు ఆంధ్రదేశచరిత్ర గ్రంథము ఒకటియైనను లేదు. ఆంధ్రులు ఒక్కజాతివారైనను నేడు వేరు వేరు రాజ్యములలో చెల్లాచెదరై యున్నారు. తెలంగాణము, రాయలసీమ, ఇతర ఆంధ్రదేశము - పరస్పరము వేరయినవి. ఇతర రాష్ట్రములలో ముఖ్యముగా మైసూరు, మధ్యరాష్ట్రములు, ఒరిస్సాలలో ఆంధ్రు లనేకులు వేరుపడిపోయినారు. ఆంధ్రజాతి అభ్యుదయము పొందవలెనన్నచో ఈవిధముగా చీలిపోయిన ఆంధ్రులను ఐక్యము కావింపవలెను. ఆంధ్ర హృదయము తమ దేశము ఆంధ్రదేశము, తమభాష ఆంధ్రభాష, తమ సంస్కృతి ఆంధ్ర సంస్కృతి అని ఉప్పొంగవలెను. పూర్వవైభమును సంస్మరించి భవిష్యత్తును గట్టి పునాదులమీద నిర్మింపవలెను. ఎక్కడ నున్నను మాది ఆంధ్రజాతి, మాసంస్కృతి ఆంధ్రసంస్కృతి యని ఆంధ్రుల హృదయాలు ఉత్సాహపూరితము లయినప్పుడే యీపని సాధ్యము కాగలదు.

పైని చెప్పిన లోటులను శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మగారి గ్రంథము కొంతవరకు తీర్చుచున్నది. శ్రీశర్మగారిని గూర్చి యేమయినను వ్రాయుట జగ మెరిగిన బ్రాహ్మణునకు జందెము వేయుట వంటిది. పూర్వకాలమునుండియు 1857-వ సంవత్సరము

వరకు ఆంధ్రులచరిత్రను శ్రీశర్మగారు ఈచిన్న గ్రంథములో సంగ్రహముగా వివరించినారు. పరిపక్వమయిన వారి చారిత్రక విజ్ఞానమంతయు పుస్తకరూపముగా అవతరింపజేయవలసిన గురుతర బాధ్యత ఆంధ్రదేశముమీద గలదు.

మద్రాసు,
జూలై 1948

కార్యదర్శి,
ఆంధ్ర విశ్వభారతి



అమరావతీ శిల్పము

# పీఠిక

1947 - వ సంవత్సరం జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలలో నేను ఆలిండియా రేడియో, మద్రాసు కేంద్రమునుంచి విద్యార్థుల కార్యక్రమములో ప్రసారం చేసిన ఆంధ్రదేశచరిత్ర ప్రసంగాలివి. ఆలిండియా రేడియో, మద్రాసు కేంద్రమువారు (1) సాతవాహనులు, (2) ఇక్ష్వాకులు, (3) విష్ణుకుండులు, (4) వేంగీచాళుక్యులు, (5) కళింగగాంగులు (6) వెలనాటి నాయకులు (7) ఓరుగంటి కాకతీయులు, (8) ప్రాచీనాంధ్ర వాణిజ్యము, (9) కొండవీటిరెడ్లు, (10) విజయనగర సామ్రాజ్యము, (11) గోలకొండ సుల్తానులు, (12) ఈస్టిండియా కంపెనీ కాలము: ఆంధ్రులు అనే పన్నెండు శీర్షికలక్రింద 1857 వరకు ఆంధ్రదేశ చరిత్ర వచ్చేటట్టు ప్రసంగాలు చేయవలసిందని నన్ను కోరినారు. నేనందుకు అంగీకరించి, లోటులు పూర్తిచేసి అతుకులు కలిపి దిఙ్మాత్రముగా నయినా 1857 వరకు మన ఆంధ్రదేశచరిత్ర సుబోధ మయ్యేటట్టు ఈ ప్రసంగాలు చేశాను. మొదట వీటిని ప్రకటించాలని అనుకోలేదు! కాని రేడియోలో వీటిని వినడం తటస్థించిన పెద్దలూ మిత్రులూ కొందరు వీటిని పుస్తకరూపముగా ప్రకటించవలసిందని సూచించి నందువల్లను ఉత్తరాలు వ్రాసినందువల్లను ఈవిధముగా ప్రకటించడము కలిగింది. ప్రసంగాల శీర్షికలు మాత్రం మార్చినాను. ఆంధ్ర దేశచరిత్ర 1857 వరకయినా రావడానికి, పుస్తకరూపముగా ప్రకటన కావడానికి ఆదరమూ అనుమతీ యిచ్చిన ఆలిండియా రేడియో, మద్రాసు కేంద్రమువారికి నా కృతజ్ఞతా వందనములు.


1857 వరకయినా ఇంతవరకు వచ్చిన సమగ్ర ఆంధ్రదేశ చరిత్ర - సంగ్రహంగానే యయ్యే - ఇదే మొదటిది. ఈప్రసంగాలలో వీలయినంతవరకు ఆయా యుగాలకు సంబంధించిన రాజకీయ,

సంస్కృతి చరిత్రలను రెంటిని సులువుగా బోధపడేటట్లు చెప్పాను. ఈ ప్రసంగాలు ఒక్కొకటి పదేసి నిమిషాలది అవడంవల్ల ఆకాల పరిమితిలో చెప్పడానికి వీలయినన్ని విషయాలు ముఖ్యమైనవీ పరిణామ సూచకమైనవీ చెప్పాను. అందువల్ల ఈచరిత్ర దిఙ్మాత్ర సూచకమూ, అతిసంగ్రహమూ మాత్రమే. ఈ విధముగా అయినా 1857 వరకు సమగ్రము అనుస్యూతము అయిన మనదేశచరిత్ర వెలువరుచగలిగినందుకు సంతోషిస్తున్నాను.

గ్రంథప్రకటనము ఈరోజులలో ధనికులకే కష్టసాధ్యమైన పని. ఈపుస్తకాన్ని అచ్చు వేయించుటకు వెరవు గానక త్రొక్కిళ్లాడుతున్న సందర్భములో నా కెంత మాత్రమూ పరిచయం లేని శ్రీ "ఆంధ్ర విశ్వభారతీ సంఘము" వారు ప్రకటనకు ఈ గ్రంథం ఉన్నదని విని ఉదారహృదయులై దీని ముద్రణాదికవ్యయ మంతను భరింతుమని చెప్పి, దయతో వెంటనే పైకం ఇచ్చారు. అనుకోని చోటనుంచి వచ్చిన ఈసాయానికి నేను ఆశ్చర్యచకితుణ్ని అయినాను. వారి సాయమే లేకపోయినట్టయితే ఈ పుస్తకం ఇంత త్వరలో ప్రకటన అయ్యేది కాదు. ఈ గొప్ప సాయం చేసినందుకు శ్రీ "ఆంధ్ర విశ్వభారతీ సంఘము" వారికి నాకృతజ్ఞతాపూర్వక వందనాలు అర్పిస్తున్నాను. ఈ పుస్తకములోనికి కావలసిన చిత్రములను, పటములను కోరిన వెనువెంటనే ఆదరముతో వ్రాసియిచ్చిన సహృదయులు, చిత్రకళానిపుణులు శ్రీతేజోమూర్తుల కేశవరావుగారికి నా వందనములు.

"ఆంధ్ర విశ్వభారతీ సంఘము" క్రొత్తది. ఇది ఆంధ్రుల సమైక్యతకోసమూ, ఆంధ్రుల ప్రజ్ఞా పాటవ ప్రకటనకోసమూ పాటుపడే కేవల సాహిత్య సాంస్కృతిక సంస్థ. దీని లక్ష్యా లివి.

(1) హిందూదేశములో నివసించే ఆంధ్రు లందరికోసం మహా



మధ్య పరగణాలు
బస్తరు
బొంబాయి రాజధాని
ఆదిలాబాదు
గోదావరి నది
కరీంనగరం
నిజామాబాదు
మెదకు
వరంగల్లు
భువనగిరి
హైదరాబాదు
నల్లగొండ
దేవరకొండ
కంబంమెట్టు
ఏలూరు
విజయవాడ
భద్రాచలం
మహబూబ్‌నగరం
రాయచూరు
రాయలసీమ
తుంగభద్రానది
కర్నూలు
నందికొట్కూరు
శ్రీశైలం
కృష్ణానది
బందరు
76
78
80
82
20
18
16


తెలంగానా

కవి రవీంద్రనాథఠాగూరుగారు స్థాపించిన శాంతినికేతనం పద్ధతిని ఒక సాంస్కృతిక కేంద్రం ఏర్పాటు చేసి ఆంధ్రుల సంస్కృతి సంప్రదాయాలను పునరుద్ధరించడం.

(2) హిందూదేశంలోని వివిధప్రాంతాల నివసించే ఆంధ్రులలో మనము అందరం ఒకటి, మనది ఒకటే భాష, ఒకటే దేశము అనేభావం కలిగించి, సాంఘికంగాను సాంస్కృతికంగాను వారిలో పరస్పరమూ సన్నిహితత్వం కలుగజేయడం.


(3) సాంస్కృతిక, వాఙ్మయ ఆంధ్ర సంస్థలను అడుగంటుతున్న వాటిని ఉద్ధరించడంలోను, ఉన్నవాటిని బాగా సాగించి పెంపొందించడంలోను యథాశక్తిగా తోడ్పడడం.

ఆంధ్రదేశం అంటే ఒక్క మద్రాసు రాజధానిలోని తెలుగు జిల్లాలు మాత్రమే కావు; ఇంకా చాలా దేశం ఉన్నది. ఇదంతా ముఖ్యముగా నాల్గు రాజ్యాలలో - హైదరాబాదు రాజ్యంలోను, మైసూరురాజ్యంలోను, మధ్యపరగణాలు, ఒరిస్సా రాష్ట్రాలలోను- ఖండ ఖండాలుగా చీలిపోయి ఉన్నది. వీటిలో హైదరాబాదు రాజ్యంలోని తెలుగు ఖండం తెలంగానా చాలా పెద్దదీ ముఖ్యమయినదీని. తెలింగాణెమే వ్యవహారములో (తెలంగాణము) తెలంగానా అయినది. ఆణె మనగా దేశం. హైదరాబాదురాజ్యం మొత్తం వైశాల్యం 82,698 చ. మైళ్లలోను తెలంగానా వైశాల్యం 42,873 చ. మైళ్లు, అంటే హైదరాబాదురాజ్యములో తెలంగానా సగానికి పైగా ఉన్నది. తెలంగానాలోని ఆంధ్రుల సంఖ్య 86,35,131. సముద్రతీరస్థదేశం, రాయలసీమ, తెలంగానా- ఇవి మూడూ కలసినది అసలు అంధ్రదేశం. ఇదయినా ఒక్కటిగా లేదు. దీనికి మైసూరురాజ్యం, బస్తరు, మధ్యపరగణాలు, ఒరిస్సాలలోని, తమిళజిల్లాలలోని తెలుగుభాగాలు కలిపితే అఖం

డాంధ్రదేశం (మహాంధ్రదేశం లేక మహాతెలంగానా) అవుతుంది. దీనినే మనలో కొందరు విశాలాంధ్రం అని వ్యవహరిస్తున్నారు.

ఆంధ్రు లీవిధముగా వేరు వేరు రాష్ట్రాలలో రాజ్యాలలో విడిపోయి చీలిపోయి ఉన్నందువల్ల దుర్బలు లవుతున్నారు; ఒక్క జాతిగా రాణించలేకపోతున్నారు. ఆయారాజ్యాల రాజకీయపు సరిహద్దులు ఆంధ్రుడినుంచి ఆంధ్రుణ్ని వేరుపరిచే అడ్డుగోడ లవుతున్నవి. వీటివల్ల ఆంధ్రుడు ఒకడి కష్ట నష్టాలకు ఇంకొకడు ఆదుకోలేకపోతున్నాడు; ఒకడి సుఖ సంతోషాలలో ఇంకొకడు పాల్గొనలేకపోతున్నాడు; ఇం తెందుకు, ఆంధ్రుడికే ఆంధ్రుడు పెరవాడై నాడు. ఒకడి కొకడు కాకుండాపోతున్నాడు. ఆంధ్రజాతి పరిణామాభివృద్ధులలో హెచ్చు తగ్గులూ మెరక పల్లములూ ఏర్పడి ఆంధ్రాభ్యుదయం కుంటుపడుతున్నది. ఆంధ్రాభ్యుదయ ప్రతికూల శక్తులకు ఈ పరిస్థితులు ప్రోత్సాహ పరివర్ధకములుగా ఉన్నవి. ఈస్థితి ఎంత తర్వలో తొలగితే అంత మేలు. మహాంధ్ర నిర్మాణం కోసము పాటుపడడం, జాతిని చైతన్య సందీప్తం చేయడం దేశాభిమానము, విశాలదృష్టి గల ప్రతి ఆంధ్రుడీ కనీస ధర్మం. పూర్వకాలములో ఎన్నో ప్రబల రాజ్యాలు మాయించి మహాసామ్రాజ్యాలు వెలయించి, ఒకప్పుడు ఏకచ్ఛత్రముగా గోదావరినుంచి దక్షిణ మహాసముద్రమువరకు పాలించిన ఆంధ్రవీరులవంశం మనది అనే విషయం మనస్సులో గాఢముగా పాదుకొంటే, మనకు స్వార్థపరత అడ్డురాకుండా ఉంటే మహాంధ్రస్థాపన కష్టము కాదు. ఈ లక్ష్యసిద్ధికీ, ఆంధ్రుల స్వస్వరూప విజ్ఞానానికీ ఈ చిన్న పుస్తకము ఏమాత్రమయినా తోడ్పడగలిగితే నేను చరితార్థుడనని భావిస్తాను.

మల్లంపల్లి సోమశేఖరశర్మ.



ఆదిలాబాదు
నిజామాబాదు
కరీంనగరం
మెదకు
వరంగల్లు
హైదరాబాదు
నల్లగొండ
గుంటూరు
కర్నూలు
బస్తరు
ఏలూరు
కాకినాడ
విశాఖపట్టణము
బందరు
కడప
నెల్లూరు
తిరుపతి
చిత్తూరు
మద్రాసు
బెంగుళూరు


మహాంధ్రదేశము

# ఆంధ్రదేశ చరిత్ర సంగ్రహము

## మొదటి ప్రసంగము

---

### మన దేశము

అంతా రెండువందల సంవత్సరాలయింది మనం బ్రిటీషువారి పరిపాలనక్రిందికి వచ్చి. అంతకు పూర్వం మన దేశాన్ని మనమే స్వతంత్రముగా పరిపాలించుకొంటూ వచ్చాము. మన దేశమువారే, ఒక్కొక్క కాలములో ఒక్కొక్క వంశమువారు ప్రభుత్వం చేస్తూవచ్చారు. ఈ విధముగా మన దేశాన్ని స్వతంత్రముగా పరిపాలించిన రాజవంశాలు ఎన్నో ఉన్నవి. అట్టివాటిలో మొట్టమొదటిదీ, తొట్టతొలుతటిదీ సాతవాహన రాజవంశం. సాతవాహనులకు శాలివాహనులనికూడా పేరు. వీరు ఇప్పటికి దాదాపు రెండు వేల సంవత్సరాలకు పూర్వం స్వతంత్రముగా మన ఆంధ్ర దేశాన్ని పాలించారు.

సాతవాహనులు పాలించిన కాలములో ఆంధ్ర దేశమంటే ఇప్పటి మన మద్రాసు రాజధానిలోని తెలుగు జిల్లాలుమాత్రమే కాదు, హైదరాబాదు సంస్థానంలోని తెలుగుజిల్లాలుకూడా ఆంధ్ర దేశములోనివే. అప్పటికి హైదరాబాదు సంస్థానం ఏర్పడనేలేదు. ఈ సంస్థానం తూర్పు సగభాగములో ఉన్నవారంతా ఆంధ్రులే. ఈ భాగానికి ఇపుడు తెలింగానా అనీ, తెలంగానా అనీ, తెలంగాణం

అనీ పేరు. ఇప్పుడంటే తెలంగానాలోని ఆంధ్రులు ఒక రాజ్యములోను, మనం వేరొక రాజ్యములోను ఉంటున్నాము కాని సాతవాహనులకాలములో ఆంధ్రులము అందరమూ ఒకటే రాజ్యములో ఉండేవాళ్లము. అది ఆంధ్రరాజ్యం; అది ఆంధ్రదేశం.

## ఆంధ్రదేశ విభాగములు

దక్కను పీఠభూమిలోని తూర్పు భాగమంతా ఇంచు మించుగా ఆంధ్ర దేశము అని చెప్పవచ్చును. తెలంగానా తక్క- మిగిలిన ఆంధ్రదేశం అంతా దాదాపు మద్రాసు రాజధానిలోనే ఉన్నది. ఈ దేశమంతా నైసర్గికముగా చూస్తే మూడు విభాగాలుగా ఉన్నది; అవేమిటంటే, (౧) తెలంగానా, (౨) తెలంగానాకు తూర్పున సముద్రపు ఒడ్డునేవున్న తెలుగు జిల్లాల భాగం, (3) తెలంగానాకు దక్షిణానవున్న తెలుగు జిల్లాల భాగం. తెలంగానాకు తూర్పుగా ఉన్న భాగానికి మధ్యాంధ్రదేశం అని, పూర్వాంధ్రదేశం అని పేరు. తెలంగానాకు దక్షిణాన ఉన్న భాగం పశ్చిమాంధ్రదేశం. దీనిని ఇప్పుడు రాయల సీమ అంటారు. తూర్పు కనుమలు అనే కొండలు తెలంగా నాకూ పూర్వాంధ్రదేశానికీ మధ్యగా ఈశాన్యపు దిక్కు నుంచి నైరృతి దిక్కుగా వ్యాపించి ఈ రెండు భాగాలను విడదీస్తున్నవి. కృష్ణానదీ, దాని ఉపనది తుంగభద్రా తెలంగానాకు రాయలసీమకు మధ్యగా ప్రవహించి ఆ రెండు భాగాలను వేరుచేస్తున్నవి. రాయలసీమలోని ఉత్తర,

పశ్చిమ భాగాలును, పూర్వాంధ్రదేశంలోని పడమటిభాగ మును అంతా కొండలమయము.

గోదావరినదికి ఉత్తరముగా ఉండేదేశానికి పూర్వ కాలమునుంచీ కళింగం అని పేరు. కళింగదేశమంతా కూడా పర్వతప్రాంతమే. కళింగదేశమువారికి కాళింగులు అని పేరు.

అంధ్రదేశాన్నంతా సాతవాహనరాజులు తమ అధి కారముక్రిందికి తెచ్చుకొని పరాక్రమవంతులై పరిపాలన చేశారు.

## సాతవాహన యుగము

సాతవాహనులు ఆంధ్రులలో ఒక తెగవారు, ఆంధ్రులే. పూర్వపు గ్రంథాలవల్లను, ఈ రాజులు రాళ్లమీదా కొండగుహలలోను చెక్కించిన శాసనాలవల్లను, వీరి నాణెములవల్లను వీరి చరిత్ర కొంచెము కొంచెం తెలు స్తున్నది. అయితే మనకు ఇంతవరకు దొరికిన వీరి శాస నాలూ కొద్దే; నాణెములూ తక్కువే. అవయినా అందరు రాజులవీ దొరకలేదు. అందువల్లనే వీరినిగురించి మనకు తెలిసిన చరిత్ర చాలా కొద్ది.

మన దేశాన్ని పాలించిన సాతవాహన వంశపు రాజులు మొత్తం ముప్ఫయిమంది. వీరందరు కలిసి నాలుగు వందలయేభై సంవత్సరాలకుపైగా రాజ్యంచేశారని తెలు స్తున్నది. పురాణాలలో ఈ యాంధ్రవంశపురాజులు ముప్ఫయిమందిపేర్లూ ఉన్నవి. ఇంతే కాదు, వీరిలో ఎవ

రెవరు ఎంతెంత కాలం పరిపాలనచేసినదీకూడా పురాణాలు తెలుపుతవి. ఈ వంశంరాజులలో కొద్దిమందివి మాత్రమే శాసనాలూ నాణెములూ దొరకడంవల్ల పేర్లు తక్క వీరిలో చాలామందినిగురించి మనకు ఏమీ తెలియదు. వీరిలో శ్రీశాతకర్ణి, కుంతలశాతకర్ణి, సుందరశాతకర్ణి, చకోర శాతకర్ణి అని ఈ విధముగా చాలామందికి శాతకర్ణి పేరు ఉండడంవల్ల వీరికి సాతవాహనులనేకాక కర్ణిరాజులనీ, వీరు పాలించిన దేశానికి కర్ణినాడనీ పేరు కలిగినది. కర్ణినాడే కర్నాడు, కర్నాటదేశం.

క్రీస్తుపూర్వం మూడవశతాబ్దములో శ్రీముఖుడనే సాతహాహనరాజు ఆంధ్రరాజ్యం స్థాపించి ఆంధ్ర జాతికి కీర్తి తెచ్చాడు. సాతవాహనుల మూలపురుషుడు ఇతడే. దక్కనుదేశములో చరిత్రకు తెలిసిన మొదటి రాజ్యం ఇతడు స్థాపించినదే, ఆంధ్రులది. ఆంధ్రరాజ్యానికి మొట్ట మొదట కృష్ణానది వొడ్డునవున్న శ్రీకాకుళం రాజధానిగా ఉండేదంటారు. తరువాత ధాన్యకటకం రాజధాని అయినది. ధాన్యకటకానికే ధరణికోట అనిపేరు. ఇది గుంటూరు జిల్లాలో కృష్ణానది వొడ్డునవున్న అమరావతికి దగ్గరగా ఉన్నది.

శ్రీముఖుడు మగధరాజుల అధికారాన్ని ధిక్కరించి స్వతంత్రుడయినాడు. ఆ కాలములో ఉత్తరహిందూస్తాన ములో మగధ చాలా గొప్ప సామ్రాజ్యం. దానికి పాటలీ పుత్రం రాజధాని. మౌర్యవంశజులు చంద్రగుప్తుడు, బిందు

సారుడు, అశోకుడు మగధ సామ్రాజ్యాన్ని పాలించిన తరువాత బలహీనులయిన రాజులు మగధ సింహాసనం ఆక్రమించారు. వీరిని జయించి శుంగవంశపురాజులూ, కణ్వవంశపురాజులూ కొంతకాలం మగధను ఏలినారు. ఈ కాలములోనే శ్రీముఖుడు మగధమహారాజులమీద తిరుగ బాటుచేసి వారిని జయించి మగధనుకూడా పరిపాలించాడు. ఆకాలములో ఆంధ్రుడికి ఉత్తర హిందూస్తానములోకూడా రాజగౌరవం కలిగింది. అయితే మగధ సాతవాహనుల క్రింద ఎంతకాలం ఉన్నదో, అది వారి అధికారములోనుంచి ఏపరిస్థితులలో ఏవిధముగా జారిపోయినదో తెలియదు.

మగధలాగే కళింగంకూడా సాతవాహన రాజులక్రింద అట్టేకాలం ఉండలేదు. కళింగదేశములో చేదివంశపు రాజులు ప్రబలులై ఒకస్వతంత్రరాజ్యం స్థాపించారు. ఈ వంశమువారిలో ఖారవేలుడనేరాజు చాలా పరాక్రమ వంతుడు. శ్రీశాతకర్ణి అనే మూడవ సాతవాహనరాజూ ఇతడూ సమకాలికులు.

శ్రీముఖుడు, ఇతని సోదరుడు కృష్ణుడు, ఇతని తరు వాత సింహాసన మెక్కిన శ్రీశాతకర్ణి — ఈ ముగ్గురూ రాజ్యతంత్రములోను, యుద్ధతంత్రములోను చాలా సమ ర్థులు. అందువల్ల మన ఆంధ్రరాజ్యము అతిశీఘ్రకాల ములో తూర్పున బంగాళాఖాతం మొదలుకొని పడమట అరాబియా సముద్రంవరకు వ్యాపించినది. శ్రీశాతకర్ణి తన చుట్టుప్రక్కల ఉండే రాజులను అందరినీ జయించి,

అడ్డులేని తన పరాక్రమానికి సూచనగా ఉండేటట్లు అశ్వమేధ, రాజసూయ యాగాలు చేశాడు. వింధ్యకు దక్షిణాన ఉన్న భారతఖండములో అశ్వమేధయాగము చేసిన మహారాజులలో మొదటివాడు ఇతడే.

పై వారు కాక ఈ సాతవాహన రాజులలో ముఖ్యముగా చెప్పుకోవలసినవారు ముగ్గురు; ఒకడు హాలుడు, రెండవ వాడు గౌతమీపుత్ర శ్రీశాతకర్ణి, మూడవవాడు గౌతమీపుత్ర యజ్ఞశ్రీశాతకర్ణి.

వీరిలో హాలమహారాజు ప్రాకృతభాషలో గొప్ప కవీశ్వరుడు; ఎందరు కవులనో పోషించాడు. ఇతని ఆస్థానం ఎప్పుడూ విద్యావినోదాలతో కలకలలాడుతూవుండేది. సాతవాహనులు ఆంధ్రవంశపు రాజులైనా తాము ప్రాకృతభాషను ఆదరించడము, ఆ భాషలో కవిత్వం చెప్పడము, ప్రాకృతభాషలో కవిత్వం చెప్పిన కవులకు ఆశ్రయం ఇవ్వడమే విచిత్రం. ఆనాటి రాజభాష ప్రాకృతము. సాతవాహనరాజుల శాసనాలన్నీ ప్రాకృతములోనే ఉన్నవి. తానూ, తనకాలంనాటి కవులూ, తనకు పూర్వం ఉన్నవారూ వ్రాసిన శృంగార 'గాథలు' మంచివన్నీ ఏడువందలు ఏరి, హాలశాలివాహనభూపతి 'గాథాసప్తశతి' అని ఒకగ్రంథం కూర్చాడు. ప్రాకృతపు ఛందస్సులో వ్రాసిన పద్యాలను గాథ లంటారు. ఈ 'గాథాసప్తశతి' ఇప్పటికీ ఉన్నది. హాలుడికి గుణాఢ్యుడు, శర్వవర్మ అనేవారు మంత్రులు. గుణాఢ్యుడు ప్రాకృతభాషలో

బృహత్కథ అనేగొప్పకథలపుస్తకం వ్రాశాడు. సంస్కృత కథావాఙ్మయంలోని ఎన్నోకథలకు ఈ గ్రంథం మూలం. శర్వవర్మ 'కాతంత్రం' అని ఒకసంస్కృత వ్యాకరణం రచించాడు.

హాలుడి తరువాత కొంతకాలం ఆంధ్రరాజ్యం ప్రభ తగ్గిపోయింది. ఇందుకు కారణం విదేశాలనుంచి క్రొత్తజాతుల వారు రావడం. ఈకాలములో పడమట విదేశాలనుంచి శకులు, పహ్లావులు, యవనులు అనేవారు హిందూదేశ ములో ప్రవేశించి పంజాబులోని పడమటి సముద్రపుటొడ్డునే మాళవము, సౌరాష్ట్రము, ఘూర్జరము, అవంతి, అపరాం తము మొదలైన దేశాలకు వ్యాపించారు. వీరు ఉత్తర దేశములోని మహారాజులకు సామంతులు. క్షత్రపు లంటారు వీరిని. వీరు ఆవిధముగా వ్యాపించడమే కాకుండా చిన్న చిన్న రాజ్యాలు స్థాపించి పొరుగునవున్న ఆంధ్రరాజ్యము మీాదికికూడా దండయాత్రలుచేసి దానికి ముప్పు కలిగిం చారు; ఆంధ్రరాజ్యములోని పడమటిభాగాన్ని ఆక్రమించు కొన్నారు. ఈక్షత్రపులలో ముఖ్యముగా చెప్పవలసినవారు భూమక, నహపానులు. నహపానుని విజృంభణానికి ఆంధ్ర రాజ్యం అల్లకల్లోలమయింది. ప్రజలకు రక్షణ లేకపోయింది. సరిగా ఈకాలంలో ఉదయించి ఆంధ్రరాజ్యాన్ని రక్షించిన వాడు వీరాధివీరుడు గౌతమీాపుత్ర శ్రీశాతకర్ణి. ఇతడు శక, యవన, పహ్లావ సైన్యాలను అనేకయుద్ధాలలో ఓడిం చాడు; నహపానుణ్ని జయించాడు; శక పహ్లావ రాజ్యాలను

ఆక్రమించుకొన్నాడు. ఈ విదేశజాతులవారి ఉపద్రవాన్ని తప్పించి ఆంధ్రరాజ్యాన్ని కాపాడినాడు. శక, పహ్లవాదులు గౌతమీపుత్ర శ్రీశాతకర్ణికి సామంతులైనారు. ఈ మహారాజుకాలములో ఉత్తరకొంకణం, ఉత్తర మహారాష్ట్రం, సురాష్ట్రం, మాళవదేశం, తూర్పు రాజపుతానా, మధ్యపరగణాలు, బేరారు - అన్నీ ఆంధ్రరాజ్యంలోనివే. ఆనాడు ఆంధ్రరాజ్యానికి తూర్పున బంగాళాఖాతము, పడమట అరాబియాసముద్రము ఎల్లలయినవి. అది ఉత్తరాన మధ్యహిందూదేశంవరకును, దక్షిణాన మైసూరుదాకాను వ్యాపించింది. గౌతమీపుత్ర శాతకర్ణి మనజాతీయ వీరుడు. ఇతడు చాలాకాలం చక్కగా రాజ్యమేలినాడు.

అటుతరువాత చెప్పుకోవలసినవాడు గౌతమీపుత్ర యజ్ఞశ్రీశాతకర్ణి. గౌతమీపుత్రశాతకర్ణి మరణానంతరం మళ్లీ శకరాజులు విజృంభించారు. వారు ఉజ్జయినిని రాజధాని చేసికొని క్రమముగా బలపడి, అదివరలో పోగొట్టుకొన్న రాజ్యాలు తిరుగా సంపాదించుకొన్నారు. అంతేకాకుండా ఆంధ్రరాజ్యం పడమటి భాగాన్నికూడా ఆక్రమించుకొన్నారు. అందువల్ల కడపటి సాతవాహన రాజులకు పడమట రాజ్యమే లేకపోయింది. కేవలం ఆంధ్రదేశానికే వారు ఏలికలయినారు. గొప్ప సాతవాహనరాజులలో యజ్ఞశ్రీశాతకర్ణి చివరివాడు. ఇతడు పశ్చిమక్షత్రపులమీదికి దండెత్తివెళ్లి వారిని జయించాడు; ఉత్తర మహారాష్ట్ర, అపరాంత దేశాలను తిరుగ ఆక్రమించు

కొన్నాడు. ఇతని శాసనాలు బొంబాయిరాజధానిలోని నాసిక, కన్హేరి గుహలలో కనిపించినవి.


సాతవాహనులు పరిపాలించినకాలములో ప్రజలు అన్నివిధాలా అభివృద్ధిపొందినారు. ఆకాలములో ఆంధ్ర దేశములో విరివిగా వ్యాపించిన మతం బౌద్ధము. నాడు మన ఆంధ్రదేశంలో ఎన్నో బౌద్ధస్తూపాలు, బౌద్ధవిహారాలు ఉండేవి. స్తూపం అంటే బుద్ధుని నిర్వాణానికి చిహ్నం. స్తూపము, బౌద్ధుల ప్రార్థనాలయము, బౌద్ధ బిక్షువుల వసతి గృహములు - ఇవన్నీ కలిసి ఒకచోట ఉన్న ప్రదేశానికి విహారము అని పేరు. దీనిని సంఘారామం అనికూడా అంటారు. ధాన్యకటకం, భట్టిప్రోలు, గుంటుపల్లి, ఘంటసాల, చినగంజాం మొదలైన చాలాచోట్ల బౌద్ధస్తూపాలు ఉండేవి. ఈ స్తూపాలు కట్టడములో ఆ నాటి మనపూర్వులు చాలా నేర్పరులు. వారు బుద్ధుడికి సంబంధించిన కథల నన్నిటినీ పాలరాళ్లమీద చెక్కి వాటిని స్తూపాలలో అమర్చేవారు. రాతిమీద చెక్కిన బొమ్మలన్నీ జీవం ఉట్టిపడుతూ ఉంటవి. స్తూపనిర్మాణాన్ని ఆశ్రయించుకొని ఆనాడు శిల్పకళ వర్ధిల్లింది. ఆనాడు హిందూదేశం అంతటిలోనూ మన శిల్ప కళకు దీటయినది లేదు. బౌద్ధసంఘారామాలు గొప్పవిద్యా పీఠాలు. ఎందరో విద్యార్థులు వాటిలో చదువుకొనేవారు. మన దేశంలోని ఆనాటి బౌద్ధ విద్యాపీఠాలలో ధాన్యకటక విద్యాపీఠం చాలా గొప్పది.

ఆనాడు మనదేశం రోము మొదలైన పడమటి నగ

రాలతోను, దేశాలతోను, తూర్పుదేశాలతోను ద్వీపాల తోను వర్తకవ్యాపారం బాగా సాగించింది. మన దేశములో ఎన్నో రేవు పట్టణా లుండేవి. గౌతమీపుత్ర యజ్ఞశ్రీశాత కర్ణి ఓడలవర్తకానికి గొప్ప ప్రోత్సాహం ఇచ్చాడు. ఈ మహారాజు నాణెములమీద లంగరు, ఓడముద్ర లున్నవి. ఆనాడు తూర్పు సముద్రాలమీద ఆధిపత్యం మన ఆంధ్ర సాతవాహనులదే. ఆనాడు ఒక్కొక్క వ్యాపారం చేసే వారు ఒక్కొక్క సంఘముగా ఏర్పడేవారు ; బట్టలు నేసే వారిది ఒకసంఘం ; నూనెవర్తకంచేసేవారిది ఒకసంఘం. ఇట్లా అనేక వ్యాపార సంఘాలు ఉండేవి. ఈ సంఘాలు బ్యాంకులుగా పనిచేసేవి. ఎంతో కొంతడబ్బు ఈ సంఘా లలో వేస్తే ఆ సంఘాలవారు ఆ డబ్బుమీద సంవత్సరానికి వచ్చే వడ్డీకిమ్మతుకు సరియైన సరకు ఏటేటా సప్లయి చేసేవారు.

ఓడల వర్తకులతోపాటు మన మతము, మన విద్యలు, మన కళలు అన్నీకూడా తూర్పుదేశాలకూ, ద్వీపాలకూ వెళ్లినవి. ఈ విధముగా భారతీయసంస్కృతినీ, నాగరక తనూ తూర్పుదేశాలలోను, ద్వీపాలలోను వ్యాపింపజేసిన వారు మొట్టమొదట మన పూర్వులు బౌద్ధాంధ్రులూ కాళింగులూను.

మన దేశములో బౌద్ధ మతం ఎక్కువగా వ్యాపించినా వేదమతం లేకపోలేదు. అప్పటికి నాలుగు వర్ణాలూ ఉన్నవి ; కాని యిప్పటిలాగు మన మతం కొయ్యబారి



అమరావతీ స్తూపము

ఉండేదికాదు. మన దేశానికి వచ్చిన శకులు, పహ్లావులు, యవనులు మన మతం అవలంబించి శివుణ్ని, విష్ణుని పూజించేవారు. బుద్ధుని పూజించిన దేశీయరాజులుకూడా ఉన్నారు. అప్పటి మన మతం వారందరికీ చోటిచ్చి ఆదరించినది. సాతవాహనులు వేదమతావలంబకులు; యజ్ఞయాగాలు చేశారు. అట్లని వారు బౌద్ధమతాన్ని ఆదరించక

పోలేదు. ఈ సాతవాహనుల కాలంలోనే ఉన్నాడు నాగార్జునాచార్యుడు అనే గొప్ప బౌద్ధ సన్యాసి. ఆయనకు ఒక సాతవాహనరాజు ఎంతో డబ్బిచ్చి ఆదరించాడు. ధాన్య కటకములోని స్తూపం—ఇప్పుడు దీనిని అమరావతీ స్తూప మంటారు—చుట్టూ జీవకళ ఉట్టిపడేటట్టు బుద్ధుని కథలు బొమ్మలుగా చెక్కిన రాళ్లతో ఒక గొప్ప ప్రాకారం కట్టించాడు. నాసిక, నానాఘట్టము, కార్లాలలోని గుహలు వర్షాకాలం నాలుగు నెలలూ బౌద్ధసన్యాసులు ఉండే నిమిత్తం సాతవాహనరాజులూ, వారి సామంతులూ కట్టించి నవే. బౌద్ధుల ప్రార్థనాలయం కార్లా చైత్యం అత్యద్భుత మైన సుందరభవనం. ఈ ఉదాహరణాలవల్ల ఆనాటి సాత వాహనరాజులు వేదమతావలంబకులయినా ఎంతటి మత సహనం కలవారో, ఎంతటి బౌద్ధమతాభిమానులో తెలు స్తుంది. దాక్షిణాత్యుల సంస్కృతికి పునాదులు వేసినవారు వారే—ఆంధ్ర సాతవాహనులు.

# రెండవ ప్రసంగము

## బౌద్ధయుగము - ఇక్ష్వాకులు

సాతవాహనులనుగురించి క్రిందటితడవ విన్నారు. వారిరాజ్యము చాలా గొప్పది. అటువంటిరాజ్యము ఏ కారణం చేత ఎప్పుడు చితికిపోయిందో మనకు తెలియదు. క్రీస్తు శకము మూడవశతాబ్ది మొదటి సగభాగములో సాతవాహనుల పరిపాలనము అంతమైనదని చరిత్రకారులు నిశ్చయించారు.

సాతవాహనుల పరిపాలనలో మన దేశములో క్రొత్త వికాసం కలిగింది. విద్యలు, కళలు మొదలైనవి వర్ధిల్లడమువల్ల ప్రజలలో స్వాతంత్ర్యాభిలాష ఎక్కువయింది. ఏ తెగ కాతేగే రాజ్యాధికారం సంపాదించాలని ప్రయత్నించింది. ఈ ప్రయత్నాలకు అడ్డుతగిలి ఆ యా తెగలను, సామంతులను అదుపులో పెట్టడానికి కడపటి సాతవాహన రాజులకు సాధ్యం కాకపోయింది. వారు బలహీనులు; వారి పూర్వులు గొప్పరాజ్యము సంపాదించి యిస్తే పేరుకు మాత్రం రాజులుగా వుండి భోగం అనుభవిస్తూ వచ్చారు. చివరికి సాతవాహన మహాసామ్రాజ్యములోని వేరు వేరు ప్రాంతాలలో నివసించే ప్రజలను కూడగట్టుకొని బలపరాక్రమాలుగల వీరవరేణ్యులు విజృంభించి వేరు వేరు ప్రాంతాల స్వతంత్రరాజ్యాలు స్థాపించారు. ఈ విధమైన స్వతంత్ర

రాజ్యాల సంస్థాపనతో చివరికి సాతవాహనరాజ్యం చితికి చిదపలై అంతరించిపోయింది. మన తెలుగు దేశములోనే చిన్నరాజ్యాలు ఎన్నో వెలసినవి. వాటిలో ముఖ్యమయినది ఇక్ష్వాకువంశమువారి రాజ్యము.

ఇక్ష్వాకువంశం మన పురాణాలలో చాలా ప్రసిద్ధమైనది. ఈవంశమువారు క్షత్రియులు. వీరినిగురించి మనకు తెలిసినదల్లా ఈరాజులు రాజ్యంచేసిన కాలములో రాళ్లమీాద చెక్కించిన శాసనాలవల్లనే. ఇక్ష్వాకుల రాజ్యకాలంనాటి శాసనాలు ముఖ్యముగా కృష్ణాజిల్లా నందిగామ తాలూకా జగ్గయ్యపేటలోను, గుంటూరుజిల్లా పల్నాడు తాలూకా నాగార్జునునికొండలోను దొరికినవి. ఈశాసనాలన్నీ బౌద్ధస్తూపాలలోని రాళ్లమీాదా, స్తంభాలమీాదా చెక్కినవి. ఇవన్నీ ప్రాకృతభాషలోనే మన దేశములో ఆనాడు వాడుకలో వున్నలిపి(వ్రాత)లో ఉన్నవి. ప్రాకృతమే ఇక్ష్వాకురాజుల కాలములోకూడా రాజభాష. ఆనాడు రాజులు, విద్వాంసులు చదువుతూవచ్చినది ప్రాకృతగ్రంథాలే. దానపత్రం వ్రాసినా మరేపత్రం వ్రాసినా ప్రాకృతభాషలోనే వ్రాసేవారు. ఈశాసనాలన్నీ ఇక్ష్వాకురాజుల కాలములో బౌద్ధసన్యాసులకు, బౌద్ధస్తూపాలకు చేసిన దానధర్మాలు తెలిపేవే. ఆకాలములో స్త్రీలుకూడా బౌద్ధమతం అవలంబించి సన్యాసంతీసుకొని బౌద్ధవిహారాలలో నివసించి విద్యలు, కళలు నేర్చేవారు; బౌద్ధసన్యాసులు మగవారితో పాటు ఆడవారుకూడా పర్యటనంచేసి బుద్ధభగవానుని

సందేశం దేశదేశాల వ్యాపింపజేసేవారు. స్త్రీలు బాగా చదివినవారు, ప్రాకృతభాషలో కవిత్వం చెప్పేవారు కూడా ఉండేవారు.

శాసనాలవల్ల మన కింతవరకు తెలియవచ్చిన ఇక్ష్వాకు వంశపురాజులు మన దేశం ఏలినవారు ముగ్గురే: వాసిష్ఠీపుత్ర శాంతిమూలమహారాజు, ఇతని కుమారుడు మాఢరీపుత్ర వీరపురుషదత్తుడు, ఇతని తనయుడు ఎహువులశాంతిమూలుడు. ప్రాకృతభాషలో శాంతిమూలుణ్ని చాంతిమూలు డంటారు. వాసిష్ఠీపుత్ర, మాడరీపుత్ర పదాల ననుసరించే ఆనాడు స్త్రీకి ఎంతటి గౌరవం ఉండేదో తెలుస్తుంది. ఫలాని తండ్రి కుమారుణ్ని అనడముకంటెను ఫలాని తల్లి కుమారుణ్ని అని చెప్పుకోడమే ఆనాడు గౌరవముగా ఉండేది. ఈ సంప్రదాయం ఇక్ష్వాకువంశపురాజులనాడే పుట్టింది కాదు; సాతవాహనరాజుల కాలము నుంచీ వస్తున్న ఆచారమే. యవన, శక, పహ్లావులను జయించిన శాతకర్ణి మహారాజు గౌతమీపుత్రుడు. మరో సాతవాహనరాజు శ్రీ పులమావి వాసిష్ఠీపుత్రుడు. ఆ యాచారాన్ని అనుసరించే ఇక్ష్వాకులుకూడా తాము ఫలాన రాణి కొడుకులమని చెప్పుకొంటూవచ్చారు.

ఇక్ష్వాకురాజ్యాన్ని మన తెలుగుదేశములో స్థాపించిన మొదటి ఇక్ష్వాకుకులజుడు వాసిష్ఠీపుత్ర శాంతిమూలుడు. ఇతడు చాలా పరాక్రమవంతుడు; సాతవాహనరాజులలాగే గొప్ప వేదమతాభిమాని. సాతవాహన

రాజయిన శ్రీశాతకర్ణిలాగ ఇతడుకూడా ఎన్నో యజ్ఞాలు, యాగాలు చేశాడు. వీటిలో ముఖ్యమయినవి వాజపేయ, అశ్వమేధయాగాలు. అశ్వమేధయాగం చేసేటప్పుడు యాగాశ్వాన్ని విచ్చలవిడిగా తిరగడానికి వదలివేస్తాడు రాజు. ఆరాజుకంటె బలవంతు లెవరైనా ఉంటే దానిని కట్టివేస్తారు. అప్పుడు రాజు వారిని జయించి అశ్వాన్ని విడిపించుకోవాలి. ఆగుర్రాన్ని కట్టివేసి రాజునెదుర్కొ గల శక్తి లేకపోతే కప్పం చెల్లించి అతనికి సామంతుడు కావాలి. బలపరాక్రమాలుగల ఒకరాజు దిగ్విజయానికి అశ్వమేధ యాగం ఒకసూచన. వాసిష్ఠీపుత్ర శాంతిమూలుడు అశ్వ మేధయాగం చేశాడు గనుక గొప్ప పరాక్రమవంతుడై చుట్టుపక్కల దేశాన్ని జయించి కీర్తిగడించిన మహా రాజు అతను. అయితే చిత్రమేమిటంటే, ఇతని కాలపు శాసనం ఒక్కటికూడా ఇంతవరకు దొరకలేదు. ఇతనినిగురించి మనకు ఇతని కొడుకు వీరపురుషదత్తుని శాసనాలవల్లనే తెలుస్తుంది. ఇంకొకవిచిత్ర మేమిటంటే, వీరపురుషదత్తమహారాజయినా తన శాసనాలలో తండ్రి మాటే ఎత్తుతాడుకాని తన తాతమాట ఎత్తడు. బహుశః శాంతిమూలుని తండ్రి సామాన్యుడై వుంటాడని ఇందువల్ల మనం ఊహించవచ్చును. శాంతిమూలుడే ఇక్ష్వాకురాజ్యం స్థాపించి కీర్తివహించి వుంటాడు. ఇతడు అప్రతిహత సంకల్పుడట; కుమారస్వామిభక్తుడు; మహాదానధర్మ నిరతుడు; అనేకకోటి హిరణ్యాలు (బంగారు నాణెములు)

దానంచేశాడట. ఇంతే కాదు, లక్షలకొద్ది గోవులను, లక్షలకొద్ది హాలాలభూమిని దానముగా ఇచ్చాడట. హాల మంటే నాగలి. ఇప్పుడు ఇన్ని ఎకరాలభూమి అని వాడు తున్నట్టు పూర్వకాలములో మన దేశములో ఇన్ని నాగళ్ల భూమి అని వాడేవారు; ఇప్పటికీ మన దేశములో ఈవాడుక కొన్నిచోట్ల ఉన్నది. ఒక్క నాగలితో సేద్యంచేయడానికి వీలయిన భూమిని హాల మంటారు. లక్షలకొద్ది హాలాల భూమిని శాంతిమూలమహారాజు దానంచేశాడంటే ఆ మహారాజు ఎంతో భూమి సేద్యంలోనికి తీసుకువచ్చా డన్న మాట. ఆకాలములో మన దేశమంతా అడవి బలిసివుండేది. అడవి నరికించి మొట్టమొదటిమారు ఎక్కువభూమిని సేద్యంలోనికి తీసుకువచ్చింది శాంతిమూలుడూ, ఇతని సంతతివారున్ను. సరసిక, కుసుమలత అనేవారు శాంతి మూలుని భార్యలు; హమ్మశ్రీనిక, శాంతిశ్రీ అనేవారు ఇతని చెల్లెళ్లు. ఇతని కొడుకు శ్రీవీరపురుషదత్తమహారాజు.

మనకు దొరికిన ఇక్ష్వాకుశాసనాలన్నీ చాలాభాగం వీరపురుషదత్తుని రాజ్యకాలంనాటివే. ఇతడు దాదాపు ఇరవైసంవత్సరాలు రాజ్యంచేశాడు. ఇతని రాజధాని విజయపురి. కృష్ణానదీతీరాన ఉన్న నాగార్జునునికొండ ప్రదేశంలోనే పూర్వం విజయపురి ఉండేదని తెలుస్తున్నది. ఇక్ష్వాకుమహారాజుల కాలములో అది దొకమహానగరం. ఇక్ష్వాకుమహారాజుల కాలములో వెలసిన బౌద్ధస్తూపాలూ, విహారాలూ ఇక్కడే ఈనాగార్జునునికొండలోనే ఉన్నవి.

ఇది పూర్వం ఒకగొప్ప బౌద్ధసంఘారామం. ఇక్కడి సంఘారామంలోని బౌద్ధుల స్తూపాలు, గొప్ప కట్టడాలు అనేకములు శ్రీవీరపురుషదత్తమహారాజు కాలములో కట్టినవే. ఆకాలములో నాగార్జునునికొండకు శ్రీపర్వతమని పేరు.

శ్రీవీరపురుషదత్త మహారాజు కుమారుడు ఎహువుల శాంతిమూలుడు. ఇతడు వీరపురుషదత్తుని రాణి వాసిష్ఠీ భట్టిదేవికి జన్మించినవాడు. ఇక్ష్వాకువంశములో మనకు తెలిసిన కడపటి మహారాజు ఇతడే. ఇతని రాజ్యకాలంనాటి శాసనాలవల్ల ఇతడు పదకొండు సంవత్సరాలకుపైగా రాజ్యం పాలించినట్టు తెలుస్తున్నది. ఇక్ష్వాకువంశపురాజుల పరిపాలనం మొత్తంమీద ఏభైరెండు సంవత్సరాలకాలం సాగినట్టు పురాణాలవల్ల తెలుస్తున్నది. అందువల్ల వీరి రాజ్యపరిపాలనం క్రీస్తుశకం నాలుగవశతాబ్ది చివరికాలములో పరిసమాప్తమయినట్టు చరిత్రకారులు నిర్ణయిస్తున్నారు. ఏ కారణాలవల్ల ఏ విధముగా వీరి రాజ్యము అంతరించినదీ మనకు తెలియడం లేదు.

ఇక్ష్వాకుమహారాజులు మనదేశాన్ని పరిపాలించిన కాలానికి హిందూసంఘములో నాలుగువర్ణాలున్ను ఏర్పాటయి వున్నప్పటికీ మన ఆంధ్రజాతిలోని వేరువేరు తెగలవారందరు కలిసిపోయి మనది ఒక ఐక్యమహాంధ్రసంఘం కాలేదు. ఆకాలములో పూగియ, కులహాక, ధనక తెగలవారు రాజ్యములో గొప్ప అధికారాలు వహించడంవల్లనైతేనేమి, రాజకుటుంబముతో సంబంధబాంధవ్యాలు జర

పడంవల్లనై తేనేమి ప్రముఖులుగా ఉంటూవచ్చారు. ఈ తెగలవారు కాలక్రమాన్ని ఇతరసాంఘికులతో కలిసిపోయి తాము ప్రత్యేక తెగలవారమనేవిషయం మరచిపోయినారు. సాతవాహనుల రాజ్యకాలం రెండవ సగ భాగంనుంచి విదేశాలనుంచి వచ్చిన శకులు క్రిందటిపర్యాయం చెప్పినట్లు శైవ, వైష్ణవ, బౌద్ధమతాలు అవలంబించడమే కాకుండా ఇక్కడ దేశములో స్థిరపడిపోయి దేశీయులతో వివాహసంబంధాలు చేస్తూవచ్చారు. ఇక్ష్వాకు రాజుల కాలంనాటికి దేశీయులకు, విదేశీయులకు ఇటువంటి సంబంధబాంధవ్యాలు బాగా హెచ్చిపోయినవి. ఉజ్జయినీనగరం రాజధానిగాగల శకభూపతుల కన్య రుద్రధరభట్టారికను ఇక్ష్వాకువంశజుడయిన శ్రీవీరపురుషదత్త మహారాజు పెండ్లి చేసుకొన్నాడు. శకరాజ్యాలకూ ఆంధ్రదేశానికీ వర్తకవ్యాపారము రాకపోకలు హెచ్చడమే కాదు, శకజాతివారి కుటుంబాలు మనదేశానికి వచ్చి స్థిరముగా నివసించడంకూడా కలిగింది.

ఇక్ష్వాకుమహారాజులు సాతవాహనులలాగ ప్రాకృత భాషకు ఆదరం చూపుతూవస్తే ఉజ్జయిని రాజధానిగాగల శకనృపతులు సంస్కృతభాషను ఆదరించి సంస్కృతకవులను పోషిస్తూవచ్చారు. మనదేశానికి పెరవారయినా వేదభాష సంస్కృతాన్నీ, సంస్కృతభాషాపండితులనూ ఆదరించి వారు దేశంలో పలుకుబడి సంపాదించుకొని తమరాజ్యం సుప్రతిష్ఠితం చేసుకొన్నారు. ఉజ్జయినీనగరం సంస్కృత

విద్యలకు ఆలవాలమయినది. జ్యోతిషము మొదలయిన మన శాస్త్రాలు శకరాజు లిచ్చిన ఆదరప్రోత్సాహాలవల్ల బాగా వర్ధిల్లినవి. మనం ఇప్పుడు వాడుతూవుండే పంచాంగం మొట్టమొదట శకరాజాస్థానములో ఉజ్జయినిలో గుణితమై పరివ్యాప్తమయినదే. తిథి, వార, పక్ష, మాసాదులతో కూడిన ఈపంచాంగం మనదేశములో ఇక్ష్వాకువంశపు రాజులకు తరువాత చాలాకాలానికి కాని వాడుకలోనికి రాలేదు. సాతవాహనుల కాలములోను, ఇక్ష్వాకుల కాలములోనుకూడా సంవత్సరానికి మూడు ఋతువులే; అవేమిటంటే, (1) గ్రీష్మము, (2) వర్షము, (3) హేమంతము. ఒక్కొక్క ఋతువుపరిమితి నాలుగుమాసాలు, లేక ఎనిమిది పక్షాలు. మన ఇప్పటి చాంద్రమాన వ్యవహారం శక రాజ్యములనుండి వచ్చినట్లు కనబడుతుంది.

ఇక్ష్వాకుమహారాజులను తలచుకోగానే మనమనస్సుకు చటుక్కన స్ఫురణకు వచ్చేది పల్నాటిలోని నాగార్జునుని కొండ. ఈనాగార్జునునికొండప్రదేశ మంతా ఇక్ష్వాకు వంశంవారు రాజ్యంచేసిన కాలములో మహాసుందరమైన దివ్య బౌద్ధారామం అయినది. వారి కాలములో రాజవంశానికి సంబంధించినవారూ ఇతరులూ స్త్రీ లనేకులు శ్రీవీర పురుషదత్తమహారాజు రాజ్యకాలంలోను, అతనికొడుకు రాజ్యకాలంలోను ఎన్నో చైత్యాలు, చైత్యగృహాలు, మండపాలు, విహారాలు కట్టించారు; వాటికి దానాలనేకాలు చేశారు. కులహవిహారము, సింహాళవిహారము, దేవీ

విహారము అని ఇక్కడ ఎన్నో విహారా లుండేవి. ఈవిహారాల కీపేర్లు వాటిని కట్టించినవారివంశము ననుసరించీ, ఎవరినిమిత్తం వాటిని కట్టినారో వారి ననుసరించీ వచ్చినవి. కులహాకులనే తెగవారు కట్టించినది గనుక కులహావిహారమని పేరు వచ్చినది; సింహళదేశంనుంచి వచ్చే బౌద్ధులనిమిత్తం కట్టించిన విహారం సింహళవిహారం. నాగార్జునునికొండ ఆనాటి బౌద్ధమతావలంబుల కందరికీ సందర్శింపవలసిన పవిత్రమైన ప్రధానక్షేత్ర మయినది. ఆకాలంలో ఇక్కడికి కాశ్మీర, గాంధార, చీన, చిలాత, అపరాంత, వంగ, వనవాసి, యవన, ద్రమిళాది దేశాలనుంచీ, సింహళాది ద్వీపాలనుంచీ బౌద్ధులు యాత్రార్థం వచ్చేవారు. అంతటి ప్రసిద్ధమైన పుణ్యస్థలం ఈనాగార్జునునికొండ బౌద్ధులందరికీని. నాగార్జునాచార్యులవారు ఈకొండమీద నివసించడంవల్లనేమో దీనికి నాగార్జునునికొండ అని పేరు వచ్చింది. నాగార్జునుని కొండలోని ప్రధాన స్తూపానికి మహాచైత్యమని పేరు. బుద్ధభగవానుని ధాతువును అందులో వుంచి దానిని శాంతిమూలుని సోదరి శాంతిశ్రీ తన మేనల్లుడు శ్రీ వీరపురుషదత్తుని ఆరవ రాజ్యపాలనసంవత్సరములో కట్టించినది. ఈమె బంధువులైన స్త్రీలనేకులు ఈచైత్యానికి స్తంభాలెత్తించి, ఇతర అలంకారాలు కూర్చి దానిని అందగింపజేశారు. శాంతిశ్రీ అడుగుజాడలలో నడచి ఇక్కడ చైత్యగృహాలు మండపాలు కట్టించిన మరొకఅవిడ బోధిశ్రీ. చిత్ర మేమంటే ఇక్కడి బౌద్ధస్తూపాలు, చైత్యాలు, మండపాలు కట్టించిన

వారు, వాటికి దానాలు చేసినవారు అందరు స్త్రీలే - రాజ బాంధవులు. శాంతిమూలుడు, శ్రీవీరపురుషదత్తుడు మొదలైన ఇక్ష్వాకుమహారాజులు వేదమతావలంబకులు: యజ్ఞయాగాలు చేసినవారు. వారి స్త్రీలు బౌద్ధమతావలంబులు, బౌద్ధమతాన్ని అభిమానించినవారు. ఇప్పటిలాగ కుటుంబంలోని అందరు ఒకటేమతం అవలంబించాలనే నిర్బంధము కాని, కట్టడికాని ఆకాలములో లేదు. ఎవరిమతం వారిది. తమ మనఃపరిణామాన్ని అనుసరించి ఎవరికివారు తమకు చిత్తమువచ్చిన మతాన్ని అవలంబించేవారు. ఒక కుటుంబంలోనే కొందరిది ఒకమతం, మరికొందరిది మరొకమతం అయినా దానివల్ల కుటుంబం సౌమ్యజీవనానికి కాని, ఐకమత్యానికి కాని భంగం ఉండేది కాదు.

నాగార్జునునికొండలోని చైత్యాలు, చైత్యగృహాలు మొదలైనవి నిర్మించడంలోను, వాటిని సుందరముగా చేయడంలోను రాతిమీద బొమ్మలు చెక్కే ఆకాలంనాటి మన పూర్వులు- ఆంధ్రశిల్పులు ఆవిద్యలో తమకున్న చాకచక్యం, నేర్పు, శక్తి అంతా చూపించారు. ఇప్పుడు మన శివాలయాలలో శివుని కథలు, విష్ణ్వాలయాలలో విష్ణుకథలు - రామాయణ భాగవతగాథలు చెక్కుతున్నట్టే ఆకాలములో మన శిల్పులు బుద్ధుడికి సంబంధించిన కథలు, జీవితగాథలు తీసుకొని పాలరాళ్లమీద చెక్కి వాటిని బౌద్ధస్తూపాలలో అమర్చేవారు. ఈరాళ్లమీద బొమ్మలు ఏనాడో దాదాపు రెండువేల సంవత్సరాలక్రిందట చెక్కినవైనా జీవకళ ఉట్టి

పడుతూ, నిన్నో మొన్నో చెక్కిన ట్టుంటవి. అంతటి ప్రశ స్త మయినది నాగార్జునునికొండ స్తూపశిల్పము. హిందూదేశం అంతటిలోను అత్యుత్తమమైనదని పేరుపడింది ఆనాటి మన బౌద్ధాంధ్రశిల్పకళ. శిలాఫలకంమీద చెక్కడానికి తీసుకొన్న కథావస్తువు బుద్ధుడికి సంబంధించినదయినా ఆనాటి శిల్పులు వాటిలో ప్రతిబింబింపజేసినది ఆనాటి మనజీవన సంపదనే. శిల్పములో రాజుకానీ రాణీకానీ మరెవ్వరుకానీ ధరించిన ఉడుపులు, ఆభరణాలు ఏవి చూపవలసి వచ్చినా, ఏబండి ఎక్కినట్టు చూపవలసివచ్చినా నాటి ఆంధ్రశిల్పి ఆకాలములో మనపూర్వులు ధరించిన ఉడుపులనే, ఆభరణాలనే, ఎక్కిన బండివంటిదానినే చెక్కేవాడు. ఈ విధముగా ఇక్ష్వాకులు రాజ్యంచేసిన కాలములో మన పూర్వులు ధరించిన గొడుగులు, ఉడుపులు, ఆభరణాలు, వసించినగృహాలు, కేశపాశములు దిద్దుకొంటూవచ్చిన విధములు, వాడుకచేసిన సామగ్రి, ఆనాటి రాజప్రాసాదాలు, కోటలు, పూరిగుడిసెలు అన్నీ - ఒక టేమిటి ఆనాటి మన సంస్కృతి అంతా, సభ్యత అంతా - ఈశిల్పాలలో కనబడుతుంది.

కాలక్రమాన్ని బౌద్ధం మనదేశములో అంతరించి పోయినతరువాత వీటిని చూచేవారు కాపాడేవారు లేక ఈబౌద్ధ నిర్మాణాలన్నీ శిథిలమై దిబ్బలైపోయినవి. ఇటీవల గౌనర్మెంటువారు ఈదిబ్బలు తవ్వినమీదట శిథిలమైన స్తూపాలు, మండపాలు, బౌద్ధుల వసతిగృహాలు మొదలైనవి బయలుపడ్డవి. ఈనిర్మాణాలలో శిలలమీద చెక్కివున్న

శాసనాలవల్లనే తెలిసింది మనకు ఇక్ష్వాకులనుగురించి. మనలో ప్రతివారూ ఛూచితీరవలసిన ప్రదేశం నాగార్జునుని కొండ. నాగార్జునునికొండ అంటే ప్రాచీనాంధ్రుల కళానిక్షేపం.

---



పిల్లల ఆటవస్తువు
(నాగార్జునునికొండ శిల్పము)

# మూడవ ప్రసంగము

## చిన్నరాజ్యముల కాలము

ఇక్ష్వాకు వంశపురాజుల తరువాత మనదేశాన్ని పాలించినవారు విష్ణుకుండివంశపు రాజులు కారు. వారికీ వీరికీ మధ్య రమారమి రెండువందల సంవత్సరాల ఎడం ఉన్నది. ఈ మధ్యకాలములో ఆంధ్రదేశములోని వేరువేరు ప్రాంతాల కొందరు వేరువేరు రాజ్యాలు స్థాపించి పరిపాలిస్తూవచ్చారు.

## బృహత్ఫలాయనులు : శాలంకాయనులు

కృష్ణానదికి ఉత్తరానను, గోదావరినదికి దక్షిణానను వున్న దేశాన్ని రెండు వంశాలు పాలించినవి. అవి ఏమిటంటే, ఒకటి, బృహత్ఫలాయవంశము ; రెండవది శాలంకాయన వంశము. ఈ వంశాలవారిని చరిత్రలో బృహత్ఫలాయన గోత్రులనీ, శాలంకాయన గోత్రులనీ వ్యవహరిస్తారు.

బృహత్ఫలాయనులకు కృష్ణాజిల్లాలోని బందరుదగ్గర గూడూరు రాజధాని. వీరిలో మనకు ఇంతవరకు తెలిసిన రాజు జయవర్మ ఒక్కడే. బృహత్ఫలాయనరాజ్యం చాలా కాలం నిలవలేదు.

శాలంకాయనవంశంవారికి పశ్చిమగోదావరిజిల్లాలోని ఏలూరుదగ్గర ఉన్న పెదవేగి రాజధాని. ఈ నగరాన్ని అనుసరించే దీనికి చుట్టుపట్ల ఉండే దేశానికి వేగిదేశం

అని పేరు వచ్చినది. శాలంకాయనరాజుల కాలములో పెదవేగి మహానగరం. ఈ నగరం రాజధానిగా ఈ ప్రాంతాన్ని పాలించిన శాలంకాయనరాజులు దేవవర్మ, హస్తివర్మ, నందివర్మ, చండవర్మ, స్కందవర్మ మొదలైన వారు అనేకులు ఉన్నారు. వీరు అందరు చిత్రరథస్వామి అనే దేవుడి భక్తులు. చిత్రరథస్వామి అంటే సూర్యుడు. పెదవేగిలో పూర్వము చిత్రరథస్వామికి ఒక గొప్ప దేవాలయం ఉండేదట. ఈ శాలంకాయనరాజులు ఆంధ్ర దేశాన్ని ఒకవందసంవత్సరాలు పాలించారు.

## కందారరాజులు : పల్లవరాజులు

ఇక్ష్వాకురాజ్యం పడిపోయిన తరువాత కృష్ణకు దక్షిణానఉన్న దేశం మొదట కందారవంశపు రాజులకూ, అటుతరువాత చెంగల్పట్టు జిల్లాలోని కాంచీపురము (కంచి) రాజధానిగా పరిపాలిస్తూవచ్చిన పల్లవవంశపు రాజులకూ స్వాధీనమైనది. కందారవంశంవారిలో దామోదరవర్మ, అత్తివర్మలు ప్రసిద్ధులు. వారి రాజ్యంకూడా త్వరలోనే కూలిపోయింది. అప్పటినుంచి పల్లవవంశపు రాజులే కృష్ణానదికి దక్షిణానవున్న పూర్వాంధ్రదేశాన్ని చాలాకాలం పాలించారు. ఈ పల్లవవంశపు రాజులలో పరాక్రమవంతులైనవారు వీరకూర్చవర్మ, విష్ణుగోపవర్మ, స్కందవర్మ, వీరవర్మ, సింహవర్మ, బుద్ధవర్మ, నందివర్మ మొదలైనవారు అనేకులు ఉన్నారు. శాలంకాయనరాజులు వేగిదేశాన్ని పాలిస్తూవున్నప్పుడు కృష్ణకు దక్షిణానవున్న

ఆంధ్రదేశాన్ని పల్లవమహారాజులు ఏలుతూవచ్చారు. శాలంకాయనులు, పల్లవులు రాజ్యంచేస్తూవున్న ప్రారంభ కాలములో ఉత్తరహిందూస్థానంనుంచి గుప్తవంశస్థుడైన సముద్రగుప్తచక్రవర్తి మనదేశంమీదికీ అరవదేశంమీదికీ దండెత్తివచ్చి శాలంకాయనమహారాజు హస్తివర్మనూ, పల్లవ మహారాజు విష్ణుగోపవర్మనూ జయించాడు. కాని ఈ విజయం తాత్కాలికమైనది. సముద్రగుప్తచక్రవర్తి తిరుగ ఉత్తరహిందూస్థానానికి వెళ్లిపోగానే శాలంకాయన రాజులూ, పల్లవరాజులూ మరల స్వతంత్రముగా తమతమ రాజ్యాలు పాలించారు.

## విష్ణుకుండివంశపు రాజులు

శాలంకాయనరాజ్యం పడిపోయినతరువాత పూర్వాంధ్ర దేశాన్ని పాలించినవారు విష్ణుకుండివంశపు రాజులు. వీరు శైవులు; వేదమతాభిమానులు. శ్రీశైలం మీదఉన్న శివుని భక్తులు. వీరు తమకు పొరుగున దక్కనులో రాజ్యం స్థాపించి పాలిస్తూవచ్చిన వాకాటవంశం వారి తోను, మధ్యపరగణాలలోని తేవారుప్రాంతపు రాజుల తోను వివాహసంబంధాలు చేసుకొని తమ రాజ్యాధికారా నికి మోపం రాకుండా బలపరచుకొన్నారు. విష్ణుకుండి పదానికీ, గుంటూరుజిల్లాలోని వినుకొండకూ చాలాదగ్గర సంబంధం కనబడుతుంది. కొన్ని కారణాలవల్ల ఈవిష్ణు కుండి వంశంవారిది అసలు కృష్ణకు దక్షిణానవున్న దేశమే అని ఊహించడానికి వీలుగా వున్నది.

తమకు పూర్వము పరిపాలించిన రాజు లందరికంటెను ఈవిష్ణుకుండివంశపు రాజులు చాలా బలపరాక్రమాలు కలవారు. మొదట వీరు కృష్ణానది దక్షిణతీరానవున్న దేశాన్ని వశపరచుకొని పాలించినప్పటికీ కాలం గడచిన కొద్దీ బలవంతులైన పల్లవరాజుల ఒత్తిడి ఎక్కువై, ఈవంశంలోని చివరిరాజులు ఉత్తరాన వేగిదేశానికి పోయి వేగికి సమీపములో ఉన్న దెందులూరు నగరాన్ని తమకు రాజధాని చేసుకొన్నారు. విష్ణుకుండివంశంవారివి ఇంతవరకు అయిదు రాగిశాసనాలు దొరికినవి. వీటిని అనుసరించి చూడగా విష్ణుకుండివంశంవారు క్రీస్తుశకం అయిదవ శతాబ్ది చివరిభాగంనుంచి ఏడవశతాబ్ది మొదటిభాగం దాకా రమారమి నూరు, నూటయేభై యేళ్లు పాలించారని తెలుస్తున్నది. ఈ విష్ణుకుండివంశంవారిలో మాధవవర్మమహారాజు చాలా పరాక్రమవంతుడు. ఇతని సైన్యములో ఎనిమిదివేల ఏనుగులు, పదికోట్ల గుర్రము, అంతు లేని కాల్బలము ఉండేవట. ఈవిష్ణుకుండిరాజుల ప్రాభవమూ, అధికారమూ మాధవవర్మకాలంలోనే ఎక్కువగా ఉండేవి. విష్ణుకుండిరాజులు కళింగములోకూడా కొంత భాగము జయించి తమ రాజ్యములో కలుపుకొని పాలించారు. బాదామినుంచి దండెత్తివచ్చి చాళుక్యవంశము వారైన రెండవ పులకేశిమహారాజూ, అతని తమ్ముడు యువరాజు విష్ణువర్ధనుడూ ఈపూర్వాంధ్రదేశాన్ని జయించి

తమ రాజ్యము ఇక్కడ స్థాపించినదాకా ఈవిష్ణుకుండి వంశపురాజుల రాజ్యాధికారం సాగింది.

ఇక్ష్వాకువంశపురాజుల కాలంనాటినుంచి విష్ణుకుండి వంశపురాజుల రాజ్యపాలనం సమాప్తి అయిన రమారమి ఈరెండువందలసంవత్సరాల మధ్యకాలములో మన ఆంధ్ర దేశములో కొన్ని మార్పులు వచ్చినవి. ప్రధానముగా ఈమార్పు సంఘంలోను, మతంలోను వచ్చింది. ఉత్తర దేశాన్నుంచి వచ్చిన ఆంధ్రులలోని వేరు వేరు తెగలవారు ఇక్కడ స్థిరపడిపోయినతరువాత వారూ, అనాదిగా ఈ దేశములో ఉన్నట్టివారూ ఎవరికి వారే తమకు తగిన తెగల వారితో వివాహసంబంధాలు జరుపుతూరావడంవల్ల క్రమముగా విడివిడి తెగలు అన్నీ సమైక్యమై కలసిపోయి ఒక్క మహాసంఘము, హిందూసంఘముగా ఏర్పాటయింది. ఇది ఒక గొప్ప మార్పు. ఇక మతములో వచ్చిన మార్పు చెపుతాను వినండి. మన దేశంలోని జనులలో ముప్పాతిక మువ్వీసంమంది ప్రాచీనకాలంనుంచీ బౌద్ధమతం అవలంబించినవారే. బౌద్ధమతము కనిపెట్టిన బుద్ధుడు సామాన్యమానవుడు. దేవుడు లేడనీ, జీవితములో నీతే ప్రధానమనీ, నీతీ ప్రవర్తనా మంచివైతే ఎవడికి వాడు నిర్వాణము-ముక్తి పొందుతాడనీ అతను బోధించాడు. కాని అతను నిర్వాణం పొందిన కొంతకాలానికి బుద్ధుడికి పూజ ఏర్పడి, అతని మతస్థులు బుద్ధుణ్ని దేవుణ్ని చేశారు. ఇంకా కొంతకాలమైనతరువాత బుద్ధుడు ముఖ్యదేవుడై, బౌద్ధమత

ములో అనేకులు ఇతర దేవుళ్లు ఏర్పడ్డారు. ఈ దేవుళ్లకు భార్యలు - దేవతలు ఏర్పాటయినారు. వీరు ఉభయుల సంఖ్య నానాటికి హెచ్చిపోయింది. వీరికి విగ్రహాలు ఏర్పడి మొదట దేవుడే లేని మతములో విగ్రహాపూజ ప్రబలింది. ఈవిగ్రహాలను పూజించే రీతిలో అనేకపద్ధతులు వచ్చినవి. వీటికి తిరునాళ్లూ, తీర్థాలూ ఉత్సవాలూ ఏర్పడినవి. రాను రాను బౌద్ధమతములో కొన్ని అసహ్యకరమైన పూజావిధానాలు వచ్చినవి. దానితో బౌద్ధసన్యాసులు మగవారి ఆడువారి ప్రవర్తన కళంకితమైనది. అంతటినుంచి మన దేశాన్ని పాలిస్తూవచ్చిన ప్రభువులకే కాకుండా ప్రజలకు కూడా బౌద్ధమతమంటే అసహ్యం కలిగి దానికి ఆదరణ పోయింది.

బౌద్ధానికి ఈవిధముగా దేశములో ఆదరాభిమానాలు తగ్గి అది క్షీణించడమూ వేదమతము క్రమముగా ప్రబలడమూ ఏకకాలములో జరిగింది. వేదమతం అంటే యజ్ఞాలు, యాగాలు మొదలైన వేదకర్మలు చేసినందువల్లనే ముక్తి కలుగుతుందని చెప్పిన మతము. సాతవాహనుల కాలం నుంచీ మన దేశం ఏలిన రాజులు అందరూ వేదమతము అవలంబించినవారే. ఇక్ష్వాకువంశపురాజుల తరువాత మన దేశాన్ని పాలించిన రాజవంశాలలో అశ్వమేధయాగం చేసినవారు వంశానికి ఒక్కరైనా ఉంటారు. శాలంకాయన గోత్రజుడు దేవవర్మమహారాజు అశ్వమేధయాగం చేసినవాడు. పల్లవవంశపురాజులున్నూ అశ్వమేధయాగం

చేసినవారే. విష్ణుకుండివంశపు రాజులనుగురించి ఇక చెప్పనే అక్కరలేదు. ఈ వంశంలోని మాదవవర్మ మహారాజు చేసినది ఒక్క అశ్వమేధం కాదు, పదకొండు అశ్వమేధ యాగాలు చేశాడు. ఈరాజు పౌండరీకము, అగ్నిష్టోమము, వాజపేయము, రాజసూయము మొదలైన అనేక యజ్ఞ యాగాలు వేలకొలది చేశాడట. ఈ యజ్ఞాలూ, యాగాలూ చేయడములో ఈతని పిచ్చి ఎంతవరకు పోయిందంటే చివరికి ఇతడు పురుషమేధంకూడా చేశాడట. అశ్వమేధంవంటిదే పురుషమేధము. ఇతరయజ్ఞాలలో జంతువును బలి యిచ్చే టట్టు ఈయాగములో మనిషినే బలియిస్తారు. ఈ యాగాల పిచ్చి ఎంత ఎక్కువగానూ లేకపోతే ఆకాలములో మనిషినే చంపి యాగము చేయడం ఎట్లా సంభవిస్తుంది? దీనివల్ల ఆకాలములో యాగాలు యజ్ఞాలమీద మోజు ఎక్కువైనదనీ, యజ్ఞము చేయడం ఒకఘనతగా ఉండే దనీ తెలుస్తుంది. యజ్ఞ యాగాలు హెచ్చాయంటే కర్మ ప్రధానముగాగల వేదమతము దేశములో బాగా వ్యాపించిం దన్నమాట.

యజ్ఞయాగాది వేదకర్మలు చేయించే బ్రాహ్మణులకు ప్రాపకమూ, ఆదరణా హెచ్చింది. ఇరుగుపొరుగు దేశాల నుంచి రాజాశ్రయం వెదకుకొంటూ వేదవేదాంగాలు చది విన బ్రాహ్మణులు అనేకులు మనదేశం వచ్చి స్థిరనివాసం కల్పించుకొన్నారు. సాతవాహన, ఇక్ష్వాకు వంశంరాజుల కాలములో భూమిమొదలైన దానాలు బౌద్ధసన్యాసులకు

చేస్తూవచ్చినట్టు ఈకాలములో మహారాజులు వేదాలూ, శాస్త్రిలూ చదివిన బ్రాహ్మణవిద్వాంసులకు చేసి, వారిని ఆదరించేవారు. భూదానం చేసి దానపట్టా ఇప్పుడు మనం కాగితాలమీద వ్రాసియిస్తున్నట్టు ఆకాలములో మహారాజులు బ్రాహ్మణులకు రాగిరేకులమీద చెక్కించి యిస్తూవచ్చారు. ఇక్ష్వాకువంశంవారి రాజ్యం అంతరించి నప్పటినుంచీ మనకు దొరికిన భూదానశాసనాలు అన్నీ రాగిరేకులమీద చెక్కినవే; బ్రాహ్మణ పండితులకు చేసిన భూదానాన్ని తెలిపేవే.

ఆ కాలంలోని రాజులు అందరూ యజ్ఞాలూ యాగాలూ చేసినా చేయకపోయినా వేదమతము అవలంబించినవారే. వారిలో కొందరు శివుణ్ని కొలిచిన మాహేశ్వరులు, అంటే శైవులు; మరికొందరు విష్ణువును కొలిచిన భాగవతులు, అంటే వైష్ణవులు. ఒక వంశములో ఒకరు శైవులైతే అందరు శైవమతమే అవలంబించాలనీ, ఒకరు వైష్ణవులైతే అందరూ వైష్ణవమతమే అవలంబించాలనీ నియమం విష్ణుకుండి వంశంవారి నాటివరకూ ఇంకా రాలేదు. శైవులైనా వైష్ణవులైనా అందరూ ఒక్కటే; ఇప్పటిలాగ మతము మూలాన్ని ఒకరితో ఒకరు భోజన ప్రతిభోజనాలు మానుకోడమూ, సంబంధ బాంధవ్యాలు చేసుకోకపోవడమూ అనే ఆచారాలు ఇంకా ఏర్పడనికాలం అది. శైవము వైష్ణవము రెండూ వేదమత సంప్రదాయాలే. దేశములో బౌద్ధమతము క్రమముగా క్షీణించినకొద్దీ

శైవమతము ప్రబలమైనది. దీని తరువాతనే వ్యాప్తిచెందింది వైష్ణవమతం. శైవమతానికి ఆధిక్యం కలిగిన ఈ కాలములో ఇప్పటి శ్రీశైలము గొప్ప శైవక్షేత్రమై శ్రీపర్వతం అనే పేరుతో ప్రసిద్ధికెక్కినది. ఆ కొండమీద వెలసిన శివుడికి శ్రీపర్వతస్వామి అని పేరు. విష్ణుకుండి వంశపు మహారాజులు శ్రీపర్వతస్వామిపాదాలు కొలిచి వృద్ధి పొందినవారు. శైవము, వైష్ణవముకూడా వేద మతానికి సంబంధించిన సంప్రదాయాలే. వేదమతము బాగా వ్యాపించి, దేశములో బౌద్ధమతము నీరసించడముతో ప్రాకృతభాషలకూ, ప్రాకృతకవులకూ, ప్రాకృతగ్రంథాలకూ ఆదరము సన్నగిల్లింది. సంస్కృతభాషకూ, సంస్కృతకవులకూ, వేదవిద్యలకూ ఆదరాభిమానాలు హెచ్చినవి. సంస్కృతము ప్రభ అతిశయిల్లింది. ప్రాకృతము క్రమముగా క్షీణించింది. తెలుగుభాష రేఖ ఈకాలంలోనే క్రమముగా బయలుపడింది.

## నాలుగవ ప్రసంగము

### పూర్వ చాళుక్యయుగము

విష్ణుకుండివంశపురాజులకు తరువాత పూర్వాంధ్ర దేశాన్ని ఆక్రమించుకొని పరిపాలించినవారు చాళుక్యవంశ క్షత్రియులు. వీరికి మొట్టమొదట బొంబాయిరాజధానిలోని విజాపూరుజిల్లాలోని వాతాపి, ఇప్పటి బాదామినగరము రాజధాని. అక్కడ వీరు క్రీస్తుశకము ఆరవశతాబ్ది మధ్య కాలములో రాజ్యము స్థాపించి దానికి చుట్టుపట్ల ఉన్న దేశాన్ని పరిపాలించారు. ఈవంశములో సత్యాశ్రయుడు అనే రెండవ పులకేశిమహారాజు గొప్ప పరాక్రమవంతుడు. ఉత్తరహిందూదేశాన్ని పాలించిన హర్షవర్ధనచక్రవర్తిని గురించి మీరు చదివినారుకాదూ? ఆచక్రవర్తీ, ఈసత్యాశ్రయ పులకేశిమహారాజూ ఒకటేకాలములో ఉన్నారు. వీరు ఇద్దరూ సమకాలికులు. పులకేశిమహారాజు ఎంతటి బలపరాక్రమాలుగలవాడంటే, హర్షవర్ధన చక్రవర్తి దక్కనుదేశంమీదికి దండెత్తివస్తే అతనిని ఓడించి, ఉత్తర దేశాన్ని అంతనూ జయించానన్న అతని గర్వాన్ని అణచి వేశాడు. సామాన్య విషయమా ఇది, అంతటి మహా రాజును ఓడించడమంటేను. హర్షవర్ధనచక్రవర్తినే కాదు, దక్కనుదేశములో తన ఇరుగు పొరుగుల ఉన్న రాజులను అందరినీ జయించి అంతవరకు చిన్న సంస్థానముగా ఉంటూవచ్చిన బాదామిని గొప్ప చాళుక్యరాజ్యముగా

విస్తరింపజేశాడు. తరువాత పులకేశిమహారాజు గొప్ప దిగ్విజయయాత్ర తలపెట్టి యువరాజయిన తనతమ్ముడు విష్ణువర్ధనుడితోకూడా మనదేశంమీదికి దండెత్తివచ్చి, ఒక్క పూర్వాంధ్రదేశాన్నే కాదు, అఖిలాంధ్రదేశాన్నీ జయించాడు. అతడు తన తమ్ముడు విష్ణువర్ధనుణ్ని ఈ జయించిన వేంగిదేశాన్ని పరిపాలించడానికి తనకు ప్రతినిధిగా నియమించాడు. విష్ణుకుండివంశంవారు వేంగిరాజులు కాబట్టి వారికాలములో పూర్వాంధ్రదేశానికి అంతకూ వేగి( వేంగి) దేశమని పేరు వచ్చింది. ఈ వేగి దేశములో చాళుక్య రాజ్యము స్థాపించినవాడు సత్యాశ్రయమహారాజు తమ్ముడు విష్ణువర్ధనుడు. ఇతని సంతతివారిని చరిత్రలో తూర్పు చాళుక్యులనీ - (తూర్పుదేశాన్ని పాలించిన చాళుక్య రాజులు) పూర్వచాళుక్యులనీ, వేంగీచాళుక్యులనీ (వేగి దేశాన్ని పాలించిన చాళుక్యులు) అంటారు. మొదట తన అన్నగారికి ప్రతినిధిఅయి యువరాజుగా ఉన్నప్పటికీ తరువాత క్రీ.శ. 625లో స్వతంత్రుడై విష్ణువర్ధనమహారాజు తనరాజ్యాన్ని పాలించాడు. ఇతనికి గూను ఉండడంవల్ల ఇతనిని కుబ్జవిష్ణువర్ధను డంటారు. ఇతనికొడుకు జయసింహ వల్లభ మహారాజుకు సర్వసిద్ధి అని బిరుదు. విశాఖపట్నం జిల్లాలోని సర్వసిద్ధి ఇతనిపేర కట్టినదే.

సాతవాహనుల కాలమునాటినుంచి వేంగీచాళుక్యుల వరకూ గల రమారమి తొమ్మిదివందల సంవత్సరాలకాలములో మనదేశములో చాలాభాగం అడవి తెగిపోయి అది

జనులకు నివాసయోగ్యమైనది. పాడిపంటలు క్రమముగా వృద్ధిచెంది దేశం వెనుకటికంటె సిరిసంపదలతో తులతూగింది. ఒక ప్రాంతానికీ మరొకప్రాంతానికీ రాకపోకలకు అనుకూలాలు హెచ్చినవి. వ్యాపారమూ పెరిగింది. వేరువేరు ప్రాంతాల చిన్నచిన్న రాజులు చిన్నచిన్న సంస్థానాలు కట్టుకొని ఎవరికి వారు విడివిడిగా ఉండేకాలం గడచిపోయినది. జనసమృద్ధమూ, సస్యసంపన్నమూ అయిన దేశాన్ని అంతా తమ అధికారంక్రిందికి తెచ్చుకోడానికి ప్రయత్నించిన పెద్దరాజ్యాలకాలం ఇది. పూర్వాంధ్రదేశం అంతా చాళుక్యరాజులవశాన ఉంటే, వారికి పొరుగున కాంచీపురం పల్లవరాజులు బలవంతులై కొంతకాలానికి పశ్చిమాంధ్ర దేశములో కొంతభాగం ఆక్రమించుకొన్నారు. బాదామి నగరాన్ని సత్యాశ్రయమహారాజు సంతతివారు క్రీస్తుశకం ఎనిమిదవశతాబ్ది మధ్యవరకు పరిపాలించారు. అటుతరువాత వారిని జయించి వారి రాజ్యాన్ని రాష్ట్రకూటవంశపు రాజులు మాల్యఖేటము - హైదరాదు రాజ్యంలోని ఇప్పటి మాల్ఖేడు - రాజధానిచేసుకొని రెండువందల సంవత్సరాలకాలం, అంటే క్రీస్తుశకం పదవశతాబ్ది మధ్యవరకు పరిపాలించారు. ఈవిధముగా వేగిచాళుక్యరాజులకు పడమటిదిక్కున కొంతకాలము వారికి జ్ఞాతులైన బాదామి చాళుక్యులున్ను, అటుతరువాత మాల్యఖేటము రాష్ట్రకూట రాజులున్ను సమకాలికు లయినారు. తమరాజ్యం ఆరంభం నాటినుంచీ రాష్ట్రకూటరాజులు తమ అధికారాన్ని


తూర్పుసముద్రతీరానికంటా వ్యాపింపజేయాలని తీవ్రముగా ప్రయత్నిస్తూవచ్చారు. ఈవిధమైన ప్రయత్నములో రాష్ట్రకూటరాజులకూ వేగీచాళుక్యనృపతులకూ చాలాయుద్ధాలు జరిగినవి. ఒకమారు ఈ చాళుక్య - రాష్ట్రకూటయుద్ధము పన్నెండేళ్లవరకు సాగుతూనేవుంది. ఈ వుభయవంశాల వారికీ వైరమూ యుద్ధాలూ బాదామి చాళుక్యవంశశాఖలోని తైలపరాజు అనేవాడు రాష్ట్రకూటరాజ్యాన్ని కూలద్రోసి మళ్లీ చాళుక్యవంశాధికారాన్ని తిరుగా అక్కడ స్థాపించినదాకా సాగుతూనే వచ్చినవి.

తైలపునిసంతతివారిని చరిత్రలో పశ్చిమచాళుక్యులు అంటారు. వీరి రాజధాని హైదరాబాదురాజ్యంలోని కల్యాణినగరం.

వేంగీచాళుక్యవంశములో పరాక్రమవంతులై శత్రువులను చించి చెండాడి తమరాజ్యాన్ని నాలుగుమూలలా విస్తరింపజేసిన రాజులు ఎందరో ఉన్నారు. వీరిలో చాలామందికి విష్ణువర్ధనులని, విజయాదిత్యులని పేరు. ఇవి జయసింహవల్లభుడి మనుమడు మంగిమహారాజుకొడుకైన మూడవ విష్ణువర్ధనుడి కాలంనుంచి తండ్రి కొడుకులకు ఒకరిని విడిచి ఒకరికి వరుసగా చాలాకాలంవరకూ వస్తూవచ్చిన పేర్లు. వీరిలో నాలుగవ విష్ణువర్ధనుడికొడుకు రెండవ విజయాదిత్యమహారాజున్ను, ఇతని మనుమడూ అయిదవ విష్ణువర్ధనుడి కొడుకూ అయిన మూడవ విజయాదిత్యమహారాజున్ను చాలా పరాక్రమవంతులు. రెండవ విజయాదిత్యమహారాజు

పన్నెండేళ్లు రాష్ట్రకూటులతో యుద్ధం చేసి, వారిని నూరు యుద్ధాలలో ఓడించాడు. ఇతనికి నరేంద్రమృగరాజ విజయాదిత్యుడని నామాంతరం. ఈ విధంగానే రాష్ట్రకూట రాజులతోడి యుద్ధాలలో వారిని అనేకపర్యాయాలు ఓడించి వీరాధివీరుడని పేరు గడించాడు - క్రీ. శ. 844 నుంచి 892 దాకా దేశం పాలించిన మూడవ విజయాదిత్యమహారాజు. నాలుగవ విజయాదిత్యుని కొడుకయిన అమ్మరాజరాజమహేంద్రుడే తనపేర నేటి రాజమహేంద్రవరాన్ని కట్టించాడు.

పూర్వ చాళుక్యవంశంవారు సంతానసమృద్ధిగలవారు. అందువల్ల విష్ణువర్ధనునివంశం శాఖోపశాఖలై వర్ధిల్లింది. ఈసంతానసమృద్ధి ఒకవిధముగా ఈవంశానికి అరిష్టమే అయినది; ఎందుచేతనంటే సింహాసనంకోసం జ్ఞాతితగాదాలూ, యుద్ధాలూ తరచుగా సంభవిస్తూవచ్చినవి. రాజ్యాధికారానికి వచ్చిన రాజును కూలదోసి సింహాసనం ఆక్రమించుకోడానికి అతని అన్నదమ్ముల వంశంవారు తరచుగా కుట్రలు చేసి, తమకోరిక నెరవేర్చుకొనేటందుకు రాజవంశంవారికి విరోధులుగా ఉండే ఇరుగు పొరుగు రాష్ట్రకూటరాజులు మొదలైనవారి సాయం పొందుతూవచ్చారు. ఈవిధమైన కుట్రలవల్లా, జ్ఞాతివివాదాలవల్లనే ముఖ్యముగా రాష్ట్రకూటరాజులకు తరచుగా పూర్వచాళుక్యరాజ్యం మీదికి దండెత్తిరావడానికి అవకాశం కలుగుతూవచ్చింది. ఈవిధమైన జ్ఞాతికలహాలు ఈవంశములో ఎక్కువగా క్రీస్తుశకం వెయ్యోసంవత్సరందాకా సాగుతూనేవచ్చినవి.




చాళుక్యయుగంనాటి ఆంధ్రదేశము

రాష్ట్రకూటరాజ్యం పడిపోయి పశ్చిమచాళుక్య రాజులు అధికారానికి వచ్చిన సంధికాలములో, పల్లవరాజుల తరువాత క్రీస్తుశకం పదవశతాబ్దిలో అరవదేశాన్ని ఆక్రమించుకొని పరిపాలించిన బలపరాక్రమవంతులైన చోళ మహారాజులు రాజరాజు, అతనికొడుకు రాజేంద్రచోడుడు మొదలైనవారు పూర్వచాళుక్యులరాజకీయవ్యవహారాలలో ఆయంతఃకలహాలవల్లనే జోక్యం కలుగజేసుకోడం సంభవించింది. పూర్వకాలములో పల్లవులకు రాష్ట్రకూటులకు లాగే ఈచోళరాజులకు పశ్చిమచాళుక్యభూపతులకు రాజ్య సంపాదనకోసం కలహాలు పెరిగి వారు ఉభయులకు చాలాకాలం యుద్ధాలు జరిగినవి. ఈయుద్ధసమయములో పూర్వాంధ్రదేశం తమపక్షాన ఉంటేనేకాని తమరాజ్యానికి ఉపద్రవకరమని, చోళరాజులు ఆదేశాధిపతులైన పూర్వ

చాళుక్యరాజులతో స్నేహంకట్టవలసిన అవసరం కలిగి, వేంగిరాజకీయవ్యవహారాలలో చెయిచేసుకొన్నారు. వీరు తమజ్ఞాతికలహాలవల్ల రాజ్యం పోగొట్టుకొన్న శక్తివర్మకు, అతనిసోదరుడు విమలాదిత్యుడికి సాయంచేసి ఆచాళుక్య రాజకుమారులను వేంగిసింహాసనంమీద కూర్చోబెట్టినారు. ఇంతే కాదు, ఆకాలములో వెనుక రాష్ట్రకూటరాజులు అవలంబిస్తూవచ్చిన రాజనీతినే అవలంబించి పశ్చిమ చాళుక్యరాజులు వేంగిరాజ్యాన్ని వశపరుచుకోవాలని ప్రయత్నిస్తూవచ్చినందువల్ల, వారి ప్రయత్నాలు సాగకుండా చేసి దానిని తమ పలుకుబడిక్రింద ఉంచుకొనేనిమిత్తం చోళ మహారాజులు తమ ఆడుబిడ్డలను చాళుక్యమహారాజులకు ఇచ్చి పెళ్లిళ్లు చేశారు. రాజరాజచోళమహారాజు తనసోదరి కుందవాంబను శక్తివర్మసోదరుడు విమలాదిత్యనృపతి కిచ్చి పెండ్లిచేశాడు. ఈ దంపతు లిద్దరికీ పుట్టినవాడే మన రాజ రాజనరేంద్రుడు. ఇతడు మళ్లీ రాజేంద్రచోళుడి కూతురు అమ్మంగదేవిని వివాహం చేసుకొన్నాడు; క్రీ. శ. 1022 లో వేంగీ సింహాసనం ఎక్కినాడు. ఇతనివరకు మనదేశాన్ని పాలించిన ఇతని వంశంవారిని చాళుక్యులు అంటారు. నన్నయభట్టుగారు ఈ రాజరాజనరేంద్రుని ఆస్థానకవి.

వేంగీచాళుక్యులకాలములో మనదేశములో వేదమతం బాగా బలడింది. వేదమత సంప్రదాయమైన శైవానికి దేశ ములో ఎక్కువ ఆదరణ దొరికింది. బౌద్ధమతం ఇంచు మించుగా లేనిదానిలోనే జమ. జైనమతానికి దేశములో

కొంతపట్టు దొరికింది. అత్తిలి, బెజవాడ, ధర్మవరము, తాటి పాక, పెనుగొండ మొదలైనవి ఆకాలములో గొప్ప జైన క్షేత్రాలు. ఈ నగరాలలో గొప్ప జైనమఠాలు ఉండేవి. ఆ మఠాలలో జైనవిద్యార్థులకు ఆ మతాచార్యులు తమ సంప్రదాయంప్రకారం విద్య నేర్పేవారు. చాళుక్యరాజులు జైనులను బ్రాహ్మణులను సరిసమానముగా ఆదరించారు. వారు జైనమఠాలకు కూడా భూదాన, అగ్రహార దానాలు చేశారు - వారు వేదమతాన్ని అవలంబించినవారయినప్పటికీని. బ్రాహ్మణులకు వారు చేసిన భూదాన, అగ్రహారదానాలకు లెక్కే లేదు. బ్రాహ్మణాగ్రహారాలు వెనుకటికంటెనూ గొప్ప విద్యాపీఠాలైనవి.

ఈకాలములో గౌరవమూ, పలుకుబడీ అంతా బ్రాహ్మణులదే. బ్రాహ్మణులు రాజులకు గురువులై, ఉపదేశకులై, మంత్రులై రాజకార్యాలలోకూడా నియమితులు అవుతూ వచ్చారు. ఇట్టివారిని నియోగులనేవారు. రాజకుమారులకు ధనుర్విద్య రాజనీతి మొదలైన విద్యలు అన్నీ బ్రాహ్మణులే నేర్పేవారు. బ్రాహ్మణులలో వేదాలు, శాస్త్రాలు చదువుకొన్న గొప్ప పండితులు అనేకులు ఉండేవారు; యుద్ధాలలో పాల్గొని గొప్ప కీర్తిగడించిన సేనాధిపతులూ ఉండేవారు ఎందరో.

చాళుక్యులకాలములో వర్తకవ్యాపారం విరివిగా సాగింది. మనదేశవర్తకులు తూర్పుదేశాలతోను, ద్వీపాలతోను ఓడవర్తకం బాగా చేసేవారు.

తెలుగుభాష క్రమముగా వృద్ధిపొంది ఈ కాలములో ననలు తొడిగింది. కవులు తెలుగులో పద్యాలు, పదాలు వ్రాస్తూవచ్చారు. మన తెలుగుభాషలో పద్యాలు మొట్ట మొదటిమారు మూడవ విజయాదిత్యమహారాజుకాలం నుంచీ, అతని తమ్మునికొడుకు భీమమహారాజుకాలంనుంచీ కనబడుతవి. అప్పటికే కవిత్వం చెప్పడానికి తెలుగు అనుకూలమైన భాషగా రాటుతేరినది. రాజరాజనరేంద్రుడి నాటికి తెలుగులో ధారాళముగా పద్యాలు వ్రాయడం వచ్చింది. అందువల్లనే ఆమహారాజు ఆస్థానకవి నన్నయ్యగారు సంస్కృత మహాభారతాన్ని పద్యాల రూపముగా తెలుగులోనికి తర్జుమా చేశారు. ఇంతవరకు దొరికిన తెలుగుగ్రంథాలలో నన్నయగారు వ్రాసిన ఆంధ్ర మహాభారతమే మొట్టమొదటిది.

# అయిదవ ప్రసంగము

## కళింగము : గాంగయుగము

మధ్యాంధ్రదేశములో తూర్పు గోదావరిజిల్లాలోని పిఠాపురము మొదలుకొని ఉత్తరంవైపు మహానదిదాకా వ్యాపించిన దేశాన్ని కళింగ మంటారు. కళింగానికి ఉత్తరపు దిక్కున ఉండేదేశం ఉత్కలము, అంటే ఓఢ్రదేశము, ఒరిస్సా. ఉత్తరకళింగము అనే పదమే జనులవాడుకలో ఉత్కలము అనే పదముగా మారిందని భాషాశాస్త్రము తెలిసినవా రంటారు.

కళింగము పూర్వకాలపుచరిత్ర తలచుకోగానే గాంగ వంశంవారు కాదు, ముందు మనకు జ్ఞాపకం వచ్చేది దంత పురము - కళింగదేశానికి రాజధాని. బుద్ధుడు నిర్వాణం పొందినతరువాత ఆయనదంతము తీసుకువచ్చి బౌద్ధమతం అవలంబించిన కళింగదేశంవారు దానికోసము అందమైన స్తూపం కట్టి దానిలో పదిలపరిచారట ఆదంతాన్ని. ఆదం తముమహత్తు తెలిపే గాథలు ఎన్నో ఉన్నవి. ఈ దంత స్తూపము ఉన్నపురానికి దంతపుర మనిపేరు. పూర్వకాల ములో కళింగదేశంప్రజలు, దానిని ఏలినరాజులు కూడా బౌద్ధులే.

బౌద్ధముతరువాత జైనమతంకూడా ఈ దేశములో కొంత వ్యాపించింది కాని ప్రబలలేదు. దానిని మొట్టమొదట ఆదరించి పోషించినవాడు - సాతవాహనకులజుడు శ్రీశాత

కర్ణిమహారాజుకు సమకాలికుడై కళింగదేశాన్ని పాలించాడని మొదటి ప్రసంగములో చెప్పితినే - ఆ ఖారవేలమహారాజు. ఇతడు గొప్ప పరాక్రమశాలి. మగధరాజ్యంమీాదికి ఎన్నోతడవలు దండెత్తివెళ్లి ఆమహారాజును ఓడించి తరిమివేశాడు. ఇంతే కాదు, ఇరుగు పొరుగు రాజులను కూడా చాలామందిని జయించాడు. ఇతడు జైనమతాభిమాని. ఓఢ్రదేశంలోని పూరీజిల్లాలో ఉదయగిరి, ఖండగిరి అనే కొండ లున్నవి. ఇతడు ఆకొండలను దొలిపించి శిల్పముతో సుందరమైన గుహాలయాలు నిర్మించి జైనసన్యాసులకు సమర్పించాడు. ఇతని తరువాత కళింగము పరిపాలించినవారు అంత పరాక్రమవంతులూ కారు, ఇతనంతటి జైనమతాభిమానులూ కారు. అందువల్ల ఖారవేలమహారాజు తరవాత కళింగములో జైనమతం పూర్తిగా అంతరించక పోయినా బౌద్ధమతంలాగ ప్రబలలేదు.

ఖారవేలరాజు తరువాత కళింగాన్ని పాలించిన పెద్ద రాజు ఎవ్వరూ లేడు. కళింగదేశమంతా కొండల అడవులమయం; పైగా ఇది యావత్తూ సముద్రపు వొడ్డునేవున్న దేశం. అందువల్ల అడవులు, కొండలు, సముద్రము - ఈ మూాటి ప్రభావమూ కళింగదేశచరిత్రమీాద కనబడుతుంది. కొండలా, అడవులా దేశం అవడంవల్ల ఖారవేలుడివంటి గొప్పపరాక్రమశాలి అయినమహారాజు లేకపోయేటప్పటికి కొంతబలమూ ప్రతాపమూ గలవారు కొండప్రాంతాలలోనూ, కొండలకు కొండలకు మధ్య లోయలలోనూ,

సముద్రతీరపు పల్లపుప్రదేశంలోనూ చిన్నచిన్న రాజ్యాలు కట్టుకొని తమకు వశమైనంత దేశాన్ని పాలిస్తూవచ్చారు. ఈరాజ్యాలను అన్నిటినీ జయించి శాశ్వతముగా ఒక్క మహారాజు అధికారాన ఉంచుకోడం కష్టమే అయేది. ఈచిన్నరాజులు తమకోటలు కాకులు దూరని కారడవుల మధ్యా,కొండకోనలలోనూ కట్టుకొనేవారు. అడవిదారులూ, కొండదారులూ ప్రాంతాన ఉన్నవారికేకాని తెలియవు. ఈదొరలను కొండరాజులనీ, మన్నెరాజులనీ అనేవారు. వీరు అందరూ విల్లమ్ములతో యుద్ధంచేయడములో చాలా నేర్పరులు. పూర్వకాలములో యుద్ధముచేసే ఆయుధాలలో విల్లమ్ములే ముఖ్యమైనవి. ఏమహారాజయినా వీరిని తాత్కాలికముగా జయించినా ఆట్టేకాలము వీరిని తన పాదాలక్రింద తొక్కిపెట్టి ఉంచలేకపోయేవాడు. మళ్లీ వారు స్వతంత్రులై తమరాజ్యం పాలించుకొనేవారు. ఈ చిన్నచిన్న రాజ్యాల చరిత్ర మనకు ఏమీ తెలియదు. వీరిలో ఒకరికీ మరొకరికీ పడకపోతే పడకపోయీ ఉండవచ్చు; ఒకరితో ఒకరు విరోధాలు పెంచుకొని ఒకరి రాజ్యంమీదికి ఒకరు దండెత్తివెడుతూనూ ఉండవచ్చును. కళింగ దేశం ఈవిధముగా ఉండడంవల్ల అవకాశం దొరికే వచ్చాడేమో, ఉత్తరహిందూదేశాన్ని పాలించిన గుప్తవంశజుడు సముద్ర గుప్తచక్రవర్తి క్రీస్తుశకం 350 ప్రాంతాన కళింగదేశం మీదికి దండెత్తివచ్చాడు. ఒక్కకళింగాన్నే కాదు, ఈ చక్రవర్తి కంచివరకూ తూర్పుసముద్రతీరాన రాజ్యంచేసే

రాజులు అందరినీ జయించాడు. సముద్రగుప్తచక్రవర్తి దండయాత్ర ఒకపెద్ద గాలితుపానులాగ దేశాన్ని బీభత్సం చేసివేసింది కాని శీఘ్రకాలంలోనే దేశం మళ్లీ తేరుకొని కుదుటబడింది. మళ్లీ ఎప్పటి పాటే, చిన్నరాజ్యాల పరిపాలన.

సముద్రగుప్త చక్రవర్తి దండయాత్ర జరిగిన నూరు నూటయేభై సంవత్సరాలకు కళింగదేశములో అడుగు పెట్టినారు గంగవంశపురాజులు.

సముద్రగుప్తుడి దండయాత్రవంటి పరరాజదండ యాత్రలు జరిగినప్పుడూ, కరవు కాటకాలు సంభవించి నప్పుడూ సముద్రతీరప్రాంతములో ఉన్నవారు అట్టి ఉపద్ర వాలు తప్పించుకొనేటందుకూ, బ్రతుకుతెరవు చూచుకొనే టందుకూ సముద్రంమీద తూర్పుదేశాలకూ, ద్వీపాలకూ సబురుచేసేవారు. ఓడప్రయాణానికి సబురు అంటారు. అట్టి ఉపద్రవాలులేని కాలములో సముద్రతీరప్రాంతములో ఉన్న కళింగదేశవర్తకులు వర్తకంనిమిత్తం సముద్రం అవతల తూర్పున ఉన్న బర్మా, సయాం, కంబోడియా, మలయా ద్వీపకల్పము, సుమత్రా, జావా, బలి మొదలైన దేశాలకు ద్వీపాలకు సబురులు చేసేవారు.

పూర్వకాలములో బర్మా, మలయాద్వీపకల్పము, సుమత్రా, జావాలలో నదీతీరాల బంగారపు ఇసుక దొరికే దనీ, కొండప్రాంతాల నాటున బంగారుగనులు ఉండేవనీ ప్రసిద్ధి. ఈకారణంచేత మొత్తంమీద ఈదేశాలకూ, ద్వీపా లకూ సువర్ణభూమి అనీ, సువర్ణద్వీప మనీ పేరు వచ్చింది.

ఇక్కడ ఒక్క బంగారమే కాదు. వెండి, తగరము, అగరు, కర్పూరము, ఇతర సుగంధద్రవ్యాలుకూడా పుష్కలముగా దొరికేవి. మనదేశంవారు రెండువేల సంవత్సరాలకు పూర్వంనుంచే రాజ్యాలు నిర్మించుకొని మహావైభవముగా రాజ్యము పాలించినవారేమో, వారికి రాజభోగాలకు ఈ సుగంధద్రవ్యాలు, వెండి బంగారాలు అన్నీ కావలసి వచ్చినవి. మనదేశంవర్తకులు సాహసముతో ధ్రువనక్షత్రాన్ని దిక్కులు తెలిపే సాధనం చేసుకొని ఓడలమీద సబురులు చేసి ఈసరకు లన్నీ తెచ్చేవారు. దక్షిణహిందూ దేశం తూర్పుతీరములో ఈవిధమైన ఓడలవర్తకము సువర్ణభూమితో మొట్టమొదట ఆరంభించినవారు కాళింగులే - కళింగదేశీయులు. చీనాదేశవర్తకులూ, మన హిందూదేశవర్తకులూ సువర్ణభూమిలో కలుసుకొనేవారు. ఆ కాలములో వర్తకులు ఇక్కడినుంచి తీసుకువెళ్లిన సరకులు అక్కడివారికి ఇచ్చి, అక్కడి సరకులు ఇక్కడికి తెచ్చుకొనేవారు. ఇదీ అప్పటి వర్తకపు పద్ధతి. క్రీస్తుశకం మూడవ, నాలుగవ శతాబ్దులనాటి తమ దేశచరిత్రలో చీనావారు వ్రాసుకొన్నారు తాము సువర్ణభూమిలో కళింగ దేశవర్తకులను కలుసుకొన్నామనీ, అక్కడి వర్తకమంతా కాళింగులవశంలోనే ఉందనీని. ఒక కళింగవర్తకుడు అంతటి ప్రాచీన కాలములో, అంటే ఇప్పటికి రమారమి పదహారు వందల సంవత్సరాలకు పూర్వమే చీనాదేశానికికూడా వెళ్లినాడట. చూశారా ఆసాహసం, ఎక్కడి చీనా, ఎక్కడి

కళింగము! కళింగంనుంచి తూర్పు సముద్రాలమీదుగా చీనా వెళ్లి తిరిగి రావడానికి నాలుగేళ్లు పట్టేదట. కళింగవర్తకులు ఒక్కొక్కరు తెగించి ఇరవై, నలభై, ఎనభై, వంద, రెండువందలు ఓడలు కట్టుకొని వెళ్లేవారట. దేశములో ఉపద్రవాలు సంభవించినపుడు కళింగదేశం జనం గుంపులు కట్టి సముద్రంమీద ఓడలలో పడడమే. సముద్రప్రయాణమంటే భయం కాని, పిరికితనం కాని ఉండేది కాదు. జావా ద్వీపములో ఇప్పటికీ వున్నవి ప్రచారములో కొన్ని గాథలు. ఒక గాథవల్ల మనకు తెలుస్తుంది ఏమనంటే, ప్రాచీన కాలములో కళింగరాజ కుమారుడు ఒకడు కళింగంనుంచి ఇరవై వేల కుటుంబాలవారిని జావాకు పంపినాడట. కళింగదేశంనుంచి ఆ దేశాలకు ద్వీపాలకు వలసవెళ్లినవాళ్లు అక్కడ తాము నివసించే ప్రదేశానికి కళింగమనే పేరు పెట్టుకొంటూవచ్చారు. పూర్వము బర్మాలో కళింగ రాష్ట్రం ఉన్నది; సింహళములో కళింగరాష్ట్రం ఉన్నది; జావాద్వీపములో కళింగరాష్ట్రం ఉన్నది. సింహాసనం ఎక్కడానికి హక్కులేని రాజకుమారులుకూడా తమ అదృష్టం కలిసివస్తే ఎక్కడయినా స్వతంత్రరాజ్యం స్థాపించుకోవచ్చునని సువర్ణభూమికి వెడుతూవుండేవారు. ఇట్టి వారిలో ఆ దేశాలలో ద్వీపాలలో రాజ్యాలు స్థాపించి రాచరికం చేసినవారూ ఉన్నారు. జావాను క్రీస్తుశకం ఎనిమిది, తొమ్మిది, పదవశతాబ్దులలో పరిపాలించిన శైలేంద్రవంశపు రాజులు కళింగదేశీయులే. శైలేంద్రవంశంవారి కాలము

లోనే జగత్ప్రసిద్ధమైన బొరొబుదూర్ బౌద్ధస్తూపము కట్టినది. ఈ స్తూపంలోని సుందరమైన శిల్పచిత్రాలకు సాటి వచ్చేవి లేవనీ, బౌద్ధకళకు ఈస్తూపము పరమావధి అనీ కళావిమర్శకులు దీనిని చాలా పొగడినారు. కళింగదేశ చరిత్రమీద సముద్రప్రభావమంటే ఇది.

శైలేంద్రులు జావాలో రాచరికం చేస్తూవున్న కాలములో కళింగాన్ని పరిపాలించినవారు గంగవంశంవారు. వీరిలో రెండు కోవలు ఉన్నవి. ఒకకోవవారు మైసూరులో పాలించారు. మరొకరు కళింగములో రాజ్యముచేశారు. మైసూరువారిని పశ్చిమ గంగవంశంరాజులు అంటారు; కళింగంవారిని తూర్పు గంగవంశపురాజులు అంటారు. వీరు ఉభయులదీ కుదురు ఒక్కటే. మైసూరునుంచి గంగవంశపు రాజులు అయిదుగురు తమ బలపరాక్రమాలవల్ల రాజ్యము సంపాదించుకోవాలని బైలుదేరి దేశాలు తిరుగుతూ కళింగానికి వచ్చారట. వేగిదేశానికి శ్రీశైలం ఎటువంటిదో కళింగానికి మహేంద్రగిరి అటువంటిది. ఇది గంజాము జిల్లాలో ఉన్నది. ఆ కొండమీద శివుడు గోకర్ణస్వామి అనే పేరుతో వెలసినాడు. ఈ గంగవంశపురాజులు ఆ గోకర్ణ స్వామిని ఆరాధించి ఆయన అనుగ్రహంవల్ల అక్కడి రాజులను జయించి కళింగదేశములో గంగరాజ్యము స్థాపించారు. ఇక్కడ తమ పరిపాలన ఆరంభమైనది మొదలుకొని ఈ రాజులు తమ విజయరాజ్యసంవత్సరాలు వరుసగా లెక్క వేసుకొంటూవచ్చారు. ఈ సంవత్సరాలను గాంగశక

సంవత్సరాలు అంటారు - చరిత్రకారులు. వీరి పరిపాలన నిక రంగా ఎప్పుడు ప్రారంభమైనదీ తెలియకపోయినా వీరు కళింగాన్ని రమారమి క్రీస్తుశకం 500 ల ప్రాంతమునుంచి పాలిస్తున్నట్టు చరిత్రకారులు నిర్ణయిస్తున్నారు. వీరు 1400 ల ప్రాంతందాకా కళింగానికి ఏలికలు. వీరిలాగ అవిచ్ఛిన్నముగా తొమ్మిదివందల సంవత్సరాలకుపైని రాజ్య మేలినవంశం దక్షిణ హిందూదేశములో మరొకటి కన బడదు. పూర్వకాలంనుంచీ కళింగాటవులు శ్రేష్ఠజాతి ఏను గులకు ప్రసిద్ధి. కళింగదేశపురాజుల సైన్యములో ఏనుగులు ఎక్కువగా ఉండడంవల్ల వారికి గజపతులు అని పేరు వచ్చింది.

ఈ గంగవంశపురాజులలో కళింగాన్ని క్రీస్తుశకం వేయవసంవత్సరానికి పూర్వం పాలించినవారిని ప్రాచీన గాంగరాజులని, అటుతరువాతి వారిని అర్వాచీన గాంగ రాజులని చరిత్రకారులు అంటారు. మొదటివారికంటె తరు వాతివారే చాలా ప్రతాపవంతులు. వీరిలో వజ్రహస్తదేవు మొదటి మహారాజు. ఇతని కొడుకు రాజరాజదేవు, మను మడు అనంతవర్మ చోడగంగదేవుల రాజ్యకాలములో వీరికీ చోళమహారాజులకూ చాలా యుద్ధాలు జరిగినవి. గంగ వంశపురాజులు అందరిలోనూ అనంతవర్మ చోడగంగదేవు చాలా ప్రసిద్ధుడూ, పరాక్రమశాలీని. ఇతని అనంతరము ఇతని కొడుకులు మధుకామార్ణవుడు, రాఘువుడు, రాజ రాజు, అనంగభీముడు (అనియంక భీముడు) ఒకరి తరువాత

ఒకరు రాజ్యం పాలించారు. అనంగభీముడి మునిమనుమడు నరసింహదేవు దగ్గరనుంచి అతని సంతతివారికి తండ్రి కొడుకులకు ఒకరిని విడిచి ఒకరికి నరసింహదేవు, భానుదేవు అని పేర్లు. నలుగురు నరసింహదేవులు, నలుగురు భానుదేవులు కళింగాన్ని పాలించారు.

గంగవంశంవారిరాజ్యం ఒకప్పుడు ఉత్తరాన గంగానదివరకూ, దక్షిణాన గోదావరినదివరకూ వ్యాపించింది. ఈ రాజ్యసంపాదన, సంరక్షణ ప్రయత్నములో ఈ గంగవంశపురాజులకు ఉత్తరంవైపు బంగాళాదేశము పాలించిన నవాబులతోను, పడమటివైపు చేదిరాజులతోను, దక్షిణంవైపు చాళుక్యచోళ సామంతులతోను కొండవీటి రెడ్డిరాజులతోను తరచుగా యుద్ధాలు సంభవించేవి. ఈవంశంవారిలో నాలుగవ భానుదేవే కళింగాన్ని పాలించిన చివరి రాజు. ఈ గంగవంశంవారి పరిపాలన క్రీ. శ. 1437 లో అంతరించింది.

చిన్నరాజుల తల్లకు తట్టుకోలేక మొదటి భానుదేవు రాజనీతిలోను, శత్రువులను సంహరించడంలోను నేర్పరులైన పరిపాలనదక్షులు పదహారుగురు సామంతులను రాజ్యరక్షణకు నియమించాడు. వీరికి పాత్రసామంతులని పేరు. వీరు అందరూ గంగసామ్రాజ్యాన్ని జాగ్రతగా కాపాడేవారు.

గంగవంశపురాజులు మొదటివారు శైవులు; తరువాతివారు వైష్ణవులు. వీరు గొప్ప దేవాలయాలు నిర్మించారు.

ముఖలింగము, శ్రీకూర్మము దేవాలయాలు వీరు కట్టించినవే. పూరీజగన్నాథాలయము కట్టించినవాడు అనంతవర్మ చోడ గంగదేవు. కోణార్కము (ఒరిస్సా)లోని సూర్యదేవాలయము కట్టించినది నరసింహదేవు. ఇంకా ఉన్నవి వీరి కాలములో నిర్మితమైన దేవాలయాలు. ఈకళాకుసుమాలు వెదచల్లి కళింగ గాంగవంశపురాజులు ఉత్కలానికి అందం తెచ్చారు. వేములవాడ భీమకవి అనంతవర్మ చోడగంగ దేవు తండ్రి రాజరాజదేవుకు సమకాలికుడని చెపుతారు. ఈ గాంగరాజులు వేదవిద్యలను, కళలను పోషించి కీర్తి గడించారు.

---

## ఆరవ ప్రసంగము

### మండలికయుగము : వెలనాటినాయకులు

చాళుక్య రాజరాజనరేంద్రుని తరువాత వేగి రాజకీయ వ్యవహారాలు మరీ చిక్కులలో పడినవి. చోళమహారాజులు వేంగిని జయించి తమ పలుకుబడి పెంపొందించుకొన్నారు. రాజరాజనరేంద్రుని కొడుకు రాజేంద్రచోడుడికి మేనమామలతోడి సంబంధంవల్ల అరవదేశముతో పొత్తు ఎక్కువయినది. అతడు మేనమామలరాజ్యం అరవదేశం కూడా గట్టిప్రయత్నం చేసి ఎట్లాగయితేనేమి వశపరుచుకొని, వేంగీచాళుక్య చోళరాజ్యాలు రెంటికి క్రీ. శ. 1070లో అధిపతిఅయి ఏభయి సంవత్సరాలు రాజ్యము చేశాడు; రెండు రాజ్యాలకూ రాజయినతరువాత కులోత్తుంగచోడుడనే పేరు పెట్టుకొన్నాడు. ఇతనిని, ఇతని సంతతివారిని చరిత్రకారులు చాళుక్య-చోళులు అంటారు. ఉభయరాజ్యాలకూ రాజయినతరువాత కులోత్తుంగచోడ చక్రవర్తి తన రాజధానిని వేగీదేశాన్నుంచి అరవదేశానికి మార్చివేశాడు. ఇతని సంతతివారికి ఇక అరవదేశమే నివాసమయినది. వీరంతా అరవరాజులయి, అరవభాషను పోషించారు. తన అసలు రాజ్యము అంధ్రదేశాన్ని పాలించడానికి కులోత్తుంగచోడచక్రవర్తి తన కొడుకులను తనప్రతినిధులుగా పంపేవాడు. ఈవిధముగా అంధ్రదేశానికి రాజకీయ ప్రాముఖ్యం పోయింది. అది సామంతరాజ్యస్థితికి వచ్చింది.

వేంగిదేశములో చాళుక్యచోళప్రతినిధుల రాజధాని జననాథపురము, అంటే తూర్పుగోదావరిజిల్లాలోని కాకినాడ దగ్గర ఇప్పటి దాక్షారామము. రాజకుమారులను ద్రావిడబ్రాహ్మణులూ, ఇతరులూ ఆశ్రయించుకొని ఎందరో ఉండేవారు. వారు అందరు ఆరాజకుమారులతో వేగిదేశానికి వచ్చి వారి ప్రాపకంవల్ల అగ్రహారాలు సంపాదించారు. ఈవిధముగా ద్రావిడబ్రాహ్మణులు అనేకులు ఈకాలములో వచ్చి ఆంధ్రదేశములో కాపురం ఏర్పరచుకొన్నారు. మనదేశంలోని ఆరామద్రావిడులు, పేరూరు ద్రావిడులు అనేకులు ఈకాలములో వచ్చినవారే. ఈకాలములో వేగిదేశములోని పెద్ద సైన్యాధిపతులు, పెద్దఉద్యోగులు ముఖ్యులు అందరూ అరవలే. కులోత్తుంగచోడమహారాజు రాజ్యకాలములో అరవసంసర్గం ఆంధ్రదేశానికి బాగా తగిలింది.

చోళ చాళుక్య మహారాజ్యానికి పొరుగున ఉన్నది కన్నడమహారాజ్యము. దానికి ఈకాలములో అధిపతి పశ్చిమచాళుక్యవంశజుడు త్రిభువనమల్ల విక్రమాదిత్యమహారాజు. ఇతడూ కులోత్తుంగచోడమహారాజూ శత్రువులు; ఒకరిమీద ఒకరు కత్తులుదూసుకొంటూ ఉండేవారు. విక్రమాదిత్యమహారాజు వేగిదేశాన్ని వశం చేసుకోవాలని గట్టి ప్రయత్నాలు చేశాడు. తెలంగానా అతనిరాజ్యంలోనిదే. అందువల్ల పొరుగున ఉన్న వేగిదేశంమీదికి దండెత్తిరావడం, మరీ తేలిక అయినది. ఈకష్టకాలములో

తనకొడుకులకు బాసటగా ఉంటారని కులోత్తుంగచోడ మహారాజు తమ చాళుక్యవంశాన్ని పూర్వకాలంనుంచీ విశ్వాసముతో కొలిచిన భృత్యవంశాలకు రాజలాంఛనాలు ఇచ్చి వారిని మండలేశ్వరులను చేశాడు. మండలేశ్వరులు అంటే చాళుక్యచోడమహారాజులకు సామంతులై ఆంధ్ర దేశములోని వేరు వేరు మండలాలు పాలించిన దొరలు. పూర్వాంధ్ర దేశచరిత్రలో ఈ కాలము మండలికయుగం. ఈ మండలికవంశాలలో మొదట ప్రభుత్వం చేసినదీ, అమితప్రతాపముతో ఇంచుమించుగా పూర్వాంధ్ర దేశాన్ని అంతను పాలించినదీ వెలనాటివంశం.

ఇప్పటి జిల్లావంటి, తాలూకావంటి దేశవిభాగాన్ని నాడు అంటారు. వెలనాడు, వేగినాడు, పాకనాడు అని పూర్వము మన దేశములో చాలా నాడులు ఉండేవి. గుంటూరుజిల్లాలో కృష్ణానదికి దక్షిణపు ఒడ్డునే సముద్రం దాకా వ్యాపించిన దేశానికి వెలనాడు అంటారు. గుండ్లకమ్మ నదికీ, పెన్నానదికీ మధ్య సముద్రతీరాన ఉన్న దేశము పాకనాడు. వెలనాటి రాజులు దుర్జయవంశంవారు. వీరికి ధనదప్రోలు, అంటే గుంటూరు జిల్లాలోని చందవోలు రాజధాని. వెలనాటి దుర్జయులలో రాచరికంచేసిన మొదటి మండలేశ్వరుడు గొంకరాజు. మొదట ఇతడు కులోత్తుంగ చోడమహారాజు సేనాధిపతి; తరువాత మండలేశ్వరుడయి నాడు. ఇతని కొడుకు వెలనాటిచోడరాజు.

కులోత్తుంగ చోడమహారాజు రాజ్యకాలములో వేంగీ రాజ్యాన్ని పాలించిన అతని చివరి కొడుకు విక్రమచోళ రాజకుమారుడు. ఇతడు పెద్దకొడుకు కాదు; కాకపోయినా కులోత్తుంగ చోడమహారాజు అతనిని తన రాజధానికి పిలిపించి క్రీ.శ. 1118 లో అతనికి యౌవరాజ్యపట్టం కట్టినాడు. కట్టిన రెండేళ్లకే ఆ మహారాజు చనిపోయినాడు. అటు తరువాత మహారాజు విక్రమచోళుడే. ఇప్పుడు సందు దొరికింది వేంగీరాజ్యం వశపరచుకోడానికి విక్రమాదిత్య మహారాజుకు. అతని కొలువులో భీష్మద్రోణులవంటి శౌర్యపరాక్రమాలుగల ప్రచండ దండనాయకులు ఎందరో ఉండేవారు. అటువంటివారిలో అనంతపాలయ్య, గోవిందరసయ్యలు ముఖ్యులు. కన్నడసేనలు కూర్చుకొని అనంతపాలయ్య వేగి దేశంమీదికి దండెత్తివచ్చాడు. విక్రమచోళమహారాజుకు ద్రావిడదేశంలోని రాజ్యవ్యవహారాలతోనే సరిపోయింది. అయినా తన వెలనాటి సామంతులకు సహాయముగా సేనలు పంపినాడు; కాని కార్యము లేకపోయింది. అనంతపాలయ్య పరాక్రమధాటికి ఎవరూ ఎదురు నిలువలేకపోయినారు. విజయవాడ, చందవోలు, జననాథపురము, చేబ్రోలు మొదలైన కోటలు అన్నీ పెద్ద గాలివానకు చెట్లు కూలినట్లు కూలిపోయినవి. ఆంధ్రదేశములో పశ్చిమచాళుక్యరాజుల కన్నడబావుటా ఎగిరింది. దేశము అంతటా కన్నడులైన పశ్చిమ చాళుక్యులదే అధికారము. ఆంధ్రమండలికులు అందరూ కన్నడరాజ సామంతు లయి

నారు. పెద్ద అధికారులు, మహాసేనాధిపతులు అందరూ కన్నడులే. ఆంధ్రదేశానికి కన్నడదేశముతో సంసర్గము హెచ్చింది. ఈ విధముగా ఆంధ్రదేశము క్రీ. శ. 1126 లో విక్రమాదిత్య మహారాజు చనిపోయేవరకు అతనికి లోబడే వున్నది.

విక్రమాదిత్యుని అనంతరం అతని కొడుకు భూలోకమల్ల సోమేశ్వరుడు కన్నడ మహారాజ్యానికి అధిపతి అయి నాడు. తండ్రి గతించి ఇతడు రాజ్యానికి వచ్చిన మధ్య కాలములో విక్రమచోళమహారాజూ, ఇతని సామంతులు వెలనాటి చోడరాజూ, అతని కొడుకు గొంకరాజూ వేగి రాజ్యం మరల వశపరుచుకోవాలని గట్టి ప్రయత్నం చేశారు; కాని వారి ప్రయత్నం పూర్తిగా ఫలించలేదు. భూలోకమల్ల సోమేశ్వరరాజు అధికారము వేగిదేశంమీద ఇంచుమించుగా అయిదారేండ్లదాకా చెల్లింది.

వెలనాటి చోడరాజు కొడుకు రెండవ గొంకరాజు మహావీరాధివీరుడు. చివరికి ఇతడు కన్నడులమీద తిరుగ బాటుచేసి గోదావరీతీరాన జరిగిన మహాయుద్ధములో పశ్చిమచాళుక్య సేనానాయకులను ఓడించి తరిమివేశాడు; వేంగీరాజ్యము స్వాధీనపరుచుకొని మరల దానిని తన ప్రభువులు చాళుక్యచోళ మహారాజులకు సమర్పించాడు. ఇతని కాలములో వెలనాటి దుర్జయుల రాజ్యము ఉత్తరాన మహేంద్రగిరి మొదలుకొని దక్షిణాన పాకనాటిదాకా వ్యాపించినది. ఇతనితరువాత ఇతని కొడుకు రెండవ చోడ

రాజు క్రీ. శ. 1163-64 నుంచి 1181-82 దాకా రాజ్యం చేశాడు. ఇతడు చాళుక్యచోళచక్రవర్తి రెండవ రాజరాజ భూపతికి సామంతుడు. వెలనాటి దుర్జయుల రాజ్యవైభవం ఇతనితో నే సరి. ఇతని మనుమడు పృథ్వీశ్వరరాజు. వెలనాటి వారిలో స్వతంత్రముగా రాజ్యం చేసిన చివరిరాజు ఇతడే.

వెలనాటి రెండవచోడరాజు పరిపాలన చివరికాలములో దేశములో అరాజకం ప్రబలింది. పరాక్రమశాలి అయిన చాళుక్యచోళచక్రవర్తి రెండవరాజరాజు క్రీ. శ. 1172 లో గతించాడు. అంతటితో వెలనాటివారు స్వతంత్రులైనారు. ఇంతేకాదు వారికి అంతవరకు లొంగివున్న ఇతర ఆంధ్రమండలేశ్వరులు కూడా స్వతంత్రులై తమ రాజ్యాలు పాలించారు. వీరు ఒకరా ఇద్దరా - అనేకులు. గుడిమెట్ట, విజయవాడ రాజధానులుగా చాగివారు, ధాన్యకటకము అనే ధరణికోట రాజధానిగా కోటవారు, కోనదేశమును హైహయవంశంవారు, కొణిదెన నెల్లూరు పొత్తపి రాజధానులుగా తెలుగు చోళరాజులు, కొలనివీడు అంటే కొల్లేరుకోట రాజధానిగా తెలుగునాయకులు, కొండవీటికి పడమట ఉన్న కొండపడమటిదేశాన్ని కమ్మనాయకులు, పల్నాటిసీమను హైహయవంశంవారు (నలగామరాజాదులు) ఎందరో ఉన్నారు. వీరందరినీ జయించి మరల ఆంధ్ర దేశాన్ని తమ అధికారంక్రిందికి తీసుకురావాలని చాళుక్య చోళ చక్రవర్తులు ఒక రిద్దరు ప్రయత్నించారు కాని కార్యం లేకపోయింది. ఈమండలేశ్వరులు ఒకరితో ఒకరు

పోరాడుతూ ఉండేవారు. దేశం ఈ విధమైన స్థితిలో ఉండగా ఈ పూర్వాంధ్ర దేశంమీదికి దండెత్తివచ్చాడు కాకతివంశపు గణపతిదేవ మహారాజు - ఓరుగంటినుంచి. ఆ మహారాజు దండయాత్రతో ఆంధ్రమండలికుల స్వతంత్ర పరిపాలన అంతరించింది. వెలనాటి పృథ్వీశ్వరరాజు సంతతి వారు కొందరు ఉన్నా వారు కాకతివంశపురాజులకు సేవకులయినారు.

ఈ మండలేశ్వరులు ఏలినకాలం ఆంధ్రదేశచరిత్రలో చాలా **ముఖ్య**మైనది. దేశములో ఎన్నో మార్పులు వచ్చినవి. అన్నిటిలోను ప్రధానమైనది మతానికి సంబంధించిన మార్పు. యజ్ఞయాగాల కాలం వెనుకపట్టింది; అంటే యజ్ఞ యాగాలు చేసేవారు లేనేలేరని కాదు; కాని ప్రజలకు వాటిమీద ఆదరం తగ్గింది. పూర్వచాళుక్యుల రాజ్యకాలం నుంచీ శైవ, వైష్ణవ సంప్రదాయాలనే జనులు ఎక్కువగా ఆదరిస్తూవచ్చారు. ఈ మండలికయుగములో ఆంధ్రదేశములో ఎక్కువగా వ్యాపించిన మతం శైవము. కులోత్తుంగచోడమహారాజు శైవుడు. అతని సంతతివారూ శైవులే. వెలనాటి నాయకులూ శైవులే. కులోత్తుంగచోడ మహారాజుకాలములో శ్రీరామానుజాచార్యులవారు వైష్ణవ మతానికి వేదమత ప్రతిపత్తి ఇచ్చి దానిని సంస్కరించారు. ఈయన సంస్కరించిన వైష్ణవాన్ని శ్రీవైష్ణవం అంటారు. మహారాజు శైవుడయి హింసించినందువల్ల శ్రీరామానుజాచార్యులవారు కులోత్తుంగచోడమహారాజు రాజ్యం విడిచి


పెట్టి ఇతర రాజ్యాలకు పారిపోయినారు. ఆంధ్రదేశములో శ్రీవైష్ణవం బాగా వ్యాపించుటకు ఇంకా చాల కాలం పట్టింది.

శైవ, వైష్ణవ సంప్రదాయాలు పాదుకొన్న ఈ కాలములో దేవాలయానికి ప్రాముఖ్యం కలిగింది. దేవాలయ నిర్మాణం ఒక శాస్త్రముగా ఒక కళగా వృద్ధిపొందింది. మన దేశంలోని మొట్టమొదటి దేవాలయాలు చిన్నవి. అవి వేంగీ చాళుక్యరాజులనాటివి. రానురాను ఈ మండలేశ్వరుల కాలంనాటికి ఎన్నో మండపాలతో దేవాలయం పెరిగిపోయింది. విమానాలు, గోపురాలు, మండపాలు కట్టడములో ఆనాటి పనివారు గొప్ప నేర్పు చూపినారు. ఆవిమానాలమీదా, మండపాలలోనూ నాటి శిల్పులు చక్కని బొమ్మలు మలిచేవారు. బ్రాహ్మణ బాలకులకు ఈ దేవాలయాలలో వేదములు, శాస్త్రములు మొదలైన వేదవిద్యలు నేర్పేవారు. నటశేఖరులు శివాలయాలలో శివలీలలు, విష్ణ్వాలయాలలో విష్ణులీలలు గజ్జె కట్టి ఆడి పాడి అభినయించేవారు. సంగీతకళకు నాట్యకళకు చాలా ఆదరము, ప్రోత్సాహము కలిగిన కాల మిది.

దేశములో శైవ, వైష్ణవ మతాలు వ్యాపించడంతోను, దేవాలయానికి ఆధిక్యత కలగడంతోను జనసామాన్యములో ఒక కొత్త ఉత్సాహమూ, ఒక కొత్త ప్రబోధమూ కలిగింది. దేశము మేల్కొన్నది. దేవుడిదగ్గర ఎప్పుడూ వెలిగేటందుకు నేతితో అఖండ దీపం పెట్టడం

పుణ్యకార్య మయినది. క్రమముగా దేవుడి అంగభోగాలకు రంగభోగాలకుకూడా సమర్థతగలవారు భూములు మాన్య ముగా ఇచ్చేవారు. ఈమాన్యాలు అనుభవిస్తూ దేవుడికి పరిచర్య చేసేవారి సంఖ్య పెద్దదేవాలయాలలో క్రమముగా పెరిగిపోయింది.

ఆంధ్రభాష ఈమండలిక యుగములో పెంపొందింది. కాని ఒక విషయం. ఏకారణంచేతనో నన్నయభట్టుగారు వ్రాసిన మహాభారతము పూర్తి కానేలేదు. చాళుక్యచోళ మహారాజులకు తెలుగంటే అభిమానము లేక పోయినా వారి సామంతులు మండలేశ్వరులు అందరూ తెలుగు కవులను ఆదరించి పోషించారు. కాని చిత్ర మేమంటే ఆనాటి పుస్తకాలు ఏవీ ఇంతవరకు దొరకలేదు. అయినా ఈ మండలేశ్వరులు ఆయాదేవాలయాలకు చేసిన దానాలు వర్ణించే శాసనాలు చాలావరకు చక్కని పద్యకావ్యాలే. ఈ విధముగా వెలనాటి దుర్జయుల కాలము మన చరిత్రలో చాలా ముఖ్యమైనది.



నాట్యవిన్యాసం : శ్రీశైలంలోని శిల్పం

## ఏడవ ప్రసంగము

### కాకతీయ యుగము

కాకతి వంశంవారిని కాకతీయు లంటారు. వీరి మూలపురుషుడు బేతరాజు. మనకు ఇంతవరకు తెలిసిన మొదటి కాకతిరాజు ఇతడే. కాకతీయులు మొదట పశ్చిమ చాళుక్య మహారాజులకు సామంతులుగా ఉండేవారు. కాకతి బేతరాజు, అతని కొడుకు ప్రోలరాజుకూడా పశ్చిమ చాళుక్య మహారాజులకు, వారి శత్రువులయిన చోళ, చాళుక్యచోళ మహారాజులకు జరిగిన యుద్ధాలలో తమ ప్రభువులపక్షాన పోరాడి వారి మెప్పు పొందినారు. వారు చేసిన సేవకు సంతోషించి పశ్చిమచాళుక్య మొదటి సోమేశ్వరమహారాజు కాకతి ప్రోలరాజునకు అనుమకొండ దేశం ఇచ్చాడు. అప్పటి నుంచీ పశ్చిమచాళుక్య సామంతులై కాకతి ప్రోలరాజూ అతని సంతతివారూ అనుమకొండదేశం పాలిస్తూవచ్చారు. ఈ విధముగా కాకతిరాజ్యం ఆరంభమయినది. అనుమకొండ తెలంగానాలోని ఓరంగల్లుకు పొరుగున ఉన్నది. ఈ రెండు గ్రామాలూ ఇంచుమించుగా కలిసేవున్నవి. కాకతి ప్రోలరాజు, ఇతని కొడుకు రెండవ బేతరాజు, మనమడు రెండవ ప్రోలరాజు - అందరున్నూ పశ్చిమచాళుక్య సామంతులే. వీ రందరికి అనుమకొండనగరమే రాజధాని.

సోమేశ్వరమహారాజు కొడుకు త్రిభువనమల్ల విక్రమాదిత్య మహారాజుకాలంనాటి వేగిదండయాత్రలలో కాకతి


రాజులుకూడా పాల్గొన్నారు. అప్పటినుంచి వుండేది వారికి వేగి దేశాన్ని వశం చేసుకోవాలని. కాని వారు అస్వతంత్రులు. ఏమి చేస్తారు ? కాకతి రెండవ బేతరాజు స్వతంత్రు డవ డానికి కొంత ప్రయత్నం చేసినట్టు కనిపిస్తుంది; కాని ఆ ప్రయత్నములో చావు తప్పి కన్ను లొట్టపోయినంతపని అయింది. రాజ్యం నిలుపుకోడమే చివరికి దుర్ఘటమయింది. ఇంకా కొంతకాలం వారికి చాళుక్యదాస్యం తప్పలేదు. క్రీ. శ. 1126 లో విక్రమాదిత్యమహారాజు కాలంచేశాడు. తరువాత సింహాసన మెక్కిన అతని కొడుకు భువనైకమల్ల సోమేశ్వరమహారాజు గొప్ప విద్వాంసుడు, కాని తండ్రంత పరాక్రమశాలి కాడు. మీకు తెలుసుకాదూ వేంగీరాజ్యం పశ్చిమచాళుక్యుల చేతిలోనుంచి జారిపోయింది ఇతని కాలం లోనే అని. వేంగీరాజ్యం పోయిన కొద్ది కాలానికే కాకతి రెండవ ప్రోలరాజు పశ్చిమచాళుక్య సేనాపతులను ఓడించి స్వతంత్రు డయినాడు. ఇతడున్ను, ఇతనికొడుకు రుద్రదేవ రాజున్ను యుద్ధ విద్యలో ఆరితేరినవారు. వారు ఇరుగు పొరుగు రాజు లందరినీ జయించి వారిని తమకు సామంతులు చేసుకొన్నారు; తమ రాజ్యం బలపరుచుకొని దానికి గట్టి పునాదులు వేశారు; దక్కను తూర్పుభాగం తెలంగానా అంతా ఆక్రమించుకొన్నారు. భువనైకమల్ల సోమేశ్వరుడికి తరువాత రాజ్యానికి వచ్చినవారు మరీ బలహీనులు. అందు వల్ల కాకతి రాజ్యానికి ముప్పు లేకపోయింది.

పశ్చిమ చాళుక్యాధికారం గాలిలో పెట్టిన కర్పూరం

లాగ హరించిపోయింది. కాకతిరాజ్యం బలపడింది. కన్నడ మహారాజ్యములో వేరు వేరు ప్రాంతాల కాకతిరాజ్యం లాగే వేరు వేరు స్వతంత్రరాజ్యాలు ఏర్పడినవి. వీటిలో ముఖ్యమైనవి రెండు: (1) దక్కను పశ్చిమభాగంలోని యాదవరాజ్యము. దీనికి హైదరాబాదు సంస్థానములోని ఇప్పటి దేవగిరి రాజధానిగా ఉండేది; (2) దక్షిణ కన్నడదేశంలోని హొయిసలరాజ్యము. దీనికి మైసూరు రాజ్యంలోని ద్వారసముద్రము రాజధాని. వీరు ఎవరికి వారే తమ రాజ్యం విస్తరింపజేసుకోవాలని ప్రయత్నిస్తూవచ్చారు. ఇట్టి ప్రయత్నములో దేవగిరి యాదవులకు కాకతీయులకు, యాదవులకు హొయిసలులకు, హొయిసలరాజులకు కాకతీయులకు తరుచు యుద్ధాలు జరుగుతూవచ్చినవి. యాదవ రాజులతో జరిగిన ఇటువంటి యుద్ధాలలోనే కాకతి రుద్రదేవరాజు చనిపోయినట్టు తెలుస్తున్నది.

రుద్రదేవరాజు సోదరుడు మహాదేవరాజు. ఇతని కొడుకు గణపతిదేవమహారాజు. ఇతడు క్రీ. శ. 1199లో రాజ్యానికి వచ్చాడు; రాజధానిని అనుమకొండనుంచి వరంగల్లుకు మార్చినాడు. వరంగల్లుకే ఓరుగల్లని, ఏకశిలానగర మని పేరు. గణపతిదేవమహారాజు వరంగల్లులో గొప్పకోట నిర్మించినాడు. ఇతను రాజ్యానికి వచ్చినకాలంలోనే మహమ్మదుఘోరీ ఉత్తరహిందూస్తానములో ఢిల్లీ, కన్నోజ, కాశీ, గ్వాలియరు మొదలైనరాజ్యాలు జయించి తురకరాజ్యం స్థాపించాడు. ఈముస్లిము సుల్తానులకు ఢిల్లీ

రాజధాని. ముస్లిములు ఎప్పటికైనా దక్కను దేశంమీదికి దండెత్తిరాకపోరనే నమ్మకముతోనేమో గణపతి దేవమహారాజు తెలుగు మాటాడే ఆంధ్రుల నందరినీ ఒక్క రాజ్యంలోనికి తీసుకురావాలని మొదటిసారి ప్రయత్నించాడు. ఈ మహారాజుకు సమకాలికుడు తిక్కనసోమయాజి. ఈయన మహాకవి; నెల్లూరు పాలించిన తెలుగుచోళరాజు మనుమసిద్ధి ఆస్థానములో ఉండి, విరాటపర్వం దగ్గరనుంచి సంస్కృత మహాభారతం పదిహేను పర్వాలున్ను తెలుగుచేసి మన దేశములో వేదమతధర్మానికి గట్టి వి త్తనం వేశాడు. మనది ఆంధ్రదేశం, మనం ఆంధ్రులం అనే జాతీయాభిమానం మొదటిసారి మనకు ఈకాలంలోనే కలిగింది. దేశములో క్రొత్త ఉత్సాహం ప్రబలింది. గణపతి దేవమహారాజు సర్వవిధాలా సమర్థుడు; శౌర్యపరాక్రమాలు గలవాడు. ఇక లోటేమిటి? ఆనాడు మనకత్తికి పదును వచ్చింది. మన ప్రతాపమనే గుఱ్ఱానికి పట్టపగ్గాలు లేకపోయినవి. గణపతి దేవమహారాజు ఉత్తరాన కళింగము జయించాడు; దక్షిణాన చెంగల్పట్టుజిల్లాలోని కాంచీపురాన్నికూడా వశపరుచుకొన్నాడు. కంచిలో కాకతీయ మహారాజులకు ప్రతినిధిగా తెలుగుబిడ్డ రాజ్యంచేశాడు. మన ఆంధ్రదేశం ఇంచుమించుగా అంతా ఓరుగంటి కాకతీయుల అధికారంలోనికి వచ్చింది. గణపతిదేవమహారాజు ఆంధ్రచక్రవర్తి. ఆ మహారాజు రాజధాని ఓరుగల్లు ఆంధ్రనగరం. గణపతి దేవ




కాకతీయులనాటి ఆంధ్రదేశము

మహారాజు అరవై రెండు సంవత్సరాలు పాలించి శివలోకానికి వెళ్లినాడు.

గణపతి దేవునికి కొడుకులు లేరు; రుద్రమ దేవి అనే ఒకటే కూతురు. ఆవిడకు గుర్రపు స్వారి, కత్తిసాము, విలువిద్య, ఇతరవిద్యలు నేర్పి కొడుకులాగ పెంచాడు; రాజ్యతంత్రములో తరిఫీదు చేశాడు; రుద్రమ దేవికి తన అనంతరం రాజ్యానికి పట్టం కట్టవలసిందని తన మంత్రులకు శాసించాడు గణపతి దేవమహారాజు. రుద్రమ దేవి కాకతీయ సామ్రాజ్యానికి రాణి అయింది. ఆడదానికి లోబడివుండడమూ, ఆడదాని పాదాలకు మ్రొక్కడమూ మూతిమీద మీసం గల వీరసామంతులకు అవమాన మనిపించింది. వారిలో కొందరు రాణిమీద తిరుగబాటుచేశారు. ఇదే

సందని దేవగిరి యాదవనృపతి మహాదేవరాజుకూడా కత్తి దూసి కాకతిరాజ్యంమీదికి దండెత్తివచ్చాడు. అయితే విశ్వాసపాత్రులైన కొందరు సామంతుల, మంత్రుల సాయముతో రుద్రమదేవి శత్రువులను జయించింది. సాయంచేసిన సామంతులలో పిల్లలమర్రి రేచెర్లగోత్రులయిన పద్మవెలమ నాయకులు ముఖ్యులు. రాణి రుద్రమదేవికి ఎదుర్కొడ్డి నిలవలేక మహాదేవరాజు కాలికి బుద్ధి చెప్పాడు. తిరుగుబాట్లు అన్నీ అణగిపోయినవి. రుద్రమదేవి జనరంజకముగా రాజ్యం పాలించింది; తన సామంతులలో వేంగీ చాళుక్య వంశజుడు వీరభద్రరాజును పెండ్లాడింది. ఆమెకు ఇద్దరు కూతుళ్లు. వీరిలో ఒకరి కొడుకు ప్రతాపరుద్రదేవమహారాజు.

రుద్రమదేవి తన మనమడు ప్రతాపరుద్రదేవుని పెంచుకొని కాకతీయసామ్రాజ్యానికి పట్టం కట్టింది. కాకతీయ మహారాజులందరిలో ఇతడు చాలా పరాక్రమవంతుడు. ఇతనికాలములో మన తెలుగు సేనలు కంచినే కాదు, దానికింకా దక్షిణముగా వున్న తిరుచునాపల్లిదాకా గల దేశాన్ని జయించినవి. వీరరుద్రుడనే ఈప్రతాపరుద్రదేవచక్రవర్తి రాజ్యకాలంలోనే ఢిల్లీసుల్తానులు దక్కను దేశంమీదికి చాలా సారులు దండెత్తివచ్చారు; ఓరుగంటిని ముట్టడించారు. ఎన్నో తడవలు వారిని ఓడించి తరుమగొట్టినా చివరికి దైవబలం చాలక ప్రతాపరుద్రదేవమహారాజు క్రీ.శ. 1323 లో తురకలతో చేసిన యుద్ధములో శత్రువుకు పట్టుపడినాడు.

తురకసర్దారులు అతన్ని ఢిల్లీకి ఖైదీగా తీసుకుపోతూవుంటే ఆ మహావమానం భరించలేక ఆమహారాజు నర్మదా నదీ తీరాన్ని ఎట్లాగో ఆత్మహత్య చేసుకొని ప్రాణాలు వదలినాడు. ఓరుగల్లుకోట తురకల వశమయింది. దానితో ఆంధ్రదేశ మంతా ఢిల్లీసుల్తానుల పరిపాలనక్రిందికి వచ్చింది.

కాకతీయుల కాలములో శైవమతము మనదేశములో వెనుకటికంటెను ప్రబలింది. కాకతీయమహారాజు లందరూ పరమశైవులు. వారు శివాచార్యులవద్ద ఉపదేశమయినారు; తమ గురువులకు శివపురాలని పేరు పెట్టి గ్రామాలు దానం చేశారు. వారు శివాలయాలకు చేసిన దానాలకు లెక్క లేదు. ఈ కాలములో శివమఠాలు ఎన్నో వెలసినవి. శ్రీశైల క్షేత్రం ప్రభ వెనుకటికంటెను వెలిగిపోయింది. శ్రీశైలం మీద గొప్పవి అయిదు శివమఠాలు ఉండేవి. ఒక్కొక్క మఠానికి కొన్నేసి ఊళ్లూ, వేలకొలది శిష్యులూ ఉండేవారు. మఠం ఆకాలంలో ఒక చిన్న సంస్థానమే. ఆకాలపు మఠాలలో ప్రసిద్ధికెక్కినది గోళకి అనే శైవమఠం. దీనికి త్రిపురాంతకంలోను, పుష్పగిరిలోను, ఇంకా ఇతరచోట్లను శాఖలుండేవి. ఈ గోళకీమఠానికి సంబంధించిన గొప్ప యోగి విశ్వేశ్వరశివాచార్యులు. ఈ గోళకీమఠమువారంతా ఉత్తరాన గాడదేశాన్నుంచి వచ్చిన శివయోగులు. వీరితో పాటు అక్కడనుంచి ఎన్నో బ్రాహ్మణ కుటుంబాలూ, ఎన్నో కాయస్థ కుటుంబాలూ మనదేశానికి వచ్చినవి.

కాయస్థులనేవారు ఉత్తరదేశంలోని ఒకకులంవారు; లెక్క డొక్కలు వ్రాయడములో వీరు గట్టివారు. వీరిలో కొందరు కాలక్రమాన కాకతిరాజన్యుల ప్రాపకం పొంది రాజ్యం కూడా సంపాదించారు. వీరిని ఒడ్డెరాజు లంటారు. విశ్వే శ్వర శివాచార్యులవారికి రాణి రుద్రమదేవి తాను రాజ్యా నికి వచ్చిన రెండవయేట, అంటే క్రీ. శ. 1261 లో మం దారము, అంటే గుంటూరుజిల్లాలో కృష్ణాతీరాన్ని వున్న ఇప్పటి మందడము అనే గ్రామాన్ని అగ్రహారంచేసి యిచ్చింది. ఇక్కడ ఆ శివాచార్యులవారు గోళకీమఠం ఒకటి స్థాపించి, గుడి కట్టించి, వేదములు, శాస్త్రములు, సంగీతము మొదలైన కళలు నేర్పడానికి ఏర్పాటుచేశారు. ఈ మఠములో ప్రతిదినము సూర్యోదయం మొదలుకొని సూర్యాస్తమయందాకా పంచముడి దగ్గరనుంచి ఎవరు ఏవేళ వచ్చినా నిరతాన్నప్రదానం జరుగుతూ వుండేదట. ఇంతే కాదు. శివాచార్యులవారిక్కడ ఒక పురుళ్ల ఆస్పత్రి కూడా పెట్టారట. ఇప్పటికి రమారమి ఏడువందల సంవత్స రాలక్రిందట ఆంధ్రదేశంలో కాకతీయుల పరిపాలనకాల ములో కృష్ణానదీతీరాన స్త్రీలకోసం ప్రత్యేకముగా ప్రసూ త్యారోగ్యశాల (పురుళ్ల ఆస్పత్రి) ఉండేదంటే విచిత్రం కాదూ? ఈ మఠాలను కాపాడేవారు, శివాలయాలలో పరిచర్య చేసేవారు అందరూ శివభక్తులే. శివద్రవ్యాన్ని తమ ప్రాణం బలిపెట్టి అయినా కాపాడే ఈశివభక్తులను వీరభద్రులనీ, మైలారువీరభటులనీ అంటారు.

ఈకాలములో దానాలు, వ్రతాలు బాగా పెరిగి పోయినవి. వీటిని అన్నిటినీ క్రోడీకరించి వాటిని ఆచరింపవలసిన పద్ధతులను దేవగిరి యాదవరాజుల కొలువులో ఉండే హేమాద్రిపంత్ అనే విద్వాంసుడు తన చతుర్వర్గ చింతామణి అనే గ్రంథములో వివరించాడు. దానఖండము, వ్రతఖండము అనేవి ఈగ్రంథంలోని భాగాలు. హేమాద్రి వ్రాసిన ఈగ్రంథం అచిరకాలంలోనే మనదేశములో జనాదరం బాగా సంపాదించింది; అది బాగా వ్యాప్తిలోనికి వచ్చింది. ఈ విధంగానే బాగా వ్యాప్తిలోనికి వచ్చిన మరొకగ్రంథం అభిలషితార్థచింతామణి. దీనిని వ్రాసినవాడు పశ్చిమచాళుక్యవంశజుడైన భువనైకమల్ల సోమేశ్వరమహారాజు. ఇతను చాలా గొప్ప విద్వాంసుడు. ఈ గ్రంథం ఎంత గొప్పదంటే అనేక విజ్ఞాన సర్వస్వమే–ఇది ఉందీ ఇది లేదూ అనకుండా దానిలో అన్ని విషయాలూ ఉన్నవి. అంతటి గొప్ప గ్రంథం వ్రాశాడు గనుకనే అతనికి సర్వజ్ఞ సోమేశ్వరుడు అని బిరుదు వచ్చింది. ఈ సోమేశ్వరమహారాజు విద్యాపోషకుడు, కళాపోషకుడు కూడాను. కన్నడదేశములో ఆకాలములో ప్రజాసామాన్యములో వాడుకలో ఉన్న చిందు మొదలైన నాట్యరీతులు మన తెలుగు దేశంలోనికికూడా వచ్చినవి. కన్నడ దేశముతో మనకు కలిగిన సంసర్గంవల్ల సంగీతకళ, నాట్యకళలు మన దేశములో బాగా వృద్ధి పొందినవి. మనదేశములో ఈనాట్య కళలోనట, అఖండ పాండిత్యము సంపాదించాడు

కాకతి గణపతిదేవమహారాజు గజసైన్యానికి అధిపతి జాయప్ప. ఇతనిది గుంటూరు జిల్లాలోని చేబ్రోలు. కాకతీయులకాలములో నాట్యం చేయడములో అతనంతటివాడు మరొకడు లేడు. జాయప్ప నాట్యం చేయడమే కాదు; సంస్కృతంలో నృత్తరత్నావళి అని ఒక నాట్యశాస్త్రమే వ్రాశాడు. ఇతడు చతుర్థకులజుడు. సంస్కృతం నేర్చుకొని దానిలో నాట్యాన్నిగురించి ఆ కాలంలో ఒక శాస్త్రమే వ్రాశాడంటే అతడు ఎంతటి ప్రజ్ఞావంతుడో! నాట్యకళతో పాటు కాకతీయులకాలంలో శిల్పకళకూడా వర్థిల్లింది; మన తెలుగు శిల్పకళాసంప్రదాయానికి కొత్త వెలుగు వచ్చింది.

కళలతోపాటు తెలుగు కవిత్వంకూడా కొత్తదనం సేకరించుకొని ముందడుగు వేసింది. ఈ కాలములో తిక్కన సోమయాజిగారు ఆంధ్రమహాభారత మంతా - అరణ్యపర్వ శేషం మినహాగా - పూర్తిచేశారని ఇంతకు పూర్వం చెప్పాను కాదూ? ఆయన శిష్యుడు మూలఘటిక కేతన్నగారు దశకుమారచరిత్ర అనే కథల పుస్తకం పద్యకావ్యముగా వ్రాశారు; ఆంధ్రభాషాభూషణం అనే తెలుగు వ్యాకరణము, విజ్ఞానేశ్వరీయం అనే ధర్మశాస్త్రగ్రంథము కూడా పద్యాలలోనే వ్రాశారు. భారతం తెలుగులోనికి వచ్చిన తరువాతనుంచి ఇక సంస్కృత గ్రంథాలు, ముఖ్యముగా పురాణాలు తెలిగించాలనే కుతూహలం దేశములో ప్రబలింది. మారన్న అనే కవి మార్కండేయపురాణం తెనిగించి కాకతిగణపతిదేవమహారాజు కటకరక్షపాలకుడయిన

గన్నమనేడు అనే వానికి అంకిత మిచ్చాడు. శివకవులు తమ గ్రంథాలు ద్విపదలలో వ్రాసి తెలుగుకవిత్వములో కొత్త సంప్రదాయాలు వెలయించారు. ఈ కాలపు శివకవులలో పేరెన్నికగన్న ఆయన పాల్కురికి సోమన్నగారు: సోమనాథయ్య అనికూడా ఈయనకు పేరు. ఈయన బసవపురాణము, పండితారాధ్యచరిత్ర అని తెలుగున రెండు ద్విపద కావ్యాలు వ్రాశాడు. ఈ కాలములో ఇంకా ఎందరో కవు లున్నట్లు తెలుస్తుంది కాని వారు వ్రాసిన గ్రంథాలు కనబడవు.

మన ప్రాచీన వర్తక వ్యాపారాన్నిగురించి వచ్చేసారి చెపుతాను.

## ఎనిమిదవ ప్రసంగము

### మన వర్తక వ్యాపారము

ప్రాచీనకాలంనుంచి ఇప్పటికి రమారమి రెండువందల సంవత్సరాలక్రిందటిదాకా మన ఆంధ్రదేశ వర్తక వ్యాపారం సాగించేటటువంటి వర్తకులకు చిత్రమైన పేరులు ఉండేవి. ఈ వర్తకులను దేశి, పరదేశి, నానాదేశి అనే వారు. దేశివర్తకులు మనదేశంవారు. హిందూదేశము లోని ఇతరదేశాలనుంచీ పరదేశాలనుంచీ వచ్చేవర్తకులను పరదేశి, నానాదేశి అనేవారు. ఈవర్తక సమూహానికి అంతకు - వారు దేశీయులైనాసరే, పరదేశీయులైనాసరే - ఇంకొకపేరు ఉంది. అది ఏమిటంటే చాలుమూలసమస్త దేశాలపెక్కండ్రు. ఇవి మన పూర్వులు వ్యాపారంచేసే వర్తకులకు పెట్టినపేరులు. దేశి, పరదేశి వర్తకులు ఉభయు లను ఉభయదేశి అనికూడా వ్యవహరించేవారు. ఈ వర్త కులు నాటున దేశంలోను, సముద్రంమీద కూడా వ్యాపారం సాగించేవారు. ముందు నాటున సాగిస్తూవచ్చిన వ్యాపారాన్ని గురించి చెపుతాను.

పూర్వం మనదేశములో ఇప్పటిలాగ రోడ్లూ రహ దారులూ ఉండేవి కావు. దేశము అడవిబలిసి ఉండేది. అడవిదారులలోనూ, డొంకతోవలలోనూ ప్రయాణం చేయవలసివచ్చేది. దారులుకొట్టే దొంగలు ఎక్కువ. అడవి

జంతువుల ఉపద్రవం ఉండేది. ఈకారణంచేత వర్తకులు గుంపులు కట్టి వెళ్లేవారు. ఒక్కొక్క గుంపులో వందలకొద్దీ ఉండేవారు జనం. ఒక్కొక్క వర్తకుడు చాలా సరకులతో వ్యాపారం చేసేవాడు. ఈ కారణంచేత ఒక్కొక్క వర్తకునివద్ద వందమందీ, వందయేభై మందీ నౌకరులు ఉండేవారు. ఈ సరకులను సాధారణముగా ఎడ్లమీదా, గుర్రాలమీదా, గాడిదలమీదా తీసుకువెళ్లేవారు. ఒక పెద్దగోనె పట్టాను ఈచివరా ఆచివరా సంచులుగా కుట్టి, వాటినిండా ఉప్పు, ధాన్యము మొదలైన సరకులతో నింపి దానిని ఆ జంతువుల వీపుమీద కుడివైపు కొకసంచి, ఎడమ వైపు కొకసంచి ఉండేటట్టు అడ్డముగా వేసేవారు. దీనికి పెరికె అనిపేరు. ఈవిధముగా వ్యాపారం చేసేవారిని పెరికీలని, పెరికసెట్లని అనేవారు. ఒక వర్తకుల గుంపు బయలు దేరిందంటే దానిలో ఎంతోమంది వర్తకులు, వర్తకుల నౌకరులు, ఎన్నో రకాలసరకులు, ఆ సరకులు మోసే జంతువులు, దారిలో దొంగలు కాని అడవి జంతువులు కాని అడ్డగిస్తే తమ్ము తాము కాపాడుకోడానికి అవసరమైన ఆయుధాలు, దారి మకాములలో వంటచేసుకోడానికి అవసరమైన ఆహార సామగ్రి - ఒక టేమిటి, అదొకవర్తకపు సేన. ఈ విధమైన వ్యాపారుల సమూహానికి సాతు అని, బిడారు అని పేరు. దగ్గర ఊళ్లకు, దగ్గర సంత సావిళ్లకు సరకు బండిమీద వెళ్లేది. ఆత్మరక్షణకోసం పూర్వకాలములో దూర ప్రయాణాలకు, వర్తక వ్యాపారానికి ఇట్టి పరస్పర సహా

కారమూ, గుంపుగా ఏర్పడడమూ అవసరమయేది. జంతువుల మెడలలో గంటలు కట్టి వాటిని చిత్ర విచిత్రముగా అలంకరించేవారు.

ఇది ఇట్లా ఉండగా ఒక్కొక్క దినుసుతో వ్యాపారం చేసేవారు ఒక్కొక్క సంఘముగా ఏర్పడేవారని ఇదివరకు చెప్పితిని కాదూ? ఇట్టి సంఘాలను సంస్కృతములో శ్రేణులు అనేవారు. ఇట్టి వ్యాపారసంఘాలు సాతవాహనరాజుల కాలంనుంచీ చాలా ఉండేవి. ఇవి ఇప్పటి ట్రేడ్ యూనియనులవంటివి. కట్టుదిట్టమైన పద్ధతులతో వీటిని నడిపేవారు.

సాధారణముగా సరకు అమ్మకమూ కొనుగోలూ విశేషముగా పెద్ద పెద్ద సంతలలోను, తిరునాళ్లలోను, తీర్థములలోను జరిగేది. సంతకు అమ్మవచ్చే సరకుమీదా, సంతనుంచి వర్తకులు కొని తీసుకుపోయే సరకుమీదా పన్ను తీసేవారు. ఈ పన్నుకు సుంకము అని పేరు. ఈ పన్ను వసూలుచేసే ఉద్యోగులు సుంకరులు.

వ్యాపార ప్రయాణాలలో వర్తకులు గోదావరి, కృష్ణ, తుంగభద్రలవంటి నదులు దాటవలసివచ్చేది. వర్తకులు వీటిని ఒక రకం పడవలమీద దాటేవారు. ఈ పడవలు మనకు ఇప్పుడు పరిచయమైన కర్రపడవలూ కావు; స్టీమరులూ కావు. అవి గుండ్రనగా చెరకుపెనాలలాగ ఉండేవి. వాటిని పేముతో అల్లి వెలుపలివైపు దున్నపోతు చర్మముతోను, గేదెచర్మముతోను కప్పేవారు. ఈవిధమైన పడవకు

పుట్టి అనిపేరు. ఈ పుట్లు గుండ్రనగా తిరుగుతూ ఇవతలి ఒడ్డునుంచి అవతలి ఒడ్డుకు పోయేవి. రేవులలో ఇట్టి పుట్లు ఉండేవి. ఈ పుట్లమీద రేవు దాటే వర్తకపు సరకుమీద పుట్టి సుంకాలు వసూలు చేసేవారు. మన దేశంలోని నదులలోను చిన్న ఏళ్లలోను 1800 ల వరకు రేవులు దాటడానికి ఇవే పడవలు. కాకతి ప్రతాపరుద్రదేవమహారాజును ఢిల్లీకి తీసుకొనిపోయేటప్పుడు తురకసర్దారులు గోదావరి దాటించినది ఈరకము పడవలలోనే.

ఇక సముద్ర వ్యాపారాన్నిగురించి చెపుతాను. వెనుకటి ప్రసంగాలలో మీకు కొద్దిగా సూచించాను సాతవాహన, ఇక్ష్వాకు, చాళుక్య, కళింగ గాంగ రాజవంశాల వారి కాలములో మన దేశవర్తకులు సముద్రాలమీద సబురులు చేసి తూర్పుదేశాలతోను, ద్వీపాలతోను వర్తక వ్యాపారం చేసేవారని. హిందూదేశవర్తక వ్యాపారములో ఒక చిత్రం ఉంది. అది ఏమిటంటే, ప్రాచీనకాలంనుంచీ మనదేశము పడమటి దేశాలతో జరుపుతూవచ్చిన వ్యాపార మంతా పడమటిదేశ వర్తకులవశాన ఉండేది. వీరిలో మొదటివారు ఆఫ్రికాలోని ఈజిప్టుదేశంవారు, తరువాతివారు గ్రీకులు, తరువాతివారు అరబ్బులు. క్రీస్తుశకం పదకొండు, పన్నెండు శతాబ్దుల దాకా పడమటి దేశాలతోడి హిందూదేశ వ్యాపారమంతా అరబ్బుల వశంలోనే ఉండేది. తూర్పుదేశాలతోడి వ్యాపారమంతా హిందూదేశపు వర్తకుల వశాన ఉండేది. ప్రాచ్యదేశ

వర్తక వ్యాపారం సాగించిన మొదటి హిందూదేశీయులం మనమే – ఆంధ్రులమూ, కళింగులమూను. తరువాత ద్రావిడులు, అటువెనుక గుజరాతీలు, ఆపిదప బంగాళీలు మొదలైనవారు ఈవ్యాపారములో పాల్గొన్నారు. మనము ఈ వ్యాపారములో ముందడుగు వేయడానికి కారణం ఇది. మన అంధ్రదేశము చాలా భాగము సముద్రతీరాననే ఉంది. నదీతీరాన ఉన్నవారికి సాధారణముగా ఈత ఎట్లా వస్తుందో ఆవిధంగానే సముద్రపు ఒడ్డున నివసించేవారికి సముద్రం మీద సబురులు చేసే సాహసం సహజముగా అలవడుతుంది. సముద్రతీరవాసులు గొప్ప నావికులు అవుతారు.


మన దేశములో సముద్రపు ఒడ్డున ఎన్నో కరపట్టణాలు ఉండేవి. రేవు పట్టణాలను పూర్వం కరపట్టణా లనేవారని చెప్పితిని కాదూ? మన దేశముతో వర్తక వ్యాపారం సాగించిన పశ్చిమదేశాల నావికులూ, భూగోళశాస్త్రజ్ఞులూ ఇటువంటి కరపట్టణాలు మన దేశంలోనివి ఎన్నిటినో చెపుతారు. ఇట్టివారిలో పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సి అనే గ్రంథము వ్రాసినయతడు, ప్లీనీ, టాలెమీ అనేవారు ముఖ్యులు. వీరిలో కొందరు మన హిందూదేశముతో వర్తక వ్యాపారంచేసినవారు చెప్పిన విషయాలు విని వ్రాసినవారు. వీరు అరబ్బీ వ్యాపారులకంటె పూర్వులు. వీరు విదేశీయులు అవడంచేతను, మన దేశపు పేరుల ఉచ్చారణ వారికి వికృతముగా ఉండడంచేతను, వారికి ఈ పేరులలో తోచిన అర్థంచేతను అవి ఆ విదేశీయుల పలుకుబడిలో మారిపోయినవి.

V.R. NARLA MEMORIAL LIBRARY

అందువల్ల మన దేశంలోనివని వారు చెప్పిన కరపట్టణాలలో ఏ వొకటి రెంటినో తప్ప మిగిలినవాటిని గుర్తించడమే కష్టముగా ఉన్నది. పొదుకె, కొట్టిస్, మనర్ఫ, కటికర్దమ, అలొసిగ్నె, కన్నగర - ఇట్టివి చాలా ఉన్నవి. వారు చెప్పిన దేశాలు నదులు గుర్తించడములోకూడా కష్టము ఎక్కువై ఊహాలమీద ఊహాలు పెరిగినవి. టిన్న, మైసోలస్ అనేవి మన దేశములోని నదులట. మైసోలియా అనేది మన దేశములోని ఒక రాష్ట్రమట. మరి ఇవి ఇప్పుడు వేటికి వర్తిస్తవో. మనకు వారు చెప్పిన కరపట్టణాలలో గుర్తింపగుదిరినవి రెండే రెండు; ఒకటి కొంటకస్సిల, రెండవది కొడ్డూర. కొంటకస్సిల ఇప్పటి ఘంటసాల; కొడ్డూర ఇప్పటి బందరు దగ్గర గూడూరు. రెండూ కృష్ణా జిల్లాలోనివే; కృష్ణానదీ ముఖద్వారం దగ్గర ఉన్నవే. దంతపురము అనేది కళింగంలోని ప్రముఖమైన కరపట్టణము. అది ఎక్కడ ఉన్నదీ ఇంకా తెలియదు. ప్రధానముగా ఈ మూడు రేవులనుంచీ ఆంధ్ర వర్తక వ్యాపారులు తూర్పు దేశాలకూ, ద్వీపాలకూ వెళ్లేవారు.

సాతవాహనరాజుల కాలంనుంచీ రెండు మూడు వందల సంవత్సరాల క్రిందటిదాకా మన ఆంధ్రదేశము ఇతర దేశాలతో సాగించిన ప్రధాన వ్యాపారము నూలు బట్టలూ, అద్దకపు బట్టలూ, అతి సుందరమైన పలుచని మల్లు సెల్లాలూను. సాతవాహనరాజుల కాలములో ఇవి యూరోపుఖండ దేశమైన ఇటలీకికూడా వెళ్లేవి. ఆ కాల

ములో రోముచక్రవర్తులు ఇటలీ పాలిస్తూ ఉండేవారు. మన దేశపు వర్తకులు రోమువర్తకుల వద్దనుంచి బంగారము తీసుకొని బట్టలు ఎగుమతిచేసేవారు. ఈ కారణంచేత రోము చక్రవర్తుల నాణెములు మన దేశములో ప్రత్తి పండే ప్రాంతాల గుంటూరుజిల్లా వినుకొండ ప్రాంతానను, కడపజిల్లాలోను దొరికినవి. ఆ విధంగానే మన పూర్వ చాళుక్యరాజయిన విమలాదిత్యుని అన్నగారు శక్తివర్మ బంగారు నాణెములు ఆరకాను, సయాముదేశాలలో కనబడినవి. వీటినిబట్టి మన దేశవర్తకులు సాతవాహనుల కాలమువరకూ, అటుతరువాతనుకూడా తూర్పుదేశాలతో వర్తకము సాగిస్తూవచ్చినట్టు ధ్రువపడుతున్నది.



జోంగులు అనే చీనాదేశపు ఓడలు

తూర్పుదేశాలనుంచి, ద్వీపాలనుంచి, మన సరకు చీనావారి ఓడలలో వచ్చేది. ఈ వోడలు చీనాదేశంనుంచి హిందూమహాసముద్రములో మలబారు తీరందాకా సబురులు చేసేవి. ఈ చీనావారి ఓడలకు జోంగులని పేరు.

వీటిని ఇంగ్లీషులో జంక్సు అంటారు. వీటికి ఒక్కొకదానికి మూడేసి, అంతకు ఎక్కువగాను వెదురు పేపబెత్తములతో అల్లిన తెరచాపలు, యాత్రికులు ఉండడానికి వీటిలో గదులు ఉండేవి. జోంగులు పెద్ద ఓడలు. ఒక్కొక్క పెద్ద ఓడకు వేయేసిమంది కళాసులూ నావికులూ ఉండేవారు. చిన్న ఓడలకు నాలుగు వందలమందీ, ఆరువందలమందీ ఉండేవారు. వీరిలో విలువిద్యలో ఆరితేరినవారు కూడా ఉండేవారు. ఒక్కొక్క పెద్ద ఓడతో చిన్నపడవలు మూడు నాలుగు ఉండేవి. మన దేశాన్నుంచి తూర్పు దేశాలకు సంవత్సరానికి ఒక్క సబురు సాగేది.

మండలిక యుగములో సముద్రవ్యాపారము మందగించినది. దానికి కారణం ఇది. ఆంధ్రదేశపు కరపట్టణాలకు సరకులు వేసుకొనివచ్చిన ఓడలను సముద్రప్రాంతాన ఉన్న మండలికులు కొల్లగొట్టేవారు; ఎక్కువ సుంకాలు తీసేవారు. ఎప్పుడయినా ఏ గాలితుపానులకయినా వర్తకపుటోడలు ఒడ్డుపట్టినా, బ్రద్దలయి ఒడ్డుకు కొట్టుకొనివచ్చినా సరకు బలవంతాన తీసుకొని వర్తకులను హింసించేవారు. ఈకారణాన మండలికయుగము చివరికాలములో ఆంధ్రదేశపు రేవులు ఎన్నో చాలా పాడయిపోయినవి. ఇటువంటి స్థితిని గమనించి ఓరుగంటి గణపతిదేవమహారాజు పూర్వాంధ్రదేశాన్నంతా జయించినతరువాత సముద్రాలమీద ఓడవ్యాపారముచేసే వర్తకులకు అక్రమాలు ఏవీ

జరగకుండా రక్షిస్తానని అభయహస్తం ఇచ్చాడు; సరకులమీద సుంకాలు నిర్ణయించాడు.

గణపతిదేవమహారాజు కాలములో గుంటూరుజిల్లాలోని మోటుపల్లి గొప్ప రేవుపట్టణము. అప్పటికి ఘంటసాల, గూడూరు రేవుల ప్రభ తగ్గిపోయింది. వెనీసు దేశస్థుడయిన మార్కోపోలో అనే యాత్రికుడు క్రీ. శ. 1280 ప్రాంతాన ఈమోటుపల్లి రేవులో దిగి ఇక్కడి మల్లుసెల్లాలు చూచి అవి సాలీనిదారముకంటెను సన్నమైన దారముతో నేసినవనీ, ఇటువంటి మల్లుసెల్లాలు తాను ఎక్కడా చూడలేదనీ వ్రాశాడు.

కాకతీయసామ్రాజ్యము క్రీ. శ. 1323 లో కూలిపోయిన తరువాత మరల ఓడల వ్యాపారానికి దెబ్బ తగిలింది. మోటుపల్లికూడా తురకసర్దారుల మండలికుల చేతిలోపడి పూర్వపు వైభవం గోల్పోయింది. తూర్పు దేశాలతో వర్తకము ఏమాత్రంగానో జరుగుతూవచ్చినా కొండవీటి రెడ్డిరాజులు పూర్వాంధ్రదేశాన్ని వశంచేసుకొని తమ అధికారం బాగా స్థాపించినదాకా తెలుగుదేశపు ఓడల వ్యాపారం బాగుపడలేదు.

---

# తొమ్మిదవ ప్రసంగము

---

## రెడ్డిరాజ యుగము

రెడ్డిరాజులనుగురించి చెప్పడానికి ముందు చాలా గాథ ఉన్నది. అది తెలుసుకొంటేనేకాని మన ముందు చరిత్ర మీకు సరిగా బోధపడదు. ఆంధ్రదేశం క్రీ. శ. 1323 లో ఢిల్లీ తుఘ్లకు సామ్రాజ్యములో చేరిపోయినతరువాత దానిని విడిపించి స్వాతంత్ర్యం సంస్థాపించడానికి ఆంధ్రులు గట్టి ప్రయత్నం చేశారు. వింధ్యకు దక్షిణాన ఉన్న గొప్ప రాజ్యాలన్నీ మహమ్మదు బిన్ తుఘ్లకు అధికారానికి లోబడిపోయినవి. ఎంతటివారికీ ఆనాడు ఢిల్లీ సుల్తానును ఎదిరించడానికి సాహసం లేకపోయింది. అందుకు సాహసించినవారు ఒక్క ఆంధ్రులే.

దేశములోని సామంతులూ, నాయకులూ ఏకమైనారు. వారికి ముసునూరి ప్రోలానేడు నాయకుడు. రెండు మూడేళ్లకే ప్రోలానేడు పూర్వాంధ్రదేశంలోనుంచి ముస్లిము సైన్యాలను తరిమివేశాడు; స్వరాజ్యం స్థాపించాడు. అతనికి గోదావరినది ఒడ్డున ఉన్న రేకపల్లి రాజధాని. అటుతరువాత పదేళ్లకల్లా అతని పినతండ్రికొడుకు కాపానేడు పాకికొండలకు ఎగువనున్న తెలంగానాలోనుంచికూడా ముస్లిము సేనలమీద తిరుగబాటుచేసి వాటిని ఓడించి తరుమగొట్టి

ఓరుగల్లుకోట మళ్లీ స్వాధీనం చేసుకొన్నాడు. అప్పటినుంచి కాపానేనికి ఓరుగల్లు రాజధాని.

కాపానేడు ఓరుగల్లు వశంచేసుకొన్న కొద్దికాలానికే తుంగభద్రానదీ ప్రాంతదేశాన్నుంచి ముస్లిము అధికారులను, సేనలను ఓడించి తరుమగొట్టి హరిహరరాయలూ, అతని సోదరులూ ఆదేశాన్ని వశపరుచుకొని క్రీ. శ. 1335-36 నుంచి పాలించారు. వారి రాజధాని తుంగభద్రానది వొడ్డున ఉన్న విజయనగరం. ఈ విధముగా మళ్లీ పది పదుమూడు సంవత్సరాలలో ఆంధ్రదేశం అంతా స్వతంత్రమైనది; కాని కాకతిరాజుల కాలములోలాగ ఒక్కరి అధికారంక్రిందికిమాత్రం రాలేదు.

మరొక పది సంవత్సరాలకు పదుమటి దక్కను దేశంలోని తురక సర్దారులుకూడా ఢిల్లీ సుల్తానుమీద తిరుగబాటుచేసి దక్కను దేశములో క్రీ. శ. 1347 లో బహ్మనీ రాజ్యం అనేపేర ఒక ముస్లిము రాజ్యం స్థాపించారు. ఈ రాజ్యం స్థాపించినవాడు బహ్మనీవంశపు అలావుద్దీన్ హసన్ షా. ఇతనికి గుల్బర్గా రాజధాని. ఈవిధముగా చివరికి ఢిల్లీ సుల్తాన్ మహమ్మదు బిన్ తుఘ్లకుకు వింధ్యకు దక్షిణదేశములో రాజ్యమే లేకుండాపోయింది.

ముసునూరి ప్రోలానేడు ఆట్టే కాలం బ్రతకలేదు. అందువల్ల కాపానేడే పూర్వాంధ్ర దేశానికికూడా ఏలిక అయినాడు. ఢిల్లీ సుల్తాను మహమ్మదు బిన్ తుఘ్లకు

1352లో చనిపోయిన తరువాత బహ్మనీ సుల్తాను అలా వుద్దీను హిందూరాజులను అణచివేసి వారి రాజ్యాలను తన రాజ్యములో కలుపుకోవాలని అటు ఓరుగంటిమీదికీ, ఇటు విజయనగరంమీదికీ చాలాసారులు దండయాత్రలు చేశాడు. ఈ సందర్భములో హిందూ ప్రభువు లందరూ ఏకమై ముస్లిములను ఎదుర్కోడానికి బదులుగా వారు తమలో తాము విరోధాలు పెంచుకొని కలహిస్తూ వచ్చారు. ఈ పరిస్థితులలో మరి యిద్దరు తెలుగు వీరులు బలవంతులై మరి రెండు కొత్త రాజ్యాలు స్థాపించారు. ఈ యిద్దరిలో ఒకడు రేచెర్ల అనవోతానేడు అనే పద్మ వెలమ బిడ్డ; రెండవవాడు వేమారెడ్డి అనే రెడ్డిబిడ్డ. అనవోతానేడు తెలంగానాలోని రాజుకొండలోను, వేమారెడ్డి గుంటూరు జిల్లాలోని అద్దంకిలోను చిన్న రాజ్యాలు స్థాపించారు; ముస్లిము దండయాత్రలతో బలం చితికిపోయిన మునునూరి కాపానేని యుద్ధములో చంపివేసి అనవోతానేడు ఓరుగంటి రాజ్యం ఆక్రమించుకొన్నాడు. అప్పటినుంచి తెలంగానాకు అంతకూ రేచెర్ల పద్మ వెలమనాయకులు అధిపతులైనారు. వారి రాజ్యానికి కృష్ణానది దక్షిణపు సరిహద్దు.

పూర్వాంధ్ర దేశములో మునునూరి నాయకుల అధికారం క్షీణించగానే వేమారెడ్డి, అతని నలుగురు సోదరులూ బలవంతులై సముద్రపు వొడ్డునే ఉన్న దేశాన్ని ఆక్రమించుకొన్నారు.

ఆంధ్రదేశం అంతా ఈవిధముగా పద్నాలుగవశతాబ్ది చివరి భాగములో మూడు ముఖ్యరాజ్యాలుగా చీలి పోయింది. తెలంగానా రాజుకొండ రాజధానిగాగల రేచెర్ల వారి వశాన, పశ్చిమాంధ్రదేశం అనే యిప్పటి రాయలసీమ విజయనగరరాజుల క్రిందా, పూర్వాంధ్రదేశం రెడ్డిరాజుల అధికారంలోను ఉండేది.

వెనుక చెప్పినట్లు కళింగదేశముమాత్రం ఇంచు మించుగా పదిహేనవశతాబ్ది మధ్యదాకా గంగవంశపు రాజుల పాలనలోనే ఉండేది.

రెడ్డి రాజ్యం స్థాపించిన వేమారెడ్డి మొదట ముసు నూరి ప్రోలానేనితో కలిసి స్వాతంత్ర్య యుద్ధములో పాల్గొ న్నవీరుడే. ఇతడు మొదట ప్రోలానేనికీ తరువాత కాపా నేనికీ సామంతుడుగా ఉండి అద్దంకి ప్రాంతం పాలించాడు; ముసునూరివారి అధికారం క్షీణించిన కాలములో స్వతం త్రుడయినాడు. ఇతని అన్న పెదకోమటిరెడ్డి, చివరి తమ్ముడు మల్లారెడ్డి వేమారెడ్డికి తగిన సోదరులు, పరాక్రమవంతులు. రెడ్డిదొరలు అందరూ కలిసి చిన్న సంస్థానాన్ని ఒక పెద్ద రాజ్యం చేశారు. వేమారెడ్డి రాజ్యం తూర్పుసముద్ర తీరా న్నుంచి సుప్రసిద్ధ శివ, విష్ణు క్షేత్రాలు-శ్రీశైలం అహో బలములవరకు వ్యాపించింది.

వేమారెడ్డి అనంతరం అతనికొడుకు అనవోతారెడ్డి తూర్పుదేశంమీదికి దండెత్తి దానిని జయించాడు కాని స్థిరముగా నిలుపుకోలేక పోయినాడు. ఈలోగా విజయనగ

రాధీశులు తమ రాజ్యాన్ని నెల్లూరికంటా తూర్పుసముద్ర తీరందాకా వ్యాపింపజేశారు. వారి తూర్పురాజ్యాని కంతకు నెల్లూరుజిల్లాలోని ఉదయగిరి ప్రధానదుర్గమైనది. విజయ నగరంరాజులు ఉదయగిరిని పట్టుకొని దానిని ముఖ్యదుర్గం చేసుకోడంచేత దానికి దగ్గరగా అద్దంకిలో ఉండడం ప్రమాదమని అనవోతారెడ్డి రాజధానిని అద్దంకినుంచి కొండవీటికి మార్చినాడు. అప్పటినుంచి వీరికి కొండవీటి రెడ్డిరాజులని పేరు. అనవోతారెడ్డినాటినుంచి విజయనగరాధీశులూ, రాజుకొండ వెలమలూ రెడ్డి రాజ్యంమీాదికి దండెత్తివెళ్లి దానిని కాస్త కాస్తగా మింగి వెయ్యాలని ప్రయత్నించారు.

అట్టి సమయంలోనే కొండవీటి రాజ్యానికి అధిపతి అయినాడు అనవోతారెడ్డి తమ్ముడు మహాబలపరాక్రమశాలి అనవేమారెడ్డి. అనవోతారెడ్డి చనిపోయేనాటికి అతని కొడుకు కొమరగిరిరెడ్డి చాలా చిన్నవాడు. కోమరగిరికి కుమారగిరిరెడ్డి అనికూడా పేరు. ఇతడు చిన్నవాడు అవడంచేత రెడ్డిరాజ్యం క్షేమము ఆలోచించి రాజ్యంలోని మంత్రులు సామంతులు దొరలు అనవేమారెడ్డికి పట్టం కట్టినారు. ఇతడు రెడ్డిరాజ్యాన్ని విపద్దశలో కాపాడడమే కాకుండా దానిని సింహాచలందాకా విస్తరింపజేశాడు.

అనవేమారెడ్డి అనంతరం కొండవీటిరెడ్డి సింహాసనానికి తగవులు పుట్టి యుద్ధాలు జరిగినవి. అయినా అనవోతారెడ్డి కొడుకు కుమారగిరిరెడ్డే అతని బావ కాటయవేమారెడ్డి,

రాజమహేంద్రవరపు రెడ్డిదొరలు ముప్వారి అల్లాడరెడ్డి, ఇతని కొడుకులు వేమ, వీరభద్రారెడ్లు - వీరి సాయముతో యుద్ధాలు గెలిచి కొండవీటికి రాజయినాడు. అతని బావ కాటయవేమారెడ్డే అతని ప్రధానీ, సర్వసైన్యాధిపతీని. ఈ కలహకాలములో గోదావరికి తూర్పున ఉన్న దేశం రెడ్డి రాజులమీద తిరుగబాటుచేసింది. ఈ దేశాన్ని అంతను కాటయవేమారెడ్డి మళ్లీ సాధించడమే కాకుండా ఓఢ్ర దేశంలోని కటకంవరకు గల దేశాన్నంతనూ జయించాడు. గోదావరినది దగ్గరనుంచి సింహాచలందాకా ఉన్న తూర్పు దేశాన్నంతను రాజమహేంద్రరాజ్యము అని పేరు పెట్టి ఒక రాజ్యముగా ఏర్పాటు చేసి కొమరగిరిరెడ్డి తన కొడుకు అనవోతారెడ్డిని దానికి అధిపతిని చేశాడు; కాని అనవోతా రెడ్డి త్వరలోనే అకాలమరణం పొందినాడు. అప్పుడు తనకు అంతవరకు చేసిన ఉపకారాలు తలచి కొమరగిరిరెడ్డి రాజమహేంద్రరాజ్యాన్ని తనబావ కాటయవేమారెడ్డికి ఇచ్చి వేశాడు. ఇట్లా ఇవ్వడము కొమరగిరిరెడ్డి పెత్తాత పెద కోమటిరెడ్డి కొడుకు వేమారెడ్డి మొదలైన పెద్దరెడ్డిదొరలకు ఇష్టం లేకపోయింది. ఇదే కొండవీటి రెడ్డిరాజ్యపతనానికి ఆరంభం.

కుమారగిరికి తరువాత కొండవీటికి రాజయిన పెద కోమటి వేమారెడ్డి రాజమహేంద్రరాజ్యం కోసం కాటయ వేమారెడ్డితో చాలా తడవలు యుద్ధం చేశాడు. ఈయుద్ధాలలోనే కాటయవేమారెడ్డి చనిపోయినాడు. ఇతని కూతురు

అనితల్లిదువ్వూరి అల్లాడరెడ్డి కొడుకు వీరభద్రారెడ్డి భార్య. అనితల్లి సోదరు లెవ్వరూ మిగలలేదు. అనితల్లితోగల సంబంధాన్ని పురస్కరించుకొని అల్లాడరెడ్డి కాటయవేమారెడ్డి గతించినవెనుక ఆమె పక్షాన పెదకోమటి వేమారెడ్డితో పోరాడి రాజమహేంద్రరాజ్యం ఆమెకు నిలబెట్టి నాడు. అల్లాడరెడ్డి పెద్దకొడుకు వేమారెడ్డి తన తమ్ముడు వీరభద్రారెడ్డికి పట్టం కట్టి అతనిచేత రాజమహేంద్రరాజ్యం ఏలించినాడు.

పెదకోమటి వేమారెడ్డి కొడుకు రాచవేమారెడ్డి కొండవీటిని ఏలిన చివరి రెడ్డిరాజు. ఈ యుద్ధాలతోను, విజయనగరంరాజుల, బహ్మనీ సుల్తానుల దండయాత్రలతోను నలిగి నాశనమైంది రెడ్డి రాజ్యము.

రెడ్డిరాజులు సంస్కృతాంధ్రాలు బాగా చదివినవారు. కొమరగిరిరెడ్డి సంస్కృతములో నాట్యశాస్త్రం వ్రాశాడు. దాని పేరు వసంతరాజీయం. కొమరగిరికి వసంతరాజని కూడా పేరు. ఇతడు గొప్ప నాట్యకళావిమర్శకుడుకూడాను. కుమారగిరిరెడ్డి బావా ప్రధానీ అయిన కాటయ వేమారెడ్డి గొప్ప వీరుడు రాజ్య తంత్రజ్ఞుడు మాత్రమే కాదు, గొప్ప సంస్కృత విద్వాంసుడుకూడాను. ఇతడు కాళిదాస మహాకవి వ్రాసిన సంస్కృత నాటకాలకు గొప్ప వ్యాఖ్యానం వ్రాశాడు. పెదకోమటి వేమారెడ్డికూడా సంస్కృతములో మహాపండితుడూ కవీని. ఇతడు సంగీతంలోను సాహిత్యంలోనుకూడా చాలా గట్టివాడు; గొప్ప గ్రంథాలు వ్రాశాడు.

అనవేమారెడ్డి, ఇతని తండ్రి వేమారెడ్డి సంస్కృత కవులను ఆంధ్రకవులను ఎందరినో ఆదరించారు. ఈ రెడ్డి రాజులు ఆయుర్వేద వైద్యాన్నీ, జ్యోతిశ్శాస్త్రాన్నీ పోషించారు. వారి కాలములో గొప్ప ఆయుర్వేద వైద్యులు, జ్యోతిశ్శాస్త్రవేత్తలు ఉండేవారు.

ఈవిధంగానే రాజుకొండ రేచెర్ల పద్మవెలమనాయకులు కూడా తెలుగు కవులను, సంస్కృత కవులను పోషించారు. రేచెర్ల అనపోతానేని మనుమడు కుమార అనపోతానేడు సంస్కృతములో చాలా గొప్ప పండితుడు. ఇతడు నాటకాలు, సంగీత అలంకారశాస్త్ర గ్రంథాలు వ్రాశాడు.

రెడ్డిరాజులకాలం ముఖ్యముగా ఆంధ్రవాఙ్మయానికి వసంతకాలం వంటిది. మన గొప్ప కవులు అనేకులు ఈకాలంలోనివారే. రెడ్డిరాజ్యం స్థాపించిన వేమారెడ్డి ఎఱ్ఱాప్రెగడ అనే శంభుదాసకవిని పోషించాడు. ఈకవి భారతం అరణ్యపర్వములో నన్నయభట్టు విడిచిపెట్టిన భాగం తెనిగించాడు. అప్పటికి మహాభారతం పూర్తిగా తెలుగులోనికి వచ్చింది. ఎఱ్ఱాప్రెగడ చాలా గొప్ప కవి; హరివంశము, నృసింహపురాణము అనే గ్రంథాలుకూడా రచించాడు.

రెడ్డిరాజుల ఆదరం పొందినవారు, వారికాలములో ఉన్నవారు ఎందరో గొప్ప కవులు ఉన్నారు; వారు ఎన్నో గొప్ప కావ్యాలు వ్రాశారు. వారందరిలోను చాలా గొప్పవాడు శ్రీనాథకవి సార్వభౌముడు. ఇతడు వేదాలు,

శాస్త్రాలు బాగా చదివినాడు; తెలుగులోను, సంస్కృతం లోను గొప్ప కవిత్వం చెప్పినాడు. కొండవీటిరాజు పెద కోమటి వేమారెడ్డి ఆశ్రయం సంపాదించి, అతని ఆస్థానములో మహారాజాశ్రయంకోసం వచ్చే గొప్ప పండితులను వారు చదివిన విద్యలలో పరీక్షచేసే విద్యాధికారి అయి నాడు. పెదకోమటి వేమారెడ్డి చనిపోయిన తరువాత రాజ మహేంద్రవరంవెళ్లి వీరభద్రారెడ్డి ఆస్థానములో చేరినాడు. ఈ మహాకవి నైషధము, కాశీఖండము, భీమేశ్వరపురాణము, హరవిలాసము మొదలైన గొప్ప గ్రంథాలు ఎన్నో వ్రాశాడు. ఆ కాలంలో ఎన్నో దేశాలు తిరిగినాడు; ఎన్నో రాజాస్థానాలకు వెళ్లి మన్ననలు, సత్కారాలు పొందినాడు; ఒకమారు విజయనగరం వెళ్లి ఆయాస్థానములో ఉన్న గొప్ప పండితుడు డిండిమభట్టును శాస్త్రవాదములో ఓడించాడు; ఇతని తర్కానికి, శాస్త్రపాండిత్యానికి మెచ్చి విజయనగరాధీశ్వరుడు ప్రౌఢదేవరాయలు తన ముత్యాల శాలలో మహాకవి పండితసభలో దీనారాలు అనే బంగారు నాణెములతో అతనిని స్నానంచేయించాడు. రాజుకొండకు వెళ్లి రేచెర్ల అనవోతానేనివంశంవాడు సింగమనేని సందర్శించాడు శ్రీనాథుడు. ఈ సింగమనేని రాజ్యంలోనే ఉండేవాడు మరొక మహాప్రసిద్ధుడైన ఆంధ్రకవి పోతన్న గారు. ఈయన సంస్కృతభాగవతం తెనిగించాడు. ఇట్టి గొప్ప కవులు వెలసినకాలం అది.

ఈ కాలములో వర్తక వ్యాపారం తూర్పు దేశాలతోను, ద్వీపాలతోను బాగా ప్రబలింది. తురకల హయాములో మోటుపల్లి రేవు మళ్లీ చెడిపోయింది. ఆ ప్రాంతపు అధికారులు వర్తకులను పెట్టిన హింసలవల్లా, ఎగుమతి దిగుమతులమీద విధించిన విపరీతపు సుంకాలవల్లా వర్తకులు ఈ రేవుకు రావడం మానివేశారు. వేమారెడ్డి తమ్ముడు మల్లారెడ్డి ఈ ప్రాంతపు అధికారులను ఓడించి మోటుపల్లి తీసుకొన్నాడు. వేమారెడ్డి కొడుకు అనవోతారెడ్డి ఎగుమతి దిగుమతులమీద సుంకాలు నిర్ణయించి వర్తకులకు సౌకర్యాలు కల్పించి మళ్లీ మోటుపల్లిని గొప్ప కరపట్నం చేశాడు. అటుతరువాత ఓడలవర్తకం వెనుకటిలాగే బాగా సాగింది. మనకు తెలిసిన ఈ కాలపు గొప్పవర్తకుడు అవచి తిప్పయ్యసెట్టి. ఈ సెట్టి బర్మా, మలయా, బూటాన్, చీనా, సింహళము, జావా మొదలైన దేశాలతోను, ద్వీపాలతోను వర్తకం సాగించి గొప్పపేరు సంపాదించాడు.

రెడ్డిరాజులకాలములో ఎన్నిక గన్న వేడుక వసంతోత్సవం. ఈవసంతోత్సవానికి కావలసిన పరిమళ ద్రవ్యాలన్నీ తూర్పు దేశాలనుంచీ ద్వీపాలనుంచీ వర్తకులు తెచ్చేవారు. రెడ్లు ఈ వసంతోత్సవం మహావైభవముతో జరిపేవారు. అందువల్ల అనవేమారెడ్డినాటినుంచి వారు వసంతరాయ నామముతో ప్రసిద్ధులయినారు; వీరిలో కొందరికి కర్పూర వసంతరాయ బిరుదముకూడా ఉన్నది.

రెడ్డిరాజుల కాలములో ఆంధ్రదేశములో శైవమే ప్రధానమతం. రెడ్డిరాజులు పరమశైవులు. వేమారెడ్డిగారు శ్రీశైలానికీ పాతాళగంగకూ సోపానాలు కట్టించి భక్తులైన యాత్రికులకు గొప్ప ఉపకారం చేశారు. ఎప్పుడు వచ్చిందో చెప్పలేము కాని రెడ్డియుగంనాటికే ఒక కుటుంబములో ఒకరు ఏమతం అవలంబిస్తే అందరు ఆ మతమే అవలంబించాలనే సంప్రదాయం ఏర్పడింది. దేశానికి గాని, గ్రామానికి గాని, రాజవంశానికి గాని సంభవించిన అరిష్టాలను తొలగించడానికి మ్రొక్కులు మ్రొక్కుకొని ప్రాణం ధారపోసే వీరులకు విగ్రహాలు చేసి పూజించే సంప్రదాయము ఈకాలంలోనే వచ్చింది. పల్నాటి వీరులకు పూజా పురస్కారాలు కలిగినవి ఈకాలంలోనే. రెడ్డియుగం వీరయుగం.

# పదవ ప్రసంగము

---

## విజయనగర సామ్రాజ్యము

మరల స్వాతంత్ర్యం స్థాపించినతరువాత మన దక్కను దేశములో వెలసిన హిందూరాజ్యాలు అన్నిటి లక్ష్యమూ ఒకటే; అన్నిటి ఆశయమూ ఒకటే. అది ఏమిటంటే హిందువులను వారి మత ఆచార వ్యవహారాలను విద్యలను కళలను కాపాడడం. ఈపని విజయనగరము తక్క మిగిలినవి సమర్థతతో నిర్వహింప లేకపోయినవి. ముసునూరివారి ఓరుగంటిరాజ్యం బహ్మనీసుల్తానులతోడి పోరాటములో చితికిపోయింది. రేచెర్లవారి రాజుకొండరాజ్యం మొదట బహ్మనీ సుల్తానులకు సామంతరాజ్యమై, కొంతకాలము గడచినతరువాత వారిమీద తిరుగబాటు చేసేటప్పటికి అదిన్ని నాశనమైనది. అప్పటినుంచి బహ్మనీ సుల్తానులు తెలంగానాకు కూడా అధికారు లయినారు. రెడ్డిరాజుల కొండవీటిరాజ్యం అంతఃకలహాలతో విరిగి ముక్కలయిపోయింది. ఇక మిగిలిన విజయనగరమే హిందూవులను హిందూధర్మాన్ని హిందూసంస్కృతిని కాపాడవలసివచ్చింది. విజయనగరం ఆనాడు హిందూమహాదుర్గం.

విజయనగరరాజ్యం స్థాపించినవారు యాదవవంశజులు సంగమరాయల కొడుకులు హరిహరరాయలు, అతని నలుగురు తమ్ములు బుక్కరాయలు మొదలైనవారు. వీరిని

సంగమవంశంవారు అంటారు. హరిహరరాయల తరువాత విజయనగరాన్ని బుక్కరాయలు, అతని కొడుకు రెండవ హరిహరరాయలు మొదలైనవారు పరిపాలించారు. రెండవ హరిహరరాయలు, అతనికొడుకు దేవరాయలు చాలా పరాక్రమవంతులూ, సమర్థులూను. వీరికాలములో తూర్పుసముద్రంనుంచి పడమటి సముద్రంవరకు, దక్షిణాన కన్యాకుమారి వరకు విజయనగరరాజ్యం విస్తరించింది. దేవరాయలూ, అతని తరువాత వచ్చిన ప్రౌఢదేవరాయలూ అంతరించి పోతూవున్న కొండవీటిరెడ్డిరాజ్యాన్ని ఆక్రమించుకొని తూర్పున రాజమహేంద్రవరందాకా తమ అధికారం విస్తరింపజేశారు.

బహ్మనీ సుల్తానులకు ఈ విజయనగరరాజ్యం పెంపు కిట్టలేదు. ఆరంభంనుంచీ వారు ఈ రాజ్యాన్ని జయించి లోబరుచుకోవాలనే ఉద్దేశముతో దానిమీద చాలా దండయాత్రలు చేశారు. ఈదండయాత్రలలో కృష్ణా తుంగభద్రా నదులకు మధ్యను ఉన్న రాయచూరు దేశాన్ని బహ్మనీ సుల్తానులూ విజయనగరాధీశులూ ఎవరికి వీలయినప్పుడు వారు ఆక్రమించుకోడమున్నూ, ఒకరు ఆక్రమించుకోగానే రెండవవారు వారిని తరుమగొట్టడమున్నూ చాలా సారులు జరిగింది. రాయచూరు ప్రాంతం ఈ విధముగా ఉభయులకూ తగాదాల దేశమై గొప్ప విజయనగర-బహ్మనీ యుద్ధరంగం అయినది.

విజయనగర రాజ్యం బాగా పెంపుచెందిన కాలములో తూర్పు గంగవంశంవారి రాజ్యము అస్తమించడమూ, ఓఢ్రదేశంలోని గజపతివంశ్యుడు కపిలేశ్వరగజపతి కళింగ దేశపురాజు అవడమూ క్రీ. శ. 1345 లో జరిగింది. ఈ గజపతి వంశంవారికి ఓఢ్రదేశంలోని కటకము రాజధాని. కపిలేశ్వరగజపతీ, ఇతని కొడుకు పురుషోత్తమగజపతీ ఒక్క కళింగాన్నే కాకుండా పూర్వాంధ్రదేశాన్ని అంతను వశ పరచుకోడానికి చాలా ప్రయత్నించారు. ఈ విధమైన ప్రయత్నములో విజయనగరంరాజులకు కటకం గజపతులకు భయంకర యుద్ధాలు జరిగినవి. చివరికి గజపతులు గెలిచారు. కపిలేశ్వరగజపతి కొడుకు పురుషోత్తమగజపతి రాజమహేంద్రవరము, కొండపల్లి, కొండవీడు, వినుకొండ, నాగార్జునునికొండ కోటలే కాకుండా విజయనగరంవారి మొదలిదుర్గం ఉదయగిరినికూడా పట్టుకొన్నాడు. క్రీ. శ. 1500 ల నాటికి కటకము గజపతుల రాజ్యం ఉత్తరాన ఓఢ్ర దేశంనుంచి దక్షిణాన ఉదయగిరిదాకా వ్యాపించింది. గజపతులు తురకలు కలిసి దక్షిణదేశంమీదికి ఒకప్పుడు దండెత్తడంకూడా జరిగింది. ఇక రక్షణ ఏది హిందువులకు? దీనికితోడు సంగమవంశంవారిలో బలహీనులు రాజ్యానికి వచ్చారు. ప్రౌఢదేవరాయలనాటినుంచీ ప్రధానిగాను, సైన్యాధిపతిగాను ఉంటూవచ్చిన సాళువ నరసింహరాయలు విజయనగరసామ్రాజ్యానికి ఎక్కడ ముప్పు వస్తుందో అని విజయనగర సింహాసనం ఎక్కి రాజ్యాధికారం చేతబట్టినాడు.

సాళువ నరసింహరాయులు వీరాధివీరుడు; రాజ్యతంత్రజ్ఞుడు. ఇతడు తాను సింహాసనం ఆక్రమించిన కాలములో, తిరుగ బాటు చేసిన మన్నీలను అందరిని జయించి దక్షిణ దేశాన్ని అంతను మళ్లీ విజయనగరాధికారంక్రిందికి తెచ్చాడు. ఈ విషయములో అతనికి చాలా సహాయపడి కార్యఖడ్గాలు నెరపినవారు తుళువవంశంవారు ఈశ్వర నాయకుడూ ఇతని కొడుకు నరసానాయకుడూను. వీరు ఉభయులూ నరసింహరాయల కార్యకర్తలుగాను, సైన్యాధిపతులుగాను వ్యవహరించారు.

సాళువ నరసింహరాయల కొడుకులు తండ్రి అంత సమర్థులు కారు. పైగా సింహాసనంకోసం కుట్రలు అధికమైనవి. రాజ్యములోని ఈ స్థితి చూసీ, అటు గజపతులా ఇటు ముస్లిములా ఉద్ధతి చూసీ విజయనగర సామ్రాజ్యానికి ప్రమాదం రాకుండా ఉండడానికని నరసింహరాయల కొడుకు ఇమ్మడి వీరనరసింహరాయలను పేరుకు సింహాసనం ఎక్కించి నరసానాయకుడే కొంతకాలం రాజ్యం పాలించాడు. తరువాత ఆకాస్త అడ్డుకూడా తొలగించి సర్వాధికారమూ హస్తగతం చేసుకొని తుళువవంశంవారే విజయనగరం నుంచి పాలించారు రాజ్యాన్ని. తుళువ నరసానాయకుడి కొడుకు వీరనరసింహరాయలకు ప్రధానిగా ఉండేవాడు బ్రాహ్మణుడు సాళువ తిమ్మరసయ్య.

వీరనరసింహరాయల కాలానికి బహ్మనీ సుల్తానులలో బలహీనులు వచ్చారు. అందువల్ల వారిని లక్ష్యపెట్టక వారి

క్రింద ఉండే సైన్యాధిపతులు స్వతంత్రులై తమకు లోబడ్డ దేశాన్ని స్వతంత్రముగా పరిపాలించడం ఆరంభించారు. ఈవిధముగా బహ్మనీరాజ్యం చితికిపోయి అయిదు ముక్కలయింది; అవి ఏమిటంటే (౧) ఆదిల్‌షాహీల విజాపుర రాజ్యము; (౨) కుతుబ్‌షాహీల గోలకొండరాజ్యము; (3) నిజాంషాహీల అహ్మదునగర రాజ్యము (౪) ఇమాద్‌షాహీల బేరారురాజ్యము; (౫) బరీద్‌షాహీల బీదరు రాజ్యము. వీటిలో విజాపురము, గోలకొండ రాజ్యాలు విజయనగరానికి ఇరుగు పొరుగు రాజ్యాలు అయినవి. స్వతంత్రరాజ్యాలు సంస్థాపించిననాటినుంచీ తమ తమ రాజ్యాలు పెంపొందించుకోడానికి ఈసుల్తానులు ఒకరితో ఒకరు పోరాడుతూవచ్చారు. ఇది అట్లా ఉండగా గోలకొండ సుల్తానులు పూర్వాంధ్రదేశాన్నీ, విజాపురంవారు విజయనగరపు కర్ణాటాన్నీ ఆక్రమించుకోడానికి గట్టి ప్రయత్నం చేశారు. తుళువ వీరనరసింహరాయలు తన రాజ్యంలోని పితూరీలను అణచివేసి ఈముస్లిములతో పోరాడి కొంతకాలం విజయనగరసామ్రాజ్యము రక్షించినాడు కాని ఇంతలోనే కాలంచేశాడు. రాజ్యం క్షేమాన్ని, అప్పటి ప్రమాదకరమైన రాజకీయపరిస్థితులను ఆలోచించి మంత్రి సాళువ తిమ్మరసు వీరనరసింహరాయల ఆజ్ఞకు వ్యతిరేకముగా నడచి చిన్నపిల్లవాడైన అతని కొడుకుకు బదులుగా ఆ నరసింహరాయల సోదరుడు కృష్ణదేవరాయలను విజయనగర సింహాసనం ఎక్కించాడు. కృష్ణదేవరాయలు సింహాసనం ఎక్కడముతో విజయనగరం ఒక్కవెలుగు వెలిగింది.

కృష్ణ దేవరాయలు బాహుబలపరాక్రమాలు గల మహావీరుడు; యుద్ధతంత్రములో చాలా నేర్పరి; ఇతని ప్రధాని సాళువ తిమ్మరసయ్య గొప్ప రాజ్యతంత్రజ్ఞుడు. ఇక కొదవేమిటి? కృష్ణరాయలు రాజ్యానికి వచ్చేనాటికి పురుషోత్తమగజపతి కొడుకు ప్రతాపరుద్రగజపతి ఓఢ్రదేశానికి రాజయినాడు. ఇతనిరాజ్యం నెల్లూరుజిల్లాకంటా వ్యాపించింది. ఉత్తరాన ముస్లిము సుల్తానులు బలవంతు లవుతున్నారు. ఇదంతా కనిపెట్టి తిమ్మరసుమంత్రి సాయముతో కృష్ణదేవరాయలు విజయనగర సింహాసనానికి కప్పము చెల్లించడం మానివేసి తిరుగబాటుచేసిన విజయనగర సామంతులను ముందు అణచివేసి, తరువాత గజపతిరాజ్యంమీదికి దండెత్తి వెళ్లి ప్రతాపరుద్రగజపతిని కటకందాకా తరిమివేశాడు; తరువాత ముస్లిములను ఓడించి విజయనగరానికి వారివలన ఉపద్రవం రాకుండా దానిని కాపాడినాడు. ఇతడు చాలా మంది కవులను పోషించాడు. ఇతని ఆస్థానములో అష్టదిగ్గజాలు ఎనమండుగురు కవులు ఉండేవారని ప్రతీతి. అందరిలోనికి పెద్ద పెద్దన్నగారు. కృష్ణరాయల తరువాత రాజ్యానికి వచ్చిన ఇతని సోదరులు అచ్యుతదేవరాయల, సదాశివరాయలవారి కాలములో విజయనగరంవారి అధికారం సింహళంమీదకూడా చెల్లింది. దక్షిణదేశం పాలించడానికి విజయనగరాధీశులు తంజావూరులోను, మధురలోను తెలుగునాయకులను తమ ప్రతినిధులుగా నియమించారు. ఇవే తరువాతికాలములో తంజావూరు, మధుర తెలుగు

నాయక రాజ్యాలుగా రూపొందినవి. ఈవిజయనగరం రాజుల కాలంలోనే మన ఆంధ్రులు అన్ని వర్ణాలవారూ దక్షిణాదినంతటా వ్యాపించారు; రాచరికం చేశారు.



అళియ రామరాయలు

సదాశివరాయలు తుళువవంశంవారిలో చివరి ప్రభువు. ఇతడు అంత సమర్థుడు కాడు; పేరుకు మాత్రమే రాజు. అందువల్ల ఇతనికి ప్రధానిగా ఉండి కృష్ణరాయల అల్లుడు అరవీటి రామరాయలే రాచరికం చేశాడు. ఇతనిని అళియ

రామప్పయ్య అనీ, అళియ రామరాయలనీ అంటారు. ఈ కాలములో ముస్లిము సుల్తానులు ఒకరితో ఒకరు పోరాడు కొంటూ విజయనగరరాజును సాయం పిలుస్తూవచ్చారు. రామరాయలు ఒకమారు ఒకరికి, ఇంకొకమారు ఇంకొకరికి ఈవిధముగా సాయం వెళ్లి తన రాజ్యం బలప్రాభవాలు వృద్ధిచేసుకొంటూవచ్చాడు. ఈవిధముగా వింధ్యకు దక్షిణ దేశములో విజయనగరానికి సాటిఅయిన సామ్రాజ్యమే లేక పోయింది. చివరికి ముస్లిము సుల్తానులందరూ ఏకమై క్రీ. శ. 1565 లో విజయనగరంమీదికి దండెత్తివెళ్లినారు. కృష్ణా నదీతీరాన రాక్షసి-తంగడి (గ్రామాల) వద్ద విజయనగరం హిందూసైన్యాలకు ముస్లిము సుల్తానుల సైన్యాలకు మహా భయంకరయుద్ధం జరిగింది. ఆయుద్ధంలో తన సైన్యంలోని ముస్లిముల విద్రోహంవల్ల రామరాయలు నిహతుడయి నాడు. లక్షమందిదాకా హిందువులు నశించారు. ఈవోట మితో విజయనగరసామ్రాజ్యం భగ్నమైనది.

అపజయం కలగగానే రామరాయల తమ్ముడు తిరుమల రాయలు విజయనగరం వచ్చి జవాహరీని, బొక్కసాన్ని తర్లించుకొని సదాశివరాయలను వెంటబెట్టుకొని అనంత పురం జిల్లాలోని పెనుగొండకోటకు పోయి చేరుకొన్నాడు. విజయం పొందిన ముస్లింసైన్యాలు విజయనగరం వచ్చి ప్రజ లను చంపి మహానగరం అంతా దోచుకొని తగులబెట్టి, దేవా యాలూ రాజభవనాలూ కూలగొట్టి సర్వవిధ్వంసం చేసి నవి. ఏ యుద్ధంవల్లా ఏ యపజయంవల్లా ఎక్కడా అంతకు

ముం దెన్నడూ ఈపోటమివల్ల కలిగినంతటి సర్వనాశనం కలగలేదని వ్రాశారు విదేశీయ యాత్రికులు. ఇప్పు డిక మిగిలినవల్లా భగ్నములైన గుళ్లూ, గోపురాలూ, నగళ్లూ, పగిలిన దేవతావిగ్రహాలూ, మొండి గోడలూను. వీటినే నేడు హంపీశిథిలాలు అంటారు. ఆ నాటితో విజయనగర సామ్రాజ్యం ప్రభ ఆరిపోయింది. హంపీశిథిలాలు సందర్శించి మన ప్రాచీన వైభవం తలచుకొని ఒక్క వేడి కన్నీటిచుక్క విడవండి.

సదాశివరాయల అనంతరం ఆరవీటి తిరుమలరాయల సంతతివారు రాయసింహాసనం ఎక్కి నష్టపోయిన రాజ్యాన్ని సంపాదించి మరల విజయనగర రాజ్యాన్ని ఉన్నతస్థితికి తీసుకురావాలని ప్రయత్నించారు; కాని దైవం వారికి కలిసి రాలేదు. ఆరవీటి వంశంవారికి మొదట పెనుగొండ, తరువాత చంద్రగిరి, అటువెనుక రాయవెల్లూరు రాజధాను లయినవి. ఆరవీటి తిరుమల దేవరాయల కొడుకులలో ఒకడైన వెంకటపతిరాయలు చాలా సమర్థుడూ పరాక్రమవంతుడూను. క్రీ. శ. 1614 లో ఇతడు చనిపోయిన తరువాత సంహాసనానికి పెద్ద తగవేర్పడింది. దానితో విజయనగరం పూర్తిగా చితికి ఛిన్నాభిన్నమైపోయింది. విజయనగర సామంతరాజ్యాలు తంజావూరు మధురలు కొంతకాలము పెంపొందినా అవికూడా పరస్పరమూ కలహించి నాశనమైనవి.

సాళువవంశంవారు విజయనగరాన్ని పాలిస్తున్నకాలం లోనే పోర్చుగల్ దేశీయుడు వాస్కో డ గామా క్రీ. శ.

1497 లో మనహిందూ దేశం పశ్చిమతీరం మలబారుకు వచ్చాడు. సముద్రాలమీద సబురులు చేసి సముద్రవర్తక వ్యాపారం సాగించడానికి పోర్చుగీసువారు మనదేశం రావడం అప్పటినుంచి మొదలు. వీరిది ప్రధానముగా గుర్రపు వర్తక వ్యాపారం; గుర్రాలను దక్కను హిందూ ముస్లిము రాజ్యాలకు సరఫరాచేసేవారు. అటుతరువాత సుగంధ ద్రవ్యవ్యాపారము ప్రబలింది. ఈ వ్యాపారం యూరోపు దేశాలలో లాభించడంవల్ల డచ్చివారుకూడా పోర్చుగీసు వారితోపాటు మన హిందూదేశానికీ ప్రాక్సముద్ర ద్వీపాలకూ సబురులు చేసి ఈ వర్తక వ్యాపారం ఆరంభించారు. వెంకటపతిదేవరాయల కాలములో ఈస్టిండియా కంపెనీ (తూర్పు ఇండియా వర్తక సంఘము) అనే పేరుతో ఈ వర్తక వ్యాపారం నిమిత్తమే మన దేశానికి వచ్చారు ఇంగ్లీషువారు. వీరి తరువాత ఫ్రెంచివారు వచ్చారు. చంద్రగిరి రాజధానిగా పాలించిన ఆరవీటి శ్రీరంగదేవ రాయలు క్రీ. శ. 1639 లో ఇంగ్లీషు ఈస్టిండియా కంపెనీ వారికి వర్తకపు గిడ్డంగి కట్టుకోనేటందుకు సాంథోమ్ సమీపాన కొంతభూమి ఇచ్చాడు. అదే ఇప్పటి చెన్నపట్నముగా పరిణమించింది. శ్రీరంగదేవరాయలే కొంచెం నామకుడైన చివరి ఆరవీటి వంశపు విజయనగరాధీశ్వరుడు.

విజయనగర సామ్రాజ్యానికి రాజధాని విజయనగరం. ఇది తుంగభద్రాతీరాన హంపీవిరూపాక్ష క్షేత్రంలో ఉన్నది. విజయనగర సామ్రాజ్యం ఉచ్చదశలో ఉన్నప్పుడు ఆ

నగరం మహావైభవముగా ఉండేది. ఏడు ప్రాకారాలు దాటితేనేకాని అసలు నగరంలోనికి వెళ్లడానికి వీలయేది కాదట. ఆనగరంలోని బజారులలో రత్నాలు రాసులుగా పోసుకొని వ్యాపారం చేసేవారట వర్తకులు. ఏనుగులు గుర్రాలు నవరత్నాలు మొదలు చిల్లరి సరకు దాకా ఎక్కడెక్కడినుంచీ ఇక్కడికి వచ్చేవి. వర్తకపు సరకులు తెచ్చేటటువంటీ, వ్యాపారం చేయడానికి వచ్చేటటువంటీ వర్తకుల సంఖ్యకు పరిమితి ఉండేది కాదట. సామ్రాజ్యములో ఏమూలనుంచి ఏమూలకయినాసరే సురక్షితముగా, నిర్భయముగా పోవచ్చుననీ, బజారులోకాని రాచబాటలోకాని బంగారు నగపడినా రత్నాభరణం రాలినా ఎవ్వరూ ముట్టేవారు కారనీ, దొంగలభయమన్నది ఏదీ లేదనీ ఆ రోజులలో విజయనగరానికి వచ్చిన విదేశవర్తక వ్యాపారస్తులు వ్రాశారు. విజయనగర సామ్రాజ్యములో మూడువందల కరపట్టణాలు ఉండేవట. ప్రసిద్ధమైన ప్రతి కరపట్టణమూ వచ్చే పోయే ఓడలతో, విదేశ స్వదేశ వర్తక వ్యాపారస్తులతో సందడిగా కిటకిటలాడుతూ వుండేదట. ఎక్కడెక్కడి బంగారమూ రత్నరాసులూ అన్నీ ఆనాడు విజయనగరానికే.

విజయనగరాధీశులలో సంగమవంశంవారు శైవులు. తరువాతి వంశాలవారు వైష్ణవాన్ని ఆదరించారు; వైష్ణవము పుచ్చుకొన్నారు. తెలుగుదేశములో వైష్ణవం ముమ్మరముగా వ్యాపించింది విజయనగరాధీశుల కాలంలోనే.

మహారాజులు వైష్ణవం పుచ్చుకొనేటప్పటికి వారి సామంతులుకూడా వైష్ణవమతం అవలంబించారు. ఆంధ్రదేశంలోని సుప్రసిద్ధ విష్ణ్వాలయాల వైభవ, రాజభోగాలు అన్నీ విజయనగరాధీశ్వరుల కాలంలోని వే.

ఇట్లని విజయనగర సామ్రాజ్యములో ఇతర మతాలు లేకపోలేదు; వాటిని మహారాజులు ఆదరించకపోను లేదు. అట్టి మతాలలో ప్రధానమైనవి జైనమూ శైవమూను. విజయనగరాన్ని పాలించిన అన్ని వంశాలవారు అన్ని మతాలను, ఆఖరుకు ఇస్లాము మతాన్నికూడా సరిసమానముగా ఆదరించారు. ఆరవీటి రామరాయలు తన కొలువులోను ఉన్న తురకలకు మసీదుకూడా కట్టించి యిచ్చాడు; ఏమతంవారయినాసరే స్వేచ్ఛగా తమ మత ధర్మాన్ని అనుసరించవచ్చునని విదేశీయులే వ్రాశారు.


మహారాజులే కాకుండా ప్రజలుకూడా అందరినీ సమానముగా ఆదరించేవారు. న్యాయమే కాని అన్యాయం ఉండేది కాదు. ఆ కాలములో హిందూ విద్యలూ, కళలూ చక్కగా వర్ధిల్లినవి. తెలుగులో గొప్ప కావ్యాలు వచ్చినవి. అదీ విజయనగరం.

## పదకొండవ ప్రసంగము

### మహమ్మదీయ యుగము : గోలకొండరాజ్యము

గోలకొండరాజ్యచరిత్ర అంటే ముస్లిము సుల్తానుల పరిపాలనలోని ఆంధ్రదేశచరిత్ర అన్నమాట. గోలకొండ రాజ్యం స్థాపించినవాడు మలిక్ కూలీ కుతుబుల్ ముల్క్. పెరిషియా దేశస్థుడు ; క్రీ. శ. 1482 లో సింహాసనం ఎక్కిన మహమూద్ బహ్మనీ సుల్తాను కొలువులో కుదిరి నాడు. ఈసుల్తాను సింహాసన మెక్కేటప్పటికి పన్నెండేళ్ల వాడు. ఇతనికాలములో, వెనుక చాలాకాలంనుంచి దక్కనీ ముస్లిములకు విదేశీ ముస్లిములకు వస్తూవున్న కల హాలు మితిమీరిపోయినవి. అరాబియా, అబిసీనియా, తుర్కీ, ఖురాసాను, పెరిషియా, అఫ్గానిస్థానములనుంచి వర్తకంకోసమనో, ఆశ్రయంకోసమనో బహ్మనీరాజ్యానికి వచ్చి వారి కొలువులో కుదిరి, మంత్రిపదవులు, సేనానాయక పదవులు మొదలైన గొప్ప ఉద్యోగాలు సంపాదించినవారూ, ఇక్కడ స్థిరపడినవారూ విదేశీ ముస్లిములు ; బహ్మనీ సుల్తానులు యుద్ధాలలో పట్టుకొని తురకమతం ఇచ్చిన హిందువులూ, తురకమతం పుచ్చుకొని బహ్మనీ రాజ్యములో నివసించి పదవులు సంపాదించిన దేశీయులూ దక్కనీలు. ఈ రెండు పక్షాలవారికీ చాలా కాలంనుంచి వస్తూవున్నది పోరాటం. అవకాశం దొరికినప్పుడల్లా సుల్తాను ప్రాపకం

సంపాదించి అతనిని లోబరచుకొని, దక్కనీలయితే విదే
శీయులను, విదేశీయులయితే దక్కనీలను అణచివేసి, ఎవరికి
వారే అధికారం వహించి తమపక్షం బలపరచుకోడానికి
ప్రయత్నాలు చాలాసారులు జరిగినవి. బహ్మనీరాజ్యం
దుర్బలమై నాశనంకావడానికి ఈదక్కనీ-విదేశీ ముస్లిముల
పోరాటాలే ముఖ్యకారణం. ఇట్టి కలహాలలో ఒకమారు
మలిక్ కూలీ కుతుబుల్ ముల్క్ మహమూదు బహ్మనీని
సంరక్షించడంచేత ఆ సుల్తాను కృతజ్ఞతతో కుతుబుల్
ముల్కును తెలంగాణాకు అధిపతిని చేశాడు. అప్పటినుంచి
అతడు గోలకొండ రాజధాని చేసుకొని దాని పరిసర
ప్రాంతం పాలిస్తూవుండేవాడు.




అయిదు ముస్లిం దక్కను రాజ్యములు

మహమూదు బహ్మనీ సుల్తానుకాలములో బహ్మనీ రాజ్యం విచ్ఛిన్నమయింది. ప్రతాపవంతులూ, బలవంతులూ అయిన అతని సర్దారులు అయిదు రాజ్యాలు స్థాపించారు. ఈ యైదు రాజ్యాలలోను గోలకొండరాజ్యం ఒకటి. మిగిలినవి విజాపురము, అహ్మదునగరము, బేరారు, బీదరు రాజ్యాలు - వీటిని క్రిందటిసారే చెప్పానుకాదూ?

మలిక్ కూలీ కుతుబుల్ ముల్క్ - సుల్తాన్ కూలీ కుతుబ్ షా అనే పేరుతో క్రీ. శ. 1512 నుంచి స్వతంత్రముగా రాజ్యం పరిపాలించాడు. అప్పటికి తెలంగానాలోని కొద్దిభాగంమాత్రమే బహ్మనీ సుల్తానులక్రింద ఉండేది. తెలంగానాలోని మిగిలిన భాగమూ సముద్రపు ఒడ్డునే ఉన్న పూర్వాంధ్రదేశమూ ఒరిస్సామహారాజయిన ప్రతాపరుద్ర గజపతి పరిపాలనలో ఉండేవి. తెలంగానాలోని రాజుకొండ, దేవరకొండ, ఓరుగల్లు, బోనగిరి, కంబంమెట్టు మొదలైన గొప్ప కోటలన్నీ గజపతులవే. విజయనగరాధీశుడు కృష్ణదేవరాయలు కళింగంమీదికి దండెత్తి వెళ్లి పూర్వాంధ్రదేశంలోని గజపతుల దుర్గాలు ఆక్రమిస్తూవచ్చిన కాలములో సుల్తాన్ కూలీ కుతుబ్ షా తెలంగానాలోనుంచి గజపతులను తరిమివేసి రాజుకొండ, దేవరకొండ మొదలైన కోటలు కొన్ని పట్టుకొన్నాడు. తెలంగానాలోనే అని తోస్తుంది - సుల్తాన్ కూలీ కుతుబ్ షాకు విజయనగరాధిపతి కృష్ణదేవరాయలకు కూడా యుద్ధం జరిగింది. ఈయుద్ధములో సుల్తాన్ కూలీ ఓడిపోయినాడు. కృష్ణదేవరాయల

మరణానంతరంకాని సుల్తాన్ కూలీకి తెలుగుదేశంలోని గొప్ప దుర్గాలు పట్టుకోడానికి సాహసం చాలలేదు. క్రీ. శ. 1530 - 1538 సంవత్సరాల మధ్యకాలములో సుల్తాన్ కూలీ కొండపల్లి కొండవీడులు ఆక్రమించడం జరిగింది; కాని ఇది తాత్కాలిక విజయమే. 1538 తరువాత అతనికి పూర్వాంధ్రదేశములో రాజ్యమే లేకపోయింది. రమారమి ముప్పయి నలభయి సంవత్సరాల తరువాతకాని పూర్వాంధ్రదేశం శాశ్వతముగా కుతుబ్ షాహి సుల్తానులకు వశంకాలేదు. సుల్తాన్ కూలీ చనిపోయేనాటికి తెలంగానాలో చాలాభాగం గోలకొండరాజ్యములో చేరిపోయింది.

సుల్తాన్ కూలీ కొడుకు జంషీదుఖాన్ 1543 లో తండ్రిని చంపించి జంషీదు కుతుబ్ షా అనేపేరుతో సింహాసనం ఎక్కి ఏడేళ్లు రాజ్యం పాలించాడు. జంషీదు రాజ్యానికి రాగానే ఇతని సోదరుడు ఇబ్రాహీం తన అన్న తన్ను చంపుతాడేమో అని భయపడి విజయనగరం పారిపోయి అరవీటి రామరాయలను శరణుజొచ్చినాడు. రామరాయలు అప్పుడు సదాశివదేవరాయల ప్రధాని. రాజ్యములోని సర్వాధికారమూ అతనిదే. రామరాయలు ఇబ్రాహీం రాజకుమారుణ్ని ఎంతో దయతో చూసి అతనికి ఒకజాగీరు ఇచ్చి ఆదరించాడు. జంషీదు రాజ్యం చేసినంతకాలమూ ఇబ్రాహీం విజయనగరంలోనే ఉన్నాడు. జంషీదు చనిపోయిన తరువాత అతని సర్దారులూ మంత్రులూ ఏడేళ్ల అతని కొడుకు సుభాన్ కూలీ కుతుబ్ షాను సింహాసనం ఎక్కిం

చారు ; కాని త్వరలోనే రాజ్యంలోని గొప్ప అధికారులు అందరి కోరికవల్లా ఇబ్రాహీం గోలకొండకు తిరుగ వచ్చి రామరాయల సాయముతో సుభాన్ కూలీని ఓడించి క్రీ. శ. 1550 లోనే రాజ్యాధికారం వహించాడు. ఇతడు ముప్పయి సంవత్సరాలు రాజ్యం చేశాడు. ఇతని రాజ్య కాలంఅంతా దక్కనులోని తోడి ముస్లిము రాజ్యాలతోను, హిందూ రాజ్యాలతోను పోరాడడంతోనే సరిపోయింది.

దక్కను ముస్లిము రాజ్యాల చరిత్ర టూకీగా ఒక మాటలో చెప్పాలంటే నిరంతరమూ పరస్పరం పోరాడు కోడం. ఈ రాజ్యాలలో గోలకొండ, విజాపురము, అహ్మదు నగరము రాజ్యాలు పెద్దవి ; బేరారు, బీదరులు చిన్నవి. వీటిలో ఏవొకరాజ్యమైనా పెంపు చెందుతూ, గొప్ప దవుతూ ఉన్నదంటే దానిని కూలగొట్టి మొత్తంమీద దేనిదీ పై చేయి కాకుండా, దేని అధికారమూ, బలమూ మొగ్గు హెచ్చ కుండా ఉండడానికి మిగిలినవి ప్రయత్నించేవి. ఈ రాజ్యా లలో బీదరు, బేరారులు చిన్నవి అవడంవల్ల మిగిలిన మూడు పెద్ద రాజ్యాలతో అవి కలిసినా కలవకపోయినా లాభమూ, ప్రయోజనమూ ఉండేది కాదు. అందువల్ల పెద్ద రాజ్యాలు ఏరెండు పోరాడుతూ ఉన్నా మూడవది ఏదో ఒక పక్షం చేరేది. దానితో ఆపక్షం బలపడి మొగ్గు ఎక్కువయేసరికి తూకం సరిపోయేటందుకు రెండవపక్షం వారు విజయనగరాధీశులను సాయం పిలిచేవారు. విజయ నగరాధీశ్వరుల సైన్యంలో కాల్బలం హెచ్చు గనుక

వారు ఎవరి పక్షం ఉంటే ఆపక్షంవారు తప్పక విజయం పొందేవారు. ఈ ముస్లిము రాజ్యాలలో యుద్ధం సంభవించి నపుడల్లా ఈ సుల్తానులలో ఎవరికో ఒకరికి విజయనగరం వారి సాయం తప్పనిసరి అయేది. రామరాయలు ఈ రాజ్యాలతో ఒకప్పుడు ఒక దానితోను, వేరొకప్పుడు వేరొక దానితోను చేరుతూ, ఎప్పుడో ఒకప్పుడు ఈముస్లిము రాజ్యాలను అన్నిటినీ జయించాడు. విజయం ఎప్పుడూ రామరాయలదే. అందువల్ల సంధికి అళియ రామ రాయలు పెట్టిన షరతులు ఎట్టివయినా ముస్లిము సుల్తానులు అంగీక రింపక తప్పేది కాదు. ఈ రీతిని విజయనగరం మహమ్మ దీయ రాజ్యాలకు ఒకవిధముగా నియంత అయినది.

క్రమముగా ముస్లిము రాజ్యాలు శక్తిహీనములు అవుతూవుండడమూ, విజయనగరం బలపడుతూవుండ డమూ గుర్తించారు చివరికి ఇబ్రాహీం కుతుబ్ షా, నిజాం షాలు. మిగిలిన దక్కను సుల్తానులకు ఈ రహస్యం ఉపదే శించారు. వారు ఉభయులు అందరిని కూడగట్టుకొని క్రీ. శ. 1565 లో విజయనగరంమీదికి దండెత్తి వెళ్లారు. రాక్షస-తంగడివద్ద కృష్ణానదీ ప్రాంతాన గొప్ప భయంకర యుద్ధం జరిగింది. ఆమహాయుద్ధములో ముస్లిములు జయిం చారు; హిందువులు ఓడిపోయినారు. విజయనగరం శత్రు వుల క్రోధావేశానికి సర్వవిధ్వంస మయినది.

అయింది - ఇక ముస్లిము రాజ్యాలది మళ్లీ ఎప్పటి లాటే. ఇప్పుడు విజనగరం పడిపోవడంవల్ల దక్కను సుల్తానులు

ఒకరిని ఒకరు అణచుకోడానికి చాలా వీలయినది. చివరికి ఈ కలహాలలో బేరారు రాజ్యాన్ని అహ్మదునగరం సుల్తానులూ, బీదరురాజ్యాన్ని విజాపురంవారూ ఆక్రమించుకొన్నారు.

విజయనగరరాజ్యం కూలిపోవడంతోనే ఇబ్రాహీం కుతుబుషాకు అడ్డమాకలు లేకపోయినవి విజృంభించడానికి. ఇబ్రాహీము, ఇతని మరణానంతరం క్రీ. శ. 1580 లో సింహాసనం ఎక్కిన ఇతని కొడుకు మహమ్మదు కూలీ కుతుబ్ షా - వీరు ఉభయులూ సముద్రతీరస్థ ఆంధ్ర దేశాన్నీ, రాయలసీమలోని తూర్పు భాగాన్నీ జయించారు. గోలకొండరాజ్యం ప్రభ దేదీప్యమానముగా వెలిగింది ఇబ్రాహీం కుతుబుషాకాలంనుంచీని. గోలకొండ జన సంఖ్య వృద్ధి అయింది. వర్తకవ్యాపారం పెరిగింది. కాని త్రాగడానికి గోలకొండలో జనానికి సమృద్ధిగా నీరు లేక పోయింది. నగరములో అనారోగ్యం హెచ్చింది. అందు వల్ల మహమ్మదు కూలీ గోలకొండకు అయిదు క్రోసుల దూరములో ముసినది వొడ్డున - అతని భార్యలలో ఒకతె భాగ్యమతి; ఆవిడపేర - భాగ్యనగరము అని ఒక నగరం కట్టించాడు ; తరువాత క్రీ. శ. 1588 లో ఈ పేరు మార్చి వేసి-అతని కొడుకులలో ఒకడు హైదరు, అతని పేర-దానికి హైదరాబాదు అని పేరు పెట్టినాడు. అదే ఇప్పటి హైదరాబాదు (దక్కనులోనిది). మహమ్మదు కూలీ ముసికి ఆనకట్ట కట్టించి నగరంలోనికి గొట్టాలగుండా నీరు తెప్పించి నగర

వాసులకు నీటి కరవు లేకుండా చేశాడు. వ్యవసాయానికి చెరువులు కట్టించి నీటిపారుదలకు సౌకర్యాలు చాలా కల్పించాడు. గోలకొండరాజ్యం అతనికాలములో భాగ్య భోగ్యాలతో తులదూగింది. మొగలాయి ఢిల్లీ పాదుషాలు దానిని చూసి గుటకలు వేశారు, ఎప్పుడు దానిని తమ రాజ్యములో కలుపుకొందామా అని. ఈలోగా వారు క్రీ. శ. 1600 లలో అహ్మదునగర రాజ్యాన్ని ఆక్రమించుకొన్నారు. ఇక మిగిలిన దక్కను రాజ్యాలల్లా విజాపురము, గోలకొండ లే. మొగలాయి పాదుషాలు గోలకొండను వశపరచుకోడానికి ఎత్తులు ప్రారంభించారు. అప్పుడు ఢిల్లీ పాదుషా షాజహాన్. త్వరలోనే వచ్చింది మొగలాయిలు గోలకొండ రాజ్యాన్ని ఆక్రమించుకొనేటందుకు అవకాశం.

మహమ్మదు కూలీ కుతుబుషా తరువాత అతని తమ్ముడి కొడుకు మహమ్మదు కుతుబుషా క్రీ. శ. 1612 లో సింహాసనం ఎక్కి 1626 దాకా పద్నాలుగేళ్లు రాజ్యం పాలించి కాలంచేశాడు. అటుతరువాత రాజ్యానికి వచ్చినవాడు అతని కొడుకు అబ్దుల్లా కుతుబ్ షా. ఈవంశంవారందరిలో చిరకాలం రాజ్యం పాలించింది ఇతను; 1672 దాకా రాజ్యం ఏలినాడు. ఇతనికాలంనాటికి ఆంధ్ర దేశం అంతా గోలకొండ సుల్తానుల వశమయినది. గోలకొండ ఆంధ్రరాజ్యమే. అది ఉత్తరాన గంజాము జిల్లాదాకా వ్యాపించింది. అబ్దుల్లా కుతుబ్ షా ప్రధాని మీర్ జుమ్లా. ఆనాటి గొప్ప రాజతంత్రజ్ఞులలో ఇతడు ఒకడు ; చాలా సమర్థుడు. మొదట

ఢిల్లీ మొగలాయి ఫాదుషాల కొలువులో ఉండి వారితో సరి పడక దక్కను పారిపోయివచ్చి కుతుబుషాహి సుల్తానుల కొలువులో చేరినాడు. ఇక్కడకూడా అతనికి సుల్తాను అబ్దుల్లాకు సరిపడలేదు. సుల్తాను ఇతనిని శిక్షించాలని తలపెట్టినాడు. ఇది పసికట్టి అప్పటినుంచి ఇతడు షాజహాన్ ఫాదుషా కొడుకు ఔరంగజేబుతో కలసి రహస్యముగా సుల్తానుమీద కుట్రలు చేశాడు. చివరికి కుతుబుషాహీల కొలువు విడిచి పెట్టి మీర్ జుమ్లా ఔరంగజేబు పక్షం చేరి అతనికి నమ్మిన బంటయినాడు. గోలకొండను సాధించా లనుకొంటున్న ఔరంగజేబుకి ఇది రొట్టె విరిగి నేతిలో పడ్డట్టయింది. అతడు మీర్ జుమ్లా సాయముతో అబ్దుల్లా కుతుబ్ షాను సామంతుణ్ని చేసుకొని అతనిదగ్గరనుంచి కప్పం తీసుకొన్నాడు. అయినా అతనికి తృప్తి కలుగలేదు.

క్రీ. శ. 1658 లో ఢిల్లీఫాదుషా అయినప్పటినుంచీ ఔరంగజేబు గోలకొండ, విజాపురరాజ్యాలు నాశనం చేయాలనీ, వాటిని తన విశాలసామ్రాజ్యములో చేర్చి వేయాలనీ నిశ్చయించుకొన్నాడు. ఈపని గోలకొండ సుల్తానులలో కడపటివాడు తానషా అని ప్రసిద్ధుడైన అబుల్ హసన్ కుతుబ్ షా కాలములో జరిగింది.

అబ్దుల్లా కుతుబ్ షా అల్లుడు అబుల్ హసన్; మామగారి మరణానంతరం 1672 లో గోలకొండ సింహాసనం

ఎక్కి 1687 దాకా రాజ్యం పాలించాడు. మాదన్నగారు తానషా దగ్గర ప్రధాని; అక్కన్నగారు సర్వసైన్యాధిపతి. 1686లో ఔరంగజేబు పాదుషా విజాపురపు కోట పట్టు



అబుల్ హసన్ కుతుబుషా

కొన్నతరువాతనే గోలకొండ సాధించడం అతనికి సులువైనది. గోలకొండ కోట గుట్టు మట్టులు ఎరిగిన మీర్ జుమ్లా ఔరంగజేబు పాదుషాకు తోడు. పాదుషా గోలకొండ కోటను 1687 జనవరిలో ముట్టడించాడు. సర్వసామ్రాజ్య

బలమూ సర్వసౌకర్యాలూ ఉన్నప్పటికీ తొమ్మిది నెలలకు - సెప్టెంబరులో - కాని అది ఫాదుషాకు వశం కాలేదు. అప్పు డయినా బలప్రతాపాలవల్ల కాక వంచనవల్ల ఔరంగజేబు గోలకొండకోట సాధించాడు. 1687 లో గోలకొండకోట పడిపోయింది. అబుల్ హసన్ తానషా మొగలాయిలకు ఖైదీ అయినాడు. పడిపోయేనాటికి గోలకొండకు సాలీనా వచ్చే ఆదాయం రెండుకోట్ల ఎనభైయేడు లక్షల రూపా యలు. కోట పట్టుబడగానే ఔరంగజేబు ఫాదుషాకు ఏడు కోట్ల రూపాయల నగదే దొరికిందట - వెండి బంగారు పాత్రసామగ్రీ, నగలూ కాక. గోలకొండ పతనముతో ఆంధ్రదేశం మళ్లీ ఢిల్లీ మొగలాయి ఫాదుషాల పరిపాలన క్రిందికి వచ్చింది.

గోలకొండ కుతుబ్ షాహి సుల్తానులు హిందూరాజు లతో పోరాడినా తమరాజ్యంలోని హిందువులను న్యాయ ముగా పరిపాలించారు ; హిందువులను ముస్లిములను సరిసమా నముగా ఆదరించారు. కుతుబ్ షాహి పరిపాలనలో హిందు వులూ ముస్లిములూ సోదరులలాగ వ్యవహరించారు. గోల కొండ సుల్తానులు ఉద్యోగాలలో హిందువులను నియమిం చారు ; వజీరు (ప్రధాని), సర్ లష్కరు (సర్వ సైన్యాధి పతి) పదవులదగ్గరనుంచి గుమాస్తా పదవివరకు హిందు వులకు ముస్లిములకుకూడా ఇచ్చారు. ముస్లిము విద్వాంసు లను విద్యలను, హిందూ కవులను పండితులను వేద విద్యలను సరిసమానముగా పోషించారు. కుతుబ్ షాహి సుల్తానులు

వేదాధ్యయన సంపన్నులకు ఇచ్చిన అగ్రహారాలు ఉన్నవి. ఫారసీ రాజభాష అయినది. అయినా సుల్తానులు తమ రాజ్యంలోని ప్రజలభాష తెలుగునుసైతం అభ్యసించారు; తెలుగుకవులను పోషించారు; తెలుగు కావ్యాలు అంకితం తీసుకొన్నారు. వారి ఆదరణక్రింద అద్దంకి గంగాధరకవి తపతీసంవరణము, పొన్నికంటి తెలగన్న యయాతి చరిత్ర, కందుకూరి రుద్రకవి నిరంకుశోపాఖ్యానము అనే కావ్యాలు వ్రాశారు. ఇబ్రాహీం కుతుబ్ షా తెలుగుకవుల కావ్యగీతి కలలో ఇభరాముడే అయినాడు. గోలకొండరాజ్యము తెలుగురాజ్యమూ, గోలకొండ సుల్తానులు తెలుగుప్రభువులూ అయినారు. గోలకొండ హిందువులను అభిమానించడమే దోషమయింది ఔరంగజేబుకు. అదే దాని పతనానికి ముఖ్యకారణం.

# పన్నెండవ ప్రసంగము

## మొగలాయి పరిపాలనము

గోలకొండరాజ్యం అంటే ఆంధ్రరాజ్యమే అని చెప్పాను కాదూ? గోలకొండకోట పతనముతో ఆంధ్రులం మనం ఢిల్లీ మొగలాయిఫాదుషా ఔరంగజేబు పరిపాలనక్రిందికి వచ్చాము. మొగలాయిల దక్కను సుబాలోని ఇరవై రెండు పరగణాలలో గోలకొండ ఒకటి. గోలకొండరాజ్యం అంతా ఔరంగజేబు అధికారంలోనికి వచ్చింది. కాని అది అంత సులువుగా అతనికి చేపడలేదు. గోలకొండకోట పతనముతో ఎక్కడికక్కడే ఆరంభమైనవి అల్లరులు; అరాజకం ప్రబలింది. గోలకొండ సామంతులైన నాయకులూ జమీన్‌దారులూ స్వతంత్రులై ప్రజలను నిరంకుశముగా పాలించారు. వీరందరిని అణచివేయడానికి కొంతకాలం పట్టింది. గోలకొండ సామంతులతోడి యుద్ధాలలో పేరు ప్రతిష్ఠలు పొంది మొగలాయి సామ్రాజ్యానికి ఎక్కువ సేవ చేసిన మొగలాయి సేనాధిపతి జుల్‌ఫికారుఖాన్. జింజి దాకాగల దేశాన్నంతను ఇతనే జయించాడు. పశ్చిమాంధ్ర దేశములో ప్రఖ్యాతములైన కందనవోలు (కర్నూలు), గండికోట, గుర్రంకొండ మొదలైన గొప్ప కోట లన్నీ జుల్‌ఫికారుఖాను జయించినవే.

తన సామ్రాజ్యాన్ని విధ్వంసం చేస్తూవున్న మహారాష్ట్రులను అణచివేసే ప్రయత్నములో ఉండడంవల్ల గోలకొండ రాజ్యములో చెలరేగిన అరాజకాన్ని పూర్తిగా అరికట్టడానికి ఔరంగజేబు ఫాదుషాకు పూర్తిగా సాధ్యం కాకపోయింది. కొందరు నాయకులకు మొగలుసేనలో నాయకత్వమిచ్చి, మరికొందరికి జమీనులిచ్చి, వేరొకకొందరిని తన సరదారులను బంపి అణచివేయించి - ఈ విధముగా ఔరంగజేబు ఫాదుషా దేశాన్ని కొంతవరకు ఒకకట్టడిలోనికి తీసుకొని వచ్చాడు; తన చిన్న కొడుకు కాంబక్షును గోలకొండకు అధిపతిని చేశాడు. కాని అది ఇంకా మొగలాయిల కట్టుదిట్టమైన పరిపాలనక్రిందికి రాకపూర్వమే క్రీ. శ. 1707 లో ఔరంగజేబు ఫాదుషా చనిపోయినాడు. అంతటినుంచి మళ్లీ మొదలు ఫాదుషా కొడుకులలో ఢిల్లీ సింహాసనానికి తగవులూ, యుద్ధాలూను.

తండ్రి మరణవార్త తెలియగానే కాబూలులో ఉన్న పెద్ద కొడుకు ముఅజ్జమ్ తన సోదరుడు అజీమును యుద్ధములో చంపి తరువాత ఢిల్లీకి వెళ్లి బహదూరుషా అనే పేరుతో సింహాసనం ఎక్కినాడు; అటుతరువాత దక్షిణ దేశానికి పోయి యుద్ధములో చివరి సోదరుడు కాంబక్షును చంపి తన కిక తమ్ములవల్ల ఉపద్రవం లేకుండా చేసుకొన్నాడు. ఇతని వజీరు జుల్ఫికారుఖాను. కాంబక్షు చనిపోయిన తరువాత కొంతకాలం ఇతడు దక్కను సుబాదారుగా పనిచేసి

ఢిల్లీకి వజీరుగా వెళ్లాడు. జుల్ఫికారుఖాను అనంతరం దక్కను సుబాదారు దావూదుఖాను.

బహదూరుషా దగ్గరనుంచి ఢిల్లీ సింహాసనం ఎక్కిన మొగలాయి పాదుషాలు సమర్థులుకారు. అందువల్ల వారి వజీరులే బలవంతులై సర్వాధికారులయినారు. పాదుషాది పేరే కాని అధికారమంతా వజీర్లదే. ఇటువంటి వజీర్లలో జుల్ఫికారుఖాను మొదటివాడు. బహదూరుషా 1712 లో కాలధర్మం పొందినాడు. అటుపిదప జుల్ఫికార్ఖాను సహాయముతో బహదూరుషా పెద్ద కొడుకు జహాందరుషా పాదుషా అయినాడు.

మొగలాయి పాదుషాల కొలువుకూటం కుట్రలకు పుట్ట అయినది. తమ ఇష్టం వచ్చినవారిని సింహాసనం ఎక్కించడము, లేనివారిని దింపించడము, చంపించడము- ఇవి వజీర్ల పనులు ఆ కాలములో. ఈ విధముగా ప్రముఖులూ ప్రసిద్ధులు అయినవారు సయ్యదు సోదరులు అనే సయ్యదు అబ్దుల్లా, సయ్యదు హుస్సేనలీలు. ఈ వజీర్ల కుట్రలమూలముగా జహాందరుషా తరువాత ఫర్రూక్సియర్ మొదలైనవారు ఎవరెవరో పాదుషా లయినారు. చివరికి 1719 లో మహమ్మదుషా ఢిల్లీ పాదుషా అయినాడు.

ఈ కాలములో పాదుషాకు చేసిన సాయంవల్లనయితే నేమి, యుద్ధాలలో చేసిన సేవవల్లనయితేనేమి పైకి వచ్చినవాడు చిన్కిలిక్ఖాన్. ఇతనికి అసఫ్జా అనీ, నిజామ్

ఉల్ ముల్క్ అనీ కితాబులు. ఇతడు రాజ్యతంత్రంలోను యుద్ధతంత్రంలోనుకూడా నేర్పరి. మొదటిసారి ఇతనిని ఫర్రూక్ సియరు పాదుషా దక్కను సుబాదారుగా నియమించాడు; కాని ఆ పదవిని అసఫ్ జా మహమ్మదు పాదుషా కాలములో కాని శాశ్వతముగా అలంకరించి నిర్వహించ లేదు. ఇతనికి మహమ్మదు పాదుషాకు కూడా సరిపడలేదు. ఇతనిని చంపి వేయవలసిందని పాదుషా తన సామంతులకు రహస్యముగా ఆజ్ఞ యిచ్చాడు. పాదుషా సామంతులకు అసఫ్ జాకు 1724 లో ఔరంగాబాదుకు పన్నెండుమైళ్ల దూరములో ఉన్న షక్కర్ ఖేడ్ వద్ద పెద్ద యుద్ధం జరిగింది. దానిలో పాదుషా సామంతులను ఓడించి అసఫ్ జా విజయం పొంది సర్వస్వతంత్రు డయినాడు. అప్పటినుంచీ అతడు స్వతంత్రంగానే పాలించాడు దక్కను సుబాను. అతని రాజధాని హైదరాబాదు.

## నిజామ్ ఉల్ ముల్క్ పరిపాలనము

1724-వ సంవత్సరంనుంచి మనకూ మొగలాయి పాదుషాలకూ సంబంధం తెగిపోయింది. మన అంధ్రదేశం ఆనాటినుంచి అసఫ్ జావంశంవారి పరిపాలనలోనికి వచ్చింది. మొగలాయిలక్రింద ఉండే దక్షిణరాజ్యాని కంతకు అసఫ్ జా నిజామ్ ఉల్ ముల్క్ పరిపాలకుడయినాడు. ఇతడు 1748 లో గతించాడు.

అసఫ్‌జాకు చాలామంది కొడుకులూ కూతుళ్లూను. చనిపోయేనాటికి అతడు కూతుళ్లవల్ల మనుమల నెత్తినాడు, మనుమలూ పెద్దవాళ్లే. అతని కొడుకులలోను మనుమల లోను ముఖ్యముగా ఇక్కడ చెప్పవలసినవారు నలుగురు: నాజరుజంగ్, సలాబత్‌జంగ్, నిజామల్లీలు అసఫ్‌జా కొడుకులు; ముజఫర్‌జంగ్ అతని మనుమడు. అసఫ్‌జా చనిపోగానే నాజర్‌జంగ్ ముజఫర్‌జంగులు ఉభయులూ దక్కను సింహాసనం ఆక్రమించుకొనేటందుకు కలహించారు. అసలు అసఫ్‌జాకు నాజర్‌జంగ్ అంటే ఇష్టం లేదు; తన అనంతరం తన మనుమడు ముజఫర్‌జంగే రాజ్యానికి రావాలని అతని కోరిక. దక్కనురాజ్యం నిమిత్తం నాజర్ జంగుకు ముజఫర్‌జంగుకు వచ్చిన ఈ రాజకీయ వివాద ములో జోక్యం కలిగించుకొన్నారు యూరోపియను వర్త కులు ఇంగ్లీషువారూ ఫ్రెంచివారూను.

మనదేశంతోను తూర్పుద్వీపాలతోను జరుగుతూ వచ్చిన ఈవర్తకం బాగా లాభిస్తూరావడంచేత ఇంగ్లాం డులో మరికొందరు ఇంగ్లీషువారు ఒక కంపెనీగా ఏర్పడి ఈవ్యాపారం ఆరంభించారు. దీనితో ఈవర్తకం చేస్తూ వచ్చినవి ఇంగ్లీషు కంపెనీలు రెండు. వర్తకం విషయ ములో వీరిలో వీరికి, వీరికే కాదు, ఇతర యూరోపియను కంపెనీలకు వీరికికూడా గొప్ప పోటీ పడింది. ఈ యూరోపి యను వర్తక కంపెనీలవారు ఒకరితో ఒకరు పోరాడు కొంటూ, యుద్ధాలు చేసి ఒకరి వర్తకస్థానాలు ఒకరు పట్టు

కొంటూ సంధులు చేసుకొంటూ వ్యాపారం సాగించారు. 1702 నాటికి ఇంగ్లీషు వర్తక కంపెనీలు రెండూ కలిసిపోయి ఒక్కటయినవి. ఏకమయిన ఈవర్తక సంఘానికి 'యునైటెడ్ కంపెనీ ఆఫ్ మర్చంట్స్ ట్రేడింగ్ టు ది ఈస్టిండీస్' అని పేరు. 1708 నుంచి దీని ప్రభ వెలిగింది. దీనినే 'ఈస్టిండియా కంపెనీ' అని, 'కుంపిణీ' అని అంటారు. కుంపిణీ వారికి మద్రాసున్న (చెన్నపట్టణం), ఫ్రెంచివారికి పుదుచ్చేరి(పాండిచేరి)న్నీ ప్రధానస్థానాలుగా ఉండేవి.

1748 నాటికి ఇంగ్లీషువారు ఫ్రెంచివారు ఈ వర్తకపు పోటీలో నెగ్గి నిలబడ్డారు. డచ్చివారు, పోర్చుగీసువారు వెనుకబడిపోయి అడుగంటినారు. ఈకాలములో ఇంగ్లీషు వారికీ ఫ్రెంచి వారికీ రాజ్యం సంపాదించాలని బుద్ధి పుట్టింది. ఉభయులూ ఆనాడు దేశాన్ని పాలిస్తూవచ్చిన పరిపాలకుల రాజకీయ వివాదాలలో జోక్యం కలిగించుకోడం ఆరంభించారు. తంజావూరు సింహాసనానికి వచ్చిన తగాదాలో మొదటిమారు ఇంగ్లీషువారు ఒకరిపక్షం వహించి నెగ్గి దానివల్ల లాభం పొందినారు. ఈవిధముగానే ఆకాలములో కర్నాటకం నవాబుగిరీనిగురించిన్నీ వివాదం వచ్చింది. కర్నాటకం నవాబు హైదరాబాదు నిజాం సామంతులలో ఒకడు. ఈ నవాబుగిరీనిగురించి చందాసాహేబు మహమ్మదలీలకు తగాదా పడింది. ముజఫరుజంగ్ చందాసాహేబును సమర్థిస్తే నాజర్ జంగ్ మహమ్మదలీకి మద్దతు. 1748లో హిందూ దేశములో ఫ్రెంచివారి వర్తక వలసస్థానాలు అన్నిటిమీదా

అధికారి గవర్నరు డూప్లే. ఇతడు చందాసాహేబు పక్షం వహించాడు. ఇంగ్లీషువారు మహమ్మదల్లీ పక్షం చేరినారు. మహమ్మదల్లీని రక్షించడానికి రాబర్టు క్లైవు ఆర్కాటును ముట్టడించింది ఈకాలంలోనే.

చివరికి దక్కను సుబాదారీ విషయములో నాజర్ జంగ్ ప్రయత్నాలే ఫలించి అతడే దక్కను సింహాసనం ఎక్కినాడు; కాని ఇతడు ఆట్టే కాలం పరిపాలించలేదు ; 1750 లో హతుడైనాడు.

ఈ సందర్భములో ఫ్రెంచివారు ముజఫర్ జంగ్‌ను సుబాదారుగా ప్రకటించారు: వారు హైదరాబాదులో పట్టం కట్టడానికి ముజఫర్ జంగును వెంటబెట్టుకొని పుదుచ్చేరినుండి తీసుకొనివెడుతూవుండగా దారిలో అతని విరోధులు అతనిని చంపివేశారు. వెంటనే ఫ్రెంచివారు సలాబత్ జంగ్‌ను దక్కను సుబాదారు చేశారు. సుబాదారు తమపక్షం ఉండడంవల్ల ఫ్రెంచివారికి చాలా ఉపకారం కలిగింది. ఫ్రెంచివారి పలుకుబడీ, అధికారమూ ఎక్కువైనవి. తన్ను సింహాసనం ఎక్కించినందుకు సలాబత్ జంగ్ ఫ్రెంచివారికి వారిసైన్యపోషణాని కయ్యేఖర్చుల నిమిత్తం ఉత్తర సర్కారు లైదింటిలోను నాల్గింటిని - ముస్తఫానగర్ (కొండపల్లి), ఏలూరు, రాజమహేంద్రవరము, శ్రీకాకుళము సర్కారులను ఇచ్చాడు. ఇవి అంత సులువుగా ఫ్రెంచివారికి వశము కాలేదు. వీటిని వశపరచుకోడానికి ఫ్రెంచివారికి చాలాకాలం పట్టింది. ఈసం

దర్భంలోనే 1757 లో బొబ్బిలియుద్ధం జరిగింది. ఈయుద్ధములో విజయనగరం అధిపతి విజయరామరాజు ఫ్రెంచివారికి సాయంచేశాడు. వీర బొబ్బిలి పడిపోయినా విజయరామరాజుకు మేలు కలుగలేదు. విజయరామరాజును తాండ్ర పాపారాయడు - బొబ్బిలివారి బంధువు - అనతి కాలంలోనే చంపివేశాడు. బొబ్బిలి యుద్ధానంతరం విజయరామరాజు అన్నకొడుకు ఆనందగజపతి మహారాజు ఫ్రెంచిసైన్యాధిపతి బుస్సీ చేసిన ఏర్పాటులతో తృప్తిపడలేదు. అందువల్ల అతడు ఉత్తర సర్కారులు జయింపదలచుకొంటే తాను సాయపడతానని కలకత్తాలో ఉన్న క్లైవుతో రాయబారాలు జరిపినాడు. క్లైవు అతని వాగ్దానానికి సంతోషించి వెంటనే కలనల్ ఫోర్డును సైన్యముతో పంపినాడు. ఈలోగా పుదుచ్చేరి గవర్నరు బుస్సీని కర్ణాటకానికి రావలసిందని తాఖీదు చేశాడు. ఈయదనులో ఆనందగజపతి సాయముతో కలనల్ ఫోర్డు ఫ్రెంచివారికి వశమైన సర్కార్లను తిరిగి జయించాడు; సరాసరి హైదరాబాదు వెళ్లినాడు. ఇంగ్లీషువారికి అంత సులువుగా అంత శీఘ్రకాలములో చేపడిన విజయాలకు ఆశ్చర్యం పొంది, వారి సమర్థతకు పరాక్రమానికి భయపడి సలాబత్ జంగ్ ఇంగ్లీషువారితో 1759లో సంధిచేసుకొన్నాడు. అంతటితో ఫ్రెంచివారి అధికారం సర్కార్లలో అంతరించింది.

## కుంపిణీ పరిపాలనము

హైదరాబాదు నిజాము కొలువులో కుంపిణీవారి పలుకుబడీ ప్రతిష్ఠా హెచ్చినవి. ఇక ఫ్రెంచివారు తాము పోగొట్టుకొన్న పలుకుబడినీ ప్రతిష్ఠనూ మళ్లీ గడించలేక పోయినారు. వారి ప్రభ సన్నగిల్లింది. మన ఆంధ్రదేశం లోని సముద్రతీరపు సర్కార్ల భాగం కుంపణీ పాలనలోనికి వచ్చింది. 1761 లో నిజామల్లీ, సలాబత్‌జంగును పద భ్రష్టుణ్ని చేశాడు; సింహాసనం ఎక్కినాడు. ఈతడవ ఇంగ్లీషువారు నిజామల్లీపక్షం వహించి 1766 లో అతనితో సంధి చేసుకొన్నారు. ఇతనివల్లనుంచి కూడా సర్కారులు వ్రాయించుకొన్నారు. అయిదవ ముర్తుజా నగరు (గుంటూరు) సర్కారు ఇంగ్లీషువారికి 1788 లో దఖలుపడింది.

నిజామల్లీ రాజ్యానికి వచ్చినకాలంలోనే మైసూరు రాజ్యానికి అధిపతి అయినాడు హైదరల్లీ. ఇతడు గొప్ప వీరుడు; పశ్చిమాంధ్ర దేశాన్ని అంతను జయించాడు. ఈ కాలములో దక్షిణ హిందూదేశములో ప్రబలమైనవి మూడు రాజ్యాలు: మహారాష్ట్ర రాజ్యము, హైదరల్లీ మైసూరు రాజ్యము, హైదరాబాదు నిజాంరాజ్యము. ఈ రాజ్యాధిపతు లకు ఒకరితో ఒకరికి పడింది కాదు; ఒకరిరాజ్యంమీద ఒకరు దాడులు చేస్తూఉండేవారు. 1782 లో హైదరల్లీ చనిపోయే నాటికి మైసూరు బలప్రాభవాలుగల రాజ్యమయినది. హైదరల్లీ తరువాత మైసూరు రాజ్యానికి వచ్చినవాడు

అతని కొడుకు టీపు సుల్తాను. మైసూరు రాజ్యం ప్రబలమవడం మహారాష్ట్రులకు, నిజాముల్ ముల్కుకు ఇష్టం లేకపోయింది. టీపుసుల్తానుకు ఇంగ్లీషువారికికూడా ప్రబల విరోధం. ఇటు వంటి పరిస్థితులలో నిజామ్ ఉల్ ముల్కున్ను మహారాష్ట్రులున్ను ఇంగ్లీషువారి సాయం తీసుకొని 1799లో మైసూరు రాజ్యం రాజధాని శ్రీరంగపట్టణాన్ని ముట్టడించారు. ఈ ముట్టడిలో టీపుసుల్తాను హతుడయినాడు. అదివరలో చేసుకొన్న ఒడంబడిక ప్రకారం తనకు చేసిన సాయానికి ప్రతిఫలముగా హైదరాబాదు నిజాము ఇంగ్లీషువారికి వారి సేనల పోషణ కయ్యేవ్యయము నిమిత్తం పశ్చిమాంధ్ర మండలాలను ఇచ్చాడు. అందువల్లనే వాటికి దత్తమండలాలని పేరు వచ్చింది. ఈ మండలాలనే ఇప్పుడు మనం రాయలసీమ అంటున్నాము. అప్పటినుంచీ పూర్వ పశ్చిమాంధ్ర ప్రాంతాలు కుంపిణీ పాలనలోనికి రాగా హైదరాబాదు రాజ్యంలోని తెలంగానా అసఫ్‌జావంశంవారి పరిపాలనలోనే ఉండిపోయింది.

1857లో కుంపిణీవారు తమ అధికారాన్ని అంతా బ్రిటీషు పార్లమెంటుకు, విక్టోరియా మహారాజ్ఞికి వశపరిచారు. ఆనాటినుంచీ మన ఆంధ్రదేశం బ్రిటీషు పరిపాలనలోనికి వచ్చింది. మనం బ్రిటీషు పార్లమెంటువారి చట్టాలకు బద్ధులమయినాము.

1857 నాటికి దేశీయులైన హిందూ ప్రభువుల, ముస్లిమునవాబుల స్వతంత్రాధికారం అంతరించింది. వా

రందరు బ్రిటీషువారికి సామంతులైనారు. ఇంగ్లీషు రాజభాష అయినది. ప్రభుత్వోద్యోగాలనిమిత్తం జనము కావలసి వచ్చి కుంపిణీవారు పాఠశాలలు పెట్టినారు. విద్య ఇంగ్లీషులో నేర్పినారు. ఆంగ్ల పాఠశాలలలో చదువుకోడానికి జను లందరికీ సమానావకాశాలు ఏర్పడినవి. ఆంగ్ల సాహిత్యానికి దేశములో ఆదరం హెచ్చింది; ఆంగ్ల వాఙ్మయానికి ప్రచారం అధికమైనది. ఆంగ్లభాష చదివినవారికే ఉద్యోగాలు. ఇంగ్లీషువారి సంస్థలమీదా, పద్ధతులమీదా ఆంగ్ల విద్యార్థికులకు గౌరవమూ మోజూ ప్రబలింది. జనులలో భౌతిక శాస్త్రజ్ఞానం అతిశయించింది. హేతువాదంమీద వారికి అభిరుచి కలిగింది.

పరిపాలనలో పూర్వపు కట్టుబాటులు పద్ధతులు పోయినవి. గ్రామపంచాయితీ పరిపాలన శిథిలమయినది. దేశపరిపాలనకు కలెక్టరులు నియమితులైనారు. సివిలు తగాదాల పరిష్కారానికి కోర్టులు ఏర్పడినవి. రైల్వేలు వచ్చి ప్రయాణం తేలికయినది. పోస్టు సౌకర్యాలు లభించినవి. దేశం అరాజకములోనుంచి బయటబడింది; జనులు ఆము సుఖపడుతున్నందుకు ఒక నిట్టూర్పు విడిచారు.

కులముల వర్ణముల ఎక్కువ తక్కువ విభేదాలు క్రమముగా సమసిపోయినవి. ఆదర పోషణల నిమిత్తం హిందూ మతం వెదుక్కోవలసివచ్చింది. వేదవిద్య లెండిపోయిన కాల మది. ఈ కాలములో బ్రాహ్మణునికి వెనుకటి ప్రాముఖ్యము పోయింది. సంఘములో అతనికి వెనుకటి

V. R. NARLA MEMORIAL LIBRARY Acc. No.

పెద్దరికమూ తరిగింది. అనర్థకమైన ఆచారాలూ, అర్థం లేని విశ్వాసాలూ సంఘాన్ని చీడపురుగులలాగ పట్టుకొని పీడించినవి. అయినదీ కానిదీ మత మనే పేరుతో సమర్థిత



శ్రీ కందుకూరి వీరేశలింగం

మయినది. పాశ్చాత్య మన్నదానికల్లా విలువ హెచ్చిన ఈ కాలములో ప్రాచీనం జీవం నిలుపుకోడానికి పెనగులాడింది. అది ప్రాచీన నవీన, ప్రాచ్య పాశ్చాత్య సభ్యతలకూ సంస్కృతులకూ సంఘర్షణ రేకెత్తిన కాలం. ఈ ప్రాత క్రొత్తల సంధి కాలంలోనే 1848 లో జన్మించాడు శ్రీ కందుకూరి వీరేశలింగం.

---

Renaissance Printers Ltd., T. Nagar, Madras-17

## మనము ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

| | |
|---|---|
| పుస్తకం సంఖ్య | AOUA105B145 |
| పుస్తకం పేరు | ఆంధ్రదేశ చరిత్రసంగ్రహము |
| తారీఖు | 31 December 2025 |
| ముందు అట్ట | NO |
| వెనుక అట్ట | NO |
| మొత్తం పేజీలు | 145 |
| పెద్ద సైజు పేజీలు | NO |
| ఖాళీ పేజీలు | NO |
| లేని పేజీలు | NO |
| తయారు చేసినది | [illegible] |
| పేజీలు విడదీసినది | Vedavathi. |
| స్కాన్ చేసినది | Teja |
| పరీక్ష చేసినది | anusha |
| పేజీలు పరిశీలించినది | |
| బైండింగు చేసినది | |
| ప్యాకింగు చేసినది | |
| పరిస్థితి | good |